ఆగస్టు, 2018

# స్థానిక పాలన

## గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి : 01 సంచిక : 01 పేజీలు : 68



## రైతులకు ఆత్మబంధువు రైతు బంధు పథకం




టిఎస్ఐఆర్‌డిలో జరిగిన 3వ తెలంగాణ రాష్ట్ర ఉపాధి హామి కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీ వికాస్‌రాజ్ ఐఏఎస్, కమీషనర్ శ్రీమతి నీతూ కుమారి ప్రసాద్ ఐఏఎస్




నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్‌ల శిక్షణకై మాడ్యూల్స్ తయారీ చేయుటకు నిర్వహించిన టిఎన్ఏ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎన్ఐఆర్‌డి & పి.ఆర్. డైరెక్టర్ జనరల్ డా॥ డబ్ల్యు.ఆర్. రెడ్డి ఐఏఎస్



మహిళా పొదుపు సంఘాలకు బ్యాంక్ లింకేజి అంశాలపై బ్యాంకు మేనేజర్స్‌తో టిఎస్ఐఆర్‌డిలో జరిగిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న టిఎస్ఐఆర్‌డి ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీమతి పౌసమి బసు ఐఏఎస్

# టి.ఎస్.ఐ.ఆర్.డి

## TSIRD






సంపుటి : 01 సంచిక : 01

ఆగస్టు 2018



ఎడిటర్

**పౌసమి బసు**, ఐ.ఏ.ఎస్.

సిఇఓ, టిఎస్ఐఆర్డి

ఎడిటోరియల్ బోర్డు

**ఇ.ఆర్. బి. నరేంద్రనాథ్ రావు**
**జి. జయపాల్‌రెడ్డి**
**ఇ.ఎస్. నాయక్**
**బి. శేషాద్రి**
**ఎస్. రామకృష్ణ**
**కె. మాధురి**
**జి.వాణి**
**డా॥ జి. ఆంజనేయులు**
**కె. యాదయ్య**
**ఎ.నాగేశ్వరరావు**

కాన్సెప్ట్, ప్లానింగ్, ఎడిటింగ్, డిజైనింగ్

**సెంటర్ ఫర్ మీడియా & పబ్లికేషన్స్,**
**టిఎస్ఐఆర్డి మరియు**
**నవతెలంగాణ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్



Online Publications

**టిఎస్ఐఆర్డి**
రాజేంద్రనగర్
హైదరాబాద్ - 500 030
తెలంగాణ, ఇండియా.
ఫోన్ : 040 - 24018656
ఫ్యాక్స్ : 040 - 24017005
E-mail:editorsthanikapalana@gmail.com
Website: www.tsird.gov.in



ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికిగాని, టిఎస్ఐఆర్డికిగాని చెందినవిగా భావించనక్కరలేదు


# విషయ సూచిక


| | | |
|---|---|---|
| దేశం డిజిటల్ సాంకేతిక వాడకం దిశగా అడుగులు | - | 5 |
| టిఎస్ఐఆర్డిలో ప్రత్యేక ఆటల సదుపాయాల కల్పన | - | 7 |
| ఉపాధి పనుల్లో వేగం పెంచాలి | - | 8 |
| కొత్త తెలంగాణ పంచాయతీరాజ్ చట్టము-2018 కొన్ని ముఖ్యాంశములు | - | 9 |
| ఎన్.ఐ.ఆర్.డి & పి.ఆర్ లో యునిసెఫ్ ఆధ్వర్యంలో త్రాగునీరు మరియు పారిశుధ్య రంగాల పై జరిగిన సమ్మేళనం | - | 10 |
| ప్రగతి పథంలో గ్రామీణ భారతావని | - | 11 |
| నూతన పంచాయతీరాజ్ చట్టం-2018 లో పంచాయతీ కార్యదర్శి విధులు, బాధ్యతలు | - | 14 |
| స్త్రీలపై అణచి'వేత'లకు అంతమెప్పుడు? | - | 17 |
| నగదు రహితం.. సులభతరం.. | - | 20 |
| హరిత హారానికి చిరునామా ఆ గృహం | - | 21 |
| తెలంగాణ రాష్ట్రం నూతన పంచాయతీ రాజ్ చట్టానికి అనుగుణంగా గ్రామసభ నిర్వహణ | - | 22 |
| బౌద్ధం బాదన్‌కుర్తి | - | 27 |
| బోనమెత్తిన తెలంగాణ | - | 28 |
| పొలం దగ్గరకే ఏటీఎం | - | 29 |
| పాలమూరులో పసిడి పంటలు | - | 31 |
| క్వినోవాతో ఉపాధి బాట | - | 33 |
| ఆసక్తే ఆదాయమార్గం | - | 34 |
| యువతే నవభారత నిర్మాతలు | - | 35 |
| శతాబ్దాలు నిలిచే శిలలు! | - | 39 |
| అసంఘటిత కార్మికులకు వరం అటల్ పింఛను యోజన (ఏపివై) పథకం | - | 40 |
| యువత - దేశ భవిత | - | 44 |
| ఒంటరి స్త్రీలకు వెయ్యి రూపాయల జీవన భృతి పథకం | - | 46 |
| తల్లిబిడ్డల సంరక్షణ | - | 47 |
| చేనేతకు నైపుణ్యం తోడైతే...? | - | 49 |
| చెర్వుగట్టు 'శివలింగ క్షేత్రం' | - | 50 |
| గిరిజనుల పేరులో ప్రత్యేకత | - | 51 |
| కేంద్ర ప్రభుత్వ కొత్త భీమా పథకాలు | - | 52 |
| తెలంగాణ రాష్ట్రములో భూ దస్త్రాల స్వచ్ఛీకరణ | - | 54 |
| స్వచ్ఛ తెలంగాణ దిశగా పరుగులు | - | 56 |
| మిషన్ భగీరథతో ఇంటింటికీ త్రాగునీరు | - | 56 |
| "సాఫ్ట్‌వేర్ నుంచి పచ్చని వ్యవసాయంలోకి వచ్చి ఉత్తమ ఆచరణలు అమలు చేసిన యువరైతు" | - | 58 |
| వర్మీ కంపోస్టు తయారీ విధానం ఇలా.. | - | 60 |
| ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకము ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారుల విజయగాథలు | - | 61 |
| అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం | - | 63 |

# దేశం డిజిటల్ సాంకేతిక వాడకం దిశగా అడుగులు



నిత్య జీవితంలోని ప్రతి రంగాన్ని డిజిటలీకరణ చేయడం ద్వారా ఆర్థిక పురోభివృద్ధి సాగుతుందని, అవినీతి, అక్రమాల నిర్మూలన జరుగుతుందని ఇప్పటికే ఒక అభిప్రాయం ఏర్పడింది. పెద్ద నోట్ల రద్దు తరువాత దేశాన్ని డిజిటల్ మయం చేయాలనే భావనను ప్రధాని నరేంద్ర మోదీ మరింత దృఢంగా వ్యక్తం చేశారు.

డిజిటలీకరణ వల్ల దోపిడీ, మోసాలు, కుట్రలు ఉండవు. అయితే గ్రామీణ ప్రాంతాలలో మరిన్ని ఏటీఎంలు ప్రవేశపెట్టడం కూడా అవసరం. ఇంటర్‌నెట్ అనుసంధానాన్ని అనేకరెట్లు పెంచాలి. గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాలలో డిటిటల్ విద్యను పెంచడానికి కృషి చేయాలి. నగదు రహిత లావాదేవీల అవసరాన్ని వారికి వివరించాలి.

డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం ప్రజాసేవలను, వ్యాపార విధానాలను సులభతరం చేసిందనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో విద్యాబోధన ద్వారా, ఇతర చైతన్య కార్యక్రమాల ద్వారా సమాజంలో డిజిటల్ పరిజ్ఞానాన్ని పెంచడం అనేది నేటి అవసరం. డిజిటలీకరణలో మూడు ప్రధానంశాలు ఉంటాయి. ఇందులో మొదటిది అందుబాటు, రెండవది అలవాటు, మూడవది ఆచరణ. డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవడం మొదటి చర్య. రెండవది ప్రజలు దీనికి అలవాటు పడాలి. ఇక మూడవది తాము అలవాటుపడిన పరిజ్ఞానాన్ని ప్రజలు నిత్య జీవితంలో పూర్తిగా ఉపయోగించుకోవడమే ఆచరణ. సాంకేతిక పరిజ్ఞానాన్ని నిత్య జీవితంలోని అన్నిరంగాలలో, అందరికి అవసరాల కు అనుగుణంగా ప్రవేశపెట్టినప్పుడే ఈ ఆచరణ సాధ్యమవుతుంది. ఇందుకోసం అందరు ఉపయోగించే సాంకేతిక విధానాలను ప్రామాణీకరించాలి. సులభంగా, ఉపయోగకరంగా తీర్చిదిద్దాలి. అప్పుడే ప్రజలు ఆ సాంకేతిక పరిజ్ఞానానికి అలవాటు పడతారు.

విద్యాభ్యాసంలో భాగంగా డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశ పెడితే మరింత ఉపయోగకరంగా ఉంటుంది. ఎక్కడ నుంచి అయినా విద్యను అభ్యసించే ఆన్‌లైన్ కోర్సులు ఇప్పటికే ఉన్నాయి. తరగతి గదిలో బోధనకు డిజిటల్ సాంకేతికతను ఉపయోగించుకోవచ్చు. విదేశాలలోని ఉపయుక్త గ్రంథాలు మార్కెట్‌లో ఎక్కువ ధర ఉంటాయి. వాటిని డిజిటల్ రూపంలో తెచ్చుకుంటే చౌకగా పొందవచ్చు. చాలా విద్యా సంస్థలు డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ బోధనలో జోడిస్తున్నాయి. అయితే వైఫై సౌకర్యం ఇంకా విస్తరించవలసి ఉన్నది. ప్రత్యేకించి గ్రామాలకు చేరడానికి ఇంకా కొంత కాలం పడుతుంది. డిజిటల్ విధానాన్ని ప్రవేశపెట్టే ముందు మెక్ కిన్సీ అండ్ కో అధ్యయనాన్ని గమనంలోకి తీసుకోవాలి. మన దేశంలో తొంభై శాతం లావాదేవీలు నగదు రూపంలోనే సాగుతున్నాయనేది ఈ అధ్యయనంలో వెల్లడైంది. ప్రజలు ఆర్థికభద్రత పట్ల అనుమానాలు ఉన్నందువల్ల ఇంకా నగదునే ఇష్టపడుతున్నారు. డిజిటల్ విద్యను విస్తరించాలంటే గ్రామీణ స్థాయి నుంచి ప్రజలను చైతన్యవంతులను చేయడం అవసరం. వర్ధమాన దేశాలలో బ్రాడ్ బ్యాండ్ పదిశాతం విస్తరిస్తే తలసరి జీడీపీ 1.38 శాతం పెరుగుతుందని ప్రపంచబ్యాంకు ఇటీవల తన నివేదికలో వివరించింది. ఇంటర్‌నెట్ వృద్ధి కారణమనేది తెలిసిందే. రవాణా, విద్యుత్ మాదిరిగా అత్యంత ప్రధానమైన మౌలిక వసతిగా దీనిని గుర్తించి పెంపొందించాలి. దేశ వ్యాప్తంగా ఇంటర్‌నెట్ అనుసంధానం కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి. ఇందుకు ప్రత్యేక సంస్థలను ఏర్పాటు చేసి లక్ష్యనిర్దేశనం చేయాలె. టెలికం ఆపరేటర్ల వంటి ప్రైవేటు సంస్థలను భాగస్వాములను చేయాలె.

దేశంలో బ్రాడ్‌బ్యాండ్ విస్తరణ అత్యంత తక్కువగా ఉన్నదనేది కూడా అధ్యయనాల్లో తేలింది. డిజిటల్ ఇండియా నినాదం విజయవంతం కావాలంటే బ్రాడ్‌బ్యాండ్ విస్తరణపై దృష్టి కేంద్రీకరించాలి. ఇప్పుడు బ్రాడ్‌బ్యాండ్ అనుసంధానం ఏడు శాతం మాత్రమే ఉన్నదని టెలికం నియంత్రణ సంస్థ వెల్లడించింది. ఈ బ్రాడ్‌బ్యాండ్ అనుసంధానం థాయిలాండ్‌లో 36 శాతం, సింగపూర్‌లో 98 శాతం, మలేషియాలో 35 శాతం ఉన్నది. బ్రాడ్‌బ్యాండ్ విస్తరణలో భారత్ శ్రీలంక, వియత్నాం కన్నా వెనుకబడి ఉన్నది. ఇప్పుడున్న వసతులను ఉపయోగించుకుంటూనే

మెరుగుపరచుకునే ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. అట్లా వ్యూహాత్మక కృషి సాగిస్తేనే మన దేశం జ్ఞాన ఆర్థిక వ్యవస్థ వైపుగా సాగుతుంది. కేబుల్ టీవీ ద్వారా బ్రాడ్‌బ్యాండ్ లక్షలాది ఇండ్లకు చేరుతుంది. ఇందుకు తగిన విధానపరమైన మార్పులు చేయాలి. ట్రాయి ఇప్పటికే ఈ దిశగా సూచనలు చేసింది. పెద్ద నోట్ల రద్దు నగదు రహిత ఆర్థిక వ్యవస్థ అవసరాన్ని గుర్తుచేసింది. డిజిటలీకరణ గ్రామీణ ప్రాంతానికి మేలు చేస్తుంది. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులకు తగిన ధర పొందగలరు. అనేక సంక్షేమ కార్యక్రమాలు దుర్వినియోగం కాకుండా అర్హులకు చేర్చవచ్చు. ప్రభుత్వ నిధులు పేదలకు చేరకుండా అవినీతిపరులు అడ్డుకుంటున్నారు. నగదురహిత విధానం ద్వారా బ్యాంకు ఖాతాలకు నిధులను చేర్చినప్పుడు, దళారీలు మోసం చేయడం ఉండదు.

పెద్ద నోట్ల రద్దు విధానాన్ని తగిన రీతిలో అమలు చేస్తూపోతే ఆర్థిక వ్యవస్థను డిజిటలీకరించడం వేగంగా సాగుతుంది. స్మార్ట్ ఫోన్ లేకున్నా, ఆధార్ ద్వారా నగదు రహిత లావాదేవీలు సాగించవచ్చునని నిపుణులు చెబుతున్నారు. 120 కోట్ల మంది ఉన్న మన దేశంలో ఏటీఎంల సంఖ్య అతి తక్కువగా ఉన్నది. పాయింట్ ఆఫ్ సేల్ కార్డు మిషిన్ల సంఖ్య 13 లక్షలు మాత్రమే. ఫోన్‌ల ద్వారా చెల్లింపులను సాగించవచ్చు. కానీ దీనికి ఇంటర్‌నెట్ అవసరం. అందువల్ల ఇంటర్‌నెట్ చార్జీలను బాగా తగ్గించాలి. దీనివల్ల బలహీనవర్గాలకు చెందిన ప్రజలను నగదు రహిత లావాదేవీలు జరుపడానికి ప్రోత్సహించవచ్చు. దేశంలో పదమూడు శాతం మంది గ్రామీణులు మాత్రమే ఇంటర్‌నెట్ సౌకర్యం కలిగి ఉన్నారు. నగదు రహిత లావాదేవీలు జరుపడాన్ని గ్రామీణ ప్రజలకు నేర్పించడానికి మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ 18 వేల మంది స్వచ్ఛంద సేవకులను తయారు చేసింది. విత్తీయ సాక్షరతా అభియాన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. పార్లమెంటు సభ్యులను కూడా ఇందులో భాగస్వాములను చేయాలని భావిస్తున్నది. ప్రతి విద్యార్థి స్వచ్ఛంద సేవకుడు తమ కుటుంబంతోపాటు మరో పది కుటుంబాలకు డిజిటల్ లావాదేవీలను నేర్పించాలి. ఎంపీలు తమ నియోజకవర్గంలోని కళాశాలలు, ఇతర ఉన్నత విద్యాసంస్థలకు వెళ్ళి విద్యార్థులు, ఇతర యువకులు స్వచ్ఛంద సేవకులుగా మారి డిజిటల్ లావాదేవీలను ప్రజలకు నేర్పించే విధంగా ప్రోత్సహించాలి. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వాలంటీర్లు తమ ప్రాంతంలోని మార్కెట్లకు వెళ్ళి దుకాణాల యజమానులకు డిజిటల్ లావాదేవీలు జరిపే విధానాన్ని బోధించాలి.

పెట్రోలు డీజిల్ కొనుగోలు, బీమా చెల్లింపులు, రైలు టికెట్ల కొనుగోలు మొదలైన కార్యకలాపాలను నగదు రహితంగా సాగించడానికి కేంద్రం ఇటీవల ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఇది నిజంగా డిజిటలీకరణ ప్రక్రియలో ఒక ముందడుగు. ఈ ప్రోత్సాహక పథకం వల్ల ముప్పై శాతం వినియోగదారులు నగదు రహితం వైపు మళ్ళుతారని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. దీనివల్ల పెట్రోలు పంపుల దగ్గర ఏటా రెండు లక్షల కోట్ల రూపాయల మేర లావాదేవీలు నగదు రహితంగా సాగుతాయి. డిజిటలీకరణ వల్ల దోపిడీ, మోసాలు, కుట్రలు ఉండవు. అయితే గ్రామీణ ప్రాంతాలలో మరిన్ని ఏటీఎంలు ప్రవేశ పెట్టడం కూడా అవసరం. ఇంటర్‌నెట్ అనుసంధానాన్ని అనేక రెట్లు పెంచాలి. గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాలలో డిటిటల్ విద్యను పెంచడానికి కృషి చేయాలి. నగదు రహిత లావాదేవీల అవసరాన్ని వారికి వివరించాలి.

ప్రతి ఒక్కరు బ్యాంకు ఖాతా కలిగి ఉండే విధంగా ప్రభుత్వం జన్ ధన్ యోజనను ప్రవేశ పెట్టింది. ఇక ముందు ప్రతి ఒక్కరికి కూలీ సొమ్మును వారి ఖాతాలో వేయవచ్చు. ఇతర చెల్లింపులకు కూడా ఈ ఖాతాలను వాడుకోవచ్చు. ఇప్పటి వరకు ఈ ఖాతాల ఉపయోగం తెలిసిరాలేదు. కానీ డిజిటలీకరణ క్రమంలో వీటి ఉపయోగం తెలిసివస్తుంది. డిజిటలీకరణ సాగించే క్రమంలో ఎదురయ్యే సవాళ్ళు ఏమిటో ప్రభుత్వానికి తెలుసు. ఇందుకోసం తగు మౌలికవసతులను కల్పించవలసి ఉన్నది. ఇందులో భాగం గా బీఎస్ఎన్ఎల్ వివిధ స్థాయిల వినియోగదారులకు వారికి అనువైన భిన్నమైన చార్జీలను వసూలు చేయాలి. విద్యార్థులకు, పేదలకు వేర్వేరు ప్యాకేజీలను ప్రవేశపెట్టాలె. ఈ ప్రక్రియ సుదీర్ఘమైనది అనడంలో అనుమానం లేదు. ప్రభుత్వ క్రియాశీల పాత్ర, ఆర్థిక ప్రోత్సాహకాల ద్వారా నగదు రహిత ఆర్థిక వ్యవస్థను నెలకొల్ప వలసిన అవసరం ఉన్నది.



**ఇ.ఆర్. బి.నరేంద్రనాథ్‌రావు,**
**జాయింట్ డైరెక్టర్, టిఎస్ఐఆర్‌డి**

# టిఎస్ఐఆర్డిలో ప్రత్యేక ఆటల సదుపాయాల కల్పన



శిక్షణ నిమిత్తం టిఎస్ఐఆర్డికు విచ్చేసే శిక్షణార్థుల సదుపాయల కల్పనలో టిఎస్ఐఆర్డి ఒక అడుగు ముందు కేసింది. టిఎస్ఐఆర్డి సువిశాల ప్రాంగణంలో ప్రత్యేక ఆటల సదుపాయలు కల్పించారు. శిక్షణకు విచ్చేసిన శిక్షణార్థులతో పాటు టిఎస్ఐఆర్డిలో పనిచేసే ఉద్యోగులకు మరియు వారి వారి కుటుంబాలకు ఈ యొక్క ప్రత్యేక ఆటల సౌకర్యాలను కల్పించనున్నారు. దీనిలో భాగంగా నిరుపయోగంగా ఉన్న షెటల్ బాడ్మింటన్ కోర్డును పునర్మించారు. కోర్టు చుట్టూ ప్రత్యేకంగా కంచెను ఏర్పాటు చేశారు. క్రొత్త బ్యాట్స్, నెట్ మరియు కాక్సను అందుబాటులో ఉంచారు. ఇండోర్ గేమ్స్లో భాగంగా చెస్ (చదరంగం), కారమ్స్ మరియు టేబుల్ టెన్నిస్ కోర్టును కూడా టిఎస్ఐఆర్డిలో ఏర్పాటు చేశారు. ఈ నూతన ఆటల సదుపాయాలన్నింటినీ పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖా ముఖ్యకార్యదర్శి శ్రీ వికాస్రాజ్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. అదే విధంగా ఆరోగ్య పరిరక్షణకై ప్రత్యేకంగా జిమ్ (వ్యాయామశాల)ను కూడా త్వరలో ఏర్పాటు చేసేందుకు సన్నహాలు జరుగుతున్నాయి. ఈ సదుపాయాలన్నింటిలో టిఎస్ఐఆర్డికు విచ్చేనే శిక్షణార్థులు మరియు టిఎస్ఐఆర్డిలో పనిచేసే సిబ్బంది మరియు సిబ్బంది కుటుంబ సభ్యులు అందిపుచ్చుకోవాలని టిఎస్ఐఆర్డి ఆశిస్తుంది.









# ఉపాధి పనుల్లో వేగం పెంచాలి

## రాష్ట్ర ఉపాధి హామి కౌన్సిల్ సమావేశంలో వైఎస్ ఛైర్మన్ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచన

ఉపాధి పనులు గతంతో పోల్చితే పెద్ద ఎత్తున జరుగుతున్నాయని, అయితే ఇంకా వేగం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అభిప్రాయపడ్డారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలో జరిగిన ఉపాధి హామి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులను పూర్తి స్థాయిలో భాగసామ్యం చేస్తేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. జాబ్ కార్డులున్న కూలీల్లో కనీసం 60% మందికి 100 రోజుల పని దినాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. హరితహారం వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్మాణం లాంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడితే ఈ లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యం కాదన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం మంజూరు చేసిన ఉపాధి నిధులను పూర్తి స్థాయిలో వినియోగించు కోగలిగామన్నారు. కొన్ని గ్రామాల్లో 90% మంది కూలీలకు పని కలిపిస్తే, మరి కొన్ని గ్రామాల్లో మాత్రం అతి తక్కువ మందికి పనులు కల్పిస్తున్నారు. ఇందులో తప్పు ఎక్కడ జరుగుతుందో, భాద్యులెవరో గుర్తించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏ కార్యక్రమం అయినా సమిష్టి, కృషి భాగసామ్యం ఉంటేనే విజయవంతం అవుతుందన్నారు. ఉపాధి పనుల్లోనూ క్షేత్రస్థాయి ప్రజా ప్రతినిధులను, ప్రజలను పూర్తి స్థాయిలో కలుపుకొని పోయేలా కార్యక్రమాలు రూపకల్పన చేయాలన్నారు. అక్టోబర్ 2వ తేదిన నాటికి స్వచ్ఛ తెలంగాణ లక్ష్యంగా ముందుకు పోతున్నామని, ఆ దిశగా గ్రామాల్లో మరుగుదొడుల్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామి కౌన్సిల్ సభ్యులను కూడా పూర్తిస్థాయిలో భాగసామ్యం చేయాలని, జిల్లా స్థాయి సమావేశాలకు వారిని ఆహ్వానించాలని మంత్రి సూచించారు. గతంలో పోలిస్తే పెద్ద ఎత్తున సిసి రోడ్లను ఉపాధి పనుల్లో భాగంగా మంజూరు చేయడంపై మంత్రి జూపల్లి కృష్ణారావుకి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారుతమకు గౌరవ వేతనాన్ని ఇవ్వాలని కౌన్సిల్ సభ్యులు మంత్రికి వినతి పత్రం అందించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ మరియు శాఖ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, కమీషనర్ నీతు కుమారి ప్రసాద్ పాల్గొన్నారు.



# కొత్త తెలంగాణ పంచాయతీరాజ్ చట్టము - 2018 (యాక్ట్ ఆఫ్ 5/2018) కొన్ని ముఖ్యాంశములు

కొత్త తెలంగాణ పంచాయతీరాజ్ చట్టము 2018, తేదీ:29-03-2018 రోజు శాసనసభలో బిల్లు ఆమోదించబడి, తేదీ: 18-04-2018 నుండి అమలులోనికి వచ్చినది.

ఇందులో కొన్ని ముఖ్యాంశములు మరియు పాత క్రొత్త చట్టము వ్యత్యాసము

**పంచాయతీరాజ్ చట్టం 1994**

సెక్షనులు 278 షెడ్యూలు - VI అమలులోనికి వచ్చిన తేదీ. 31.051994 సెక్షను (6) ప్రకారము సంవత్సరములో (2) సార్లు గ్రామసభ ప్రతీ గ్రామసభ జరుపుటకు ఈ క్రింది అంశములు అజెండా

- పరిపాలన నివేదిక
- ఆడిటు అభ్యంతరములు/గడచిన కాలము ఆదాయ వ్యయములు
- అభివృద్ధి కార్యక్రమముల అమలు సమీక్ష
- కొత్తగా గ్రామపంచాయతీ విధించు పన్నులు
- ప్రభుత్వ పథకముల లబ్ధిదారుల ఎంపిక
- ఇతర సామాజిక విషయముల పై చర్చ

గ్రామసభకు ఎలాంటి కోరము లేదు. గ్రామసభ నిర్వహించకపోయిన యెడల సర్పంచ్‌ను తొలగించుట లేద్దు సెక్షన్ (9) సీట్లు రిజర్వేషన్ ప్రతిటర్మ్‌కు ఒకసారి సెక్షన్ (13) సాధారణ ఖాళీలు సాధారణ ఎన్నికల ద్వారా ప్రభుత్వము ఎన్నికల కమీషను నిర్ణయించిన ప్రకారము ఎన్నికలు జరుగును.

సెక్షన్ - 23 - సర్పంచ్/ ఉప సర్పంచ్ రాజీనామా కమీషనర్‌కు సమర్పించుట అప్పీలు, ప్రభుత్వము (30) రోజులలో ఒక సంవత్సరము తరువాత ఏ చర్య తీసుకొనుటకు వీలులేదు.

**పంచాయతీరాజ్ చట్టం 1994**

సెక్షన్ - 40 - బెనిఫిషయరీ కమిటీలు & ఫంక్షనల్ కమిటీలు

1. వ్యవసాయము
2. ప్రజారోగ్యము
3. మంచినీటి సరఫరా
4. శానిటేషన్/పరిశుభ్రత
5. ఫ్యామిలీ ప్లానింగ్
6. విద్యా & కమ్యూనికేషన్

**తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018**

సెక్షనులు 297, షెడ్యూలులు - VIII అమలులోనికి వచ్చిన తేదీ. 18.04.2018 సెక్షను (6) ప్రకారము రెండు (2) మాసములకు ఒకసారి సంవత్సరములో (6) సార్లు గ్రామసభ చివరి గ్రామసభ జరిపిన తరువాత రెండు మాసములు గడువు ముగిసిన తరువాత (10) రోజులలో తప్పక గ్రామసభ జరుపవలెను. గ్రామసభ అజెండా గ్రామపంచాయతీకి గల అన్ని బాధ్యతలు, విధులను చర్చ (6) గ్రామసభలలో నుండి (2) గ్రామసభలకు ఒకటి స్త్రీలకు సంబంధించినటువంటి విషయము, రెండవది వృద్ధులు/వికలాంగుల సంక్షేమ సమాచార విషయములు మాత్రమే చర్చ. గ్రామసభకు ఈ దిగువల చూపిన కోరము తప్పక ఉండవలయును.

1. 500 మంది ఓటర్ల వరకు - 50 సభ్యులు
2. 501 నుండి 1000 ఓటర్ల వరకు - 75 సభ్యులు
3. 1001 నుండి 3000 ఓటర్ల వరకు-150 సభ్యులు
4. 3001 నుండి 5000 ఓటర్ల వరకు-200 సభ్యులు
5. 5001నుండి10,000 ఓటర్ల వరకు-300 సభ్యులు
6. 10000 అంతకు మించి ఓటర్లకు - 400 సభ్యులు

గ్రామసభ నిర్వహించిన సర్పంచులను చట్టములోని సెక్షన్ (33) ను అనుసరించి పదవి నుండి తొలగించవచ్చును.

**తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018**

సెక్షన్ సబ్ ఆఫ్ (9) ప్రకారము రెండు టర్మ్‌లకు సీట్ల రిజర్వేషన్ మార్పు సెక్షన్ 14- సాధారణ ఖాళీలు ఏర్పడిన నుండి (3) మాసములకంటే ఎక్కువ కాలము ఖాళీగా ఉండటానికి లేదు. సెక్షన్ - 16 - ఎన్నిక కాబడిన సర్పంచులకు, వార్డు సభ్యులు తప్పక శిక్షణ పొందవలెను. సెక్షన్-24-చట్టములో పొందుపరచిన డ్యూటీ చేయకపోతే అనర్హతవేటు గల్గును. దీని

# ఎన్.ఐ.ఆర్.డి &పి.ఆర్ లో యునిసెఫ్ ఆధ్వర్యంలో త్రాగునీరు మరియు పారిశుధ్య రంగాల పై జరిగిన సమ్మేళనం

యునిసెఫ్ అధ్వరంలో 2018 జూలై 26 నుండి 28 తేదీల వరకు త్రాగునీరు, పారిశుధ్య రంగాల వారి సమ్మేళనం జరిగింది. ఎన్.ఐ.ఆర్.డీ లో జరిగిన ఈ కార్యక్రమం ఈ రంగంలో సాధించిన అభివృద్ధి పంథాను స్థిరీకరణ గావించడం అనే ముఖ్యంశముగా సాగింది. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రల నుండి వచ్చిన అధికార, అధికారేతరుల తో పాటు యునిసెఫ్ అధికారులు, నీరుపారిశుధ్యం, పౌష్టికాహారం, శిశు సంక్షేమం మరియు ఎదుగుదల రంగాలలోని నిపుణులు చర్చల్లో పాల్గొన్నారు.

26వతేదీన జరిగిన సభా ప్రారంభసమావేశానికి ముఖ్య అతిధిగా హైదరాబాద్ యునిసెఫ్ కార్యాలయ అధినేత శ్రీమతి మిటల్ రస్డియా విచ్చేశారు. గౌరవ అతిధులుగా ఎన్.ఐ.ఆర్.డి డైరెక్టర్ జనరల్ డా.డబ్ల్యు.ఆర్.రెడ్డి, కర్ణాటక ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శ్రీ ఎల్.కె.అలెఖ్, తెలంగాణ ఎస్.ఐ.ఆర్.డి ముఖ్యకార్య నిర్వహణాధికారి శ్రీమతి పౌసమి బసు మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజనీర్ ఇన్ ఛీఫ్ శ్రీ టి. ప్రభాకర్ రావు పాల్గోన్నారు.




తమ ఉపన్యాసంలో శ్రీమతి పౌసమి బాసు త్రాగునీరు పారిశుధ్యం రంగాల్లో ముఖ్యంగా మల విసర్జనా రహిత పంచాయితీల్లో ఇంతవరకు సాధించిన ప్రగతిని నిలబెట్టుకోవటం ప్రాముఖ్యాన్ని నొక్కి వక్కాణించారు. అంతేకాకుండా ప్రజలలో సరైన అవగాహన కల్పించటం దాని కనుగుణంగా తమ అలవాట్లను మార్చుకొనేలా చేయటానికి అధికారయంత్రాంగం, అధికారేతర వర్గాలు సామాజిక కార్యకర్తలు ఓపికతో పాటుపడి ఫలితాలను సాధించాలని అన్నారు.

వలన (6) సార్ల వరకు ఎన్నికలలో పోటీకి అనర్హులు.

అనర్హత నిర్ణయించు అధికారము:

సెక్షన్ –19 (21 సం॥ల విషయము)

సెక్షన్ – 20 (ప్రభుత్వము / చట్టములో నిర్ధేశించిన (సర్వీస్) సేవ చేయని యెడల

సెక్షన్ –21 – (3) ముగ్గురు పిల్లలు ఉన్నచో

సెక్షన్ – 22 – కరప్షన్ చార్జ్

సెక్షన్ – 23 – ఎన్నికల ఖర్చు చూపించని పక్షములో గ్రామపంచాయతీలో ఉన్న పరిధికి సంబంధించిన న్యాయస్థానము నిర్ణయించును.

సెక్షన్ – 34 – లెక్కలు/ఆడిట్ చేయించుటలో విఫలమైనచో

సెక్షన్ – 26 – రాజీనామా కలెక్టరుకు కమీషనరుకు

సెక్షన్–30–ఉపసర్పంచ్ పదవి చేపట్టిన నుండి (2) సం॥లోపు అవిశ్వాస నోటీస్ చేయరాదు.

అతని పదవికాలములో అదే ఉపసర్పంచ్‌పై (2) కంటే ఎక్కువసార్లు అవిశ్వాస నోటీస్ ప్రవేశ పెట్టరాదు.

**తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018**

సెక్షన్ – 49

1. పరిశుభ్రత, దంపింగ్ యార్డ్, భర్రెల దొడ్డి
2. స్ట్రీట్ లైట్
3. ప్లాన్‌టేషన్ & గ్రీన్ అభివృద్ధి పనులు గుంతల కోసం

మిగితా వివరాలు తరువాతి సంచికలో

**– బి.లింబగిరిస్వామి**

డి.పి.ఓ (రి), ఎస్.ఆర్.పి, టిఎస్ఐఆర్డి

# ప్రగతి పథంలో గ్రామీణ భారతావని

పల్లెల అభివృద్ధి రాగం పల్లవిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తూ, పథకాలు ప్రవేశపెడుతూ అహర్నిశలు కృషి చేస్తున్నాయి. దేశ గ్రామీణ ప్రాంతాల ప్రజల సంక్షేమానికి గ్రామీణాభివృద్ధి శాఖ వివిధ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోంది. పేదరిక నిర్మూలన,జీవనాధార అవకాశాలు పెంపొందించడం,సామాజిక భద్రత,మౌళిక వసతుల కల్పన,విద్య,ఆరోగ్య సేవలు,అందరికీ ఇళ్ళు వంటి లక్ష్యాలతో గ్రామీణ భారతాన్ని ప్రగతి బాట పట్టించే దిశగాసాగుతోంది.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలకు వెళ్దాం అన్న నినాదంతో అధికారులను గ్రామాల బాటపట్టించినాయి. గ్రామ పంచాయతీలు,గ్రామ ప్రధాన కూడళ్ళు కేంద్రాలుగా అభివృద్ధిపై గ్రామాల్లో ప్రజలతో అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించి గ్రామాల ఆధునీకరణకు బంగారు బాటలు వేస్తున్నారు.వర్ధమాన దేశాల్లో 75 శాతం పేదలు గ్రామాల్లోనే నివసిస్తున్నారు.2020 నాటికి గ్రామీణ పేదరికం 60 శాతానికి తగ్గుతుందని అంచనా.ప్రపంచంలోనే అత్యధిక గ్రామీణ జనాభా ఉన్న దేశంగా భారత్ కీర్తి గడించింది.ఇలా పెద్ద ఎత్తున గ్రామీణ జనాభాలో 64 శాతం మంది వ్యవసాయం పైననే ఆధారపడి జీవిస్తున్నారు.భారతదేశ ఆత్మ అంతా గ్రామాల్లోనే ముడిపడి ఉన్నది. కేంద్ర ప్రభుత్వము గ్రామీణ ప్రగతికి బాటలు వేస్తూ గ్రామీణ ఉపాధి హామీ పథకము, గ్రామీణ జీవనాధార కార్యక్రమము,దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన, కృషి సించాయి యోజన, సంసద్ ఆదర్శ్ గ్రామ్ యోజన,ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన, గ్రామ సమూహాల్లో పట్టణ స్థాయి సదుపాయాల కల్పనకు రూర్బన్ మిషన్ వంటి పథకాలు ప్రారంభించి గ్రామీణాభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నది.రాష్ట్ర ప్రభుత్వం సైతం గ్రామజ్యోతి పథకము అమలుతో గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో గ్రామీణాభివృద్దే ధ్యేయంగా ముందుకుసాగుతున్నది.గ్రామాల్లో మిషన్ కాకతీయ పేరుతో చెరువులపునరుద్ధరణ కార్యక్రమము దిగ్విజయముగా కొనసాగుతున్నది.గ్రామాల్లో వ్యవసాయరంగానికి, త్రాగునీటికి మరియు జలసంరక్షణ ద్వారా గ్రామాల్లోనే భూగర్భజలాలను పెంపొందించడము లాంటి పల్లెముఖ చిత్రాన్ని మార్చే బహుళ ప్రయోజనాలు కలిగినచెరువుల పునరుద్ధరణ అప్రతిహతంగా కొనసాగుతున్నది.అంతే కాకుండా వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు రక్షిత మంచినీరు అందించాలని గట్టి పట్టుదలతో మిషన్ భగీరథను చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఆదిశగా ముందుకు సాగుతూ లక్ష్యం దిశగా పయనిస్తున్నది.తద్వారా గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతున్నది.

దేశంలో ప్రస్తుతం 2,48,255 గ్రామపంచాయతీలు,6,618 మధ్యస్థ పంచాయతీలు,618 జిల్లాపంచాయతీలు ఉన్నాయి. తాజా నివేదికల ప్రకారం దేశంలో 27,75,858 గ్రామపంచాయతీ సభ్యులు,1,44,491 మధ్యస్థ(మండలాలు,సమితులు)పంచాయతీ సభ్యులు,15,067 జిల్లా పంచాయతీ సభ్యులుఉన్నారు.దేశంలో ఎన్నికైన సుమారు 29.17 లక్షల ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రజాస్వామ్యము పరిణతికి అద్దం పడుతున్నాయి.ఇంత విస్తృతమైన జనాభా దేశంలోని అట్టడుగు స్థాయిలో ఉండే స్థానికసంస్థల భాగస్వామ్యముతో ముందుకుసాగుతుండడం దేశ పంచాయతీరాజ్ వ్యవస్థ గొప్పతనానికి నిదర్శనం. దేశంలో సామాజిక న్యాయం నెలకొల్పడానికి, సాధికారతను సాధించడానికి పంచాయతీ రాజ్ వ్యవస్థలే ప్రాతిపదిక. ఆ దిశగా పంచాయతీరాజ్ వ్యవస్థలు దేశంలో,రాష్ట్రంలో ముందుకుసాగుతూ బలమైన పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్మాణం చేస్తూ పల్లెసీమలే దేశాభివృద్ధికి పట్టుగొమ్మలు అని భావించి దేశాభివృద్ధికి కృషి చేస్తున్నాయి.దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక స్వపరిపాలన సంస్థలను బలోపేతంచేస్తేనే సామాజిక న్యాయం,సాధికారత దిశగా గ్రామాలు పయనిస్తాయి. గ్రామములో ఉన్నటువంటి గ్రామ పంచాయతీలను బలోపేతం చేయాలి. రాజ్యాంగబద్దంగా సంక్రమించాల్సిన 29 అంశాలను గ్రామ పంచాయతీలకు బదలాయించి గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు స్వతస్సిద్ధంగా రూపొందించే విదంగా గ్రామపంచాయతీలను సంసిద్ధం చేయాలి.అప్పుడే అట్టడుగున ఉన్న గ్రామ ప్రజలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టి,అమలు పరిచే గ్రామీణాభివృద్ధి ఫలాలు ప్రతీ లబ్దిదారునికి చేరి సామాజిక న్యాయం పెంపొందించబడుతూ గ్రామాలు సాధికరతదిశగా ముందడుగు వేస్తాయి.గ్రామ పంచాయతీలు నిధులలేమితో కొట్టుమిట్టాడుతూ స్వయంపాలన దిశగా ప్రకాశించక కుంగుబాటుకు గురి అవుతున్న విధానాన్ని సమీక్షించిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలతో పాటు ఆర్ధిక తోడ్పాటును అందిస్తున్నాయి. కేంద్ర ఆర్ధిక సంఘము నిధులతో పాటు, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఆర్ధిక సంఘము నిధులు మరియు ఇతర గ్రామీణాభివృద్ధి కేటాయింపులు గ్రామ పంచాయతీలకు పెద్ద దిక్కుగా ఆసరా అవుతున్నాయి. గ్రామ పంచాయతీలకు 14వ ఆర్ధికసంఘము నిధులు ఇతోధికంగా తోడ్పడుతూ గ్రామ పంచాయతీల యందు కీలకమైన మంచినీటి సరఫరా, పారిశుధ్యము,వీధిదీపముల నిర్వహణల యందు మెరుగైన పనితీరును కనబరుచుచూ గ్రామాలు అభివృద్ధి దిశలో పయనింపచేస్తున్నాయి. ఇలా పంచాయతీరాజ్ వ్యవస్థలో అట్టడుగున ఉన్నటువంటి గ్రామాలకు ఆర్ధిక తోడ్పాటును సైతం అందించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలనందిస్తూ స్వయంపాలన దిశగా కదులుతున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణాభివృద్ధికి అధికంగా బడ్జెట్ కేటాయింపులు చేసి గ్రామాల అభ్యున్నతే ధ్యేయంగా చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వము 2018-19 బడ్జెట్‌లో వేల కోట్లు కేటాయించి గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేసింది. దేశంలో 660 జిల్లాల్లో 2,57,718 గ్రామపంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకము అమలవుతున్నది.సుమారు 13.14 కోట్లు జాబ్‌కార్డులుండగా 27.63

కోట్ల కూలీలు నమోదయి ఉన్నారు.గ్రామీణుల్లో ఉపాధికి ధీమా కల్పించిన ప్రభుత్వం రోజువారీ కూలీని సైతం రూ.174 కు పెంచారు.గ్రామాల్లోని నైపుణ్యంలేని కార్మికులకు పని కల్పించి,వలసలకు అడ్డుకట్ట వేసి గ్రామాల్లోనే పని కల్పించడము ద్వారా గ్రామీణాభివృద్ధికి బంగారు బాటలువేయాలని ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకము ఆశయసాధన దిశగా పరుగులు పెడుతున్నది. ప్రస్తుత బడ్జెట్‌లో 55,000 కోట్లు కేటాయించి,పల్లెల్లో పనికల్పించడం ద్వారా ఆస్తులను సృష్టించి శాశ్వత ఉపాధి మార్గాలు కల్పించి ప్రజలను అభివృద్ధిపథంలో పయనింపచేసేలా సమాయత్తంచేస్తున్నది.పొట్టకూటి కోసం వలస పోతున్న పల్లెజనానికి భరోసానిచ్చేలా ఉపాధిహామీ పథకానికి నిధులు కేటాయించిన ప్రభుత్వం సమూహ సౌకర్యాల బృందాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రకృతి,జల సంరక్షణను పెంపొందిస్తున్నది. ఉపాధిహామీ పథకం ద్వారా 230 కోట్ల పనిదినాలు కల్పించడము,10 లక్షల ఆస్తులు సృష్టించడము మరియు 60 లక్షల కొత్త పనుల నమోదు చేయడమే ధ్యేయంగా ప్రణాళికలు రచిస్తూ ముందుకు సాగుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నిరోధించి పల్లెల్లో కూలీ పనులు కల్పించడము ద్వారా గ్రామీణ జనజీవనానికి ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ఆర్థిక భరోసాను పెంపొందిస్తున్నది. జీవనోపాధిని పెంచడంలో భాగంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ రూర్బన్ పథకం కింద 2018-19 బడ్జెట్‌లో 12,000 కోట్లు కేటాంచిన కేంద్ర ప్రభుత్వము సుమారు 300 లకు పైగా సమూహాలను ఎంపిక చేసి మౌలిక వసతుల కల్పనతో పాటు రైతులకు మార్కెట్ వసతి కల్పిస్తారు.తద్వారా గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుకానున్నాయి. ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన ద్వారా కరువు పీడిత ప్రాంతాలకు ప్రాదాన్యతనిచ్చి వ్యవసాయ సాగుకు కావలసిన సాగునీటి అవసరాలను పెంపొందించి, వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడం ద్వారా గ్రామీణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయనున్నారు. వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి పలు మార్పులతో బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది.దేశ వ్యాప్తంగా ఉన్న 22,000 వేల గ్రామీణ వాణిజ్య కూడళ్ళను గ్రామీణ వ్యవసాయ మార్కెట్లుగా (గ్రామ్స్)గా పదోన్నతి కల్పించడం జరిగింది.తద్వారా 86 శాతం సన్నకారు,చిన్నకారు రైతులకు ప్రయోజనం కలుగుతుంది. అంతే కాకుండా వ్యవసాయ మార్కెటింగ్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి 2000 కోట్ల రూపాయలతో నిధిని ఏర్పాటు చేయడం జరిగింది. తద్వారా మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులోకి వచ్చి అన్నదాతకు తగిన ధర లభించే అవకాశము ఏర్పడుతుంది.ఇవే కాకుండా ఈ-నామ్ ఎలక్ట్రానిక్ అనుసంధానం చేయడం,వ్యవసాయ ప్రాథమిక మార్కెటింగ్ కమిటీలకు నిబంధనల సడలింపు చేయడం వలన రైతులు తమ పంటలను సులువుగా అమ్ముకొని సొమ్ముచేసుకునే అవకాశము ఏర్పడుతుంది.రైతులు తమ పంటలను నేరుగా వినియోగదారులకు టోకుగాఅమ్మడానికి సౌకర్యాలు పెరిగి మధ్య దళారులకు అడ్డుకట్టవేయడం అంతిమంగా పంటను పండించిన రైతుకు తగిన ప్రతిఫలం పొందే అవకాశము ఏర్పడుతుంది.ఇలా అనేక పథకాలు, మినహాయింపులు, మార్పులతో గ్రామీణులజీవితాల్లో వెలుగులు నింపేలా తద్వారా వారి ఆదాయ మార్గాలు పెరిగి, అభివృద్ధిలో మున్ముందుకు వెళ్ళేలా ప్రభుత్వం చేపట్టిన చర్యలు తోడ్పడతాయనడంలో ఎలాంటి సందేహము లేదు.

గ్రామాల అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు గ్రామస్థాయిలో సమన్వయం చేసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడం, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి,పథకము సదుద్దేశమును నెరవేర్చడం లాంటి పనులు చేయడానికి స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేస్తేనే పథకాల లక్ష్యము నెరవేరుతుంది. అందుకు గాను గ్రామపంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి 14వ ఆర్థిక సంఘముసిఫార్సులు చేసిన విధంగా 2015-2020 మధ్య కాలములో నేరుగా రూ. 2,00,292.20 కోట్ల నిధులు రానున్నాయి. ఇప్పటికే 14వ ఆర్థికసంఘం నిధులు రాకతో గ్రామ పంచాయతీల్లో రక్షిత మంచినీటిసరఫరా లాంటి ప్రజా సౌకర్యాల కల్పనలో గ్రామ పంచాయతీల పనితీరు మెరుగుపడుతున్నది. ఒకో గ్రామ పంచాయతీకి సగటున ఏటా రూ. 17 లక్షల నిధులు చేరడంతో గ్రామపంచాయతీలు మరింత ఆర్థిక స్వావలంబన చేకూరుతున్నది. అంతేకాకుండా 14వ ఆర్థిక సంఘం నిధుల యందు తమ పనితీరును మెరుగుపరుచుకున్న గ్రామ పంచాయతీలకు ప్రోత్సాహక గ్రాంటును కూడా ఇస్తున్నారు. తద్వారా గ్రామ పంచాయతీలు తమ ఆర్థిక వనరులను మెరుగుపరుచుకుని ఆర్థిక సాధికారతను సాధించి నిలదొక్కుకుంటున్నాయి.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి ప్రత్యక్షంగా నిధులు కేటాయించి తామే అమలుపరుస్తూ, మరో పక్క నిధులు కేటాయించి తమ పని తీరును తామే ప్రజల ఆకాంక్షలు, అవసరాలు మేరకు కొనసాగించి స్థానిక స్వపరిపాలనను మరింతగా పెంపొందింపజేస్తున్నాయి.గ్రామాలల్లో పారిశు ధ్యాన్ని మెరుగుపరిచి అపరిశుభ్రతను పారద్రోలి స్వచ్ఛభారత్ సాకారం దిశగా దేశాన్ని పయనింపచేయాలని భావించిన ప్రభుత్వం వేలాదిగా మరుగుదొడ్ల నిర్మాణంతో పల్లెలను బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నారు.మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి సుమారు 85వేల పై చిలుకు గ్రామాలు, 141 పై చిలుకు నగరాలను బహిరంగ మలవిసర్జన నుండి విముక్తి చేసి పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడం జరిగింది. స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించినప్పటినుండి సుమారుగా గ్రామీణ ప్రాంతాల్లో 2 కోట్ల పై చిలుకు మరుగుదొడ్లు నిర్మించి ఉద్యమ రూపాన్ని సంతరించుకున్నది. దేశంలో సంపూర్ణ పారిశుధ్యం దిశగా పలు పథకాలు ప్రవేశపెట్టినారు.కానీ నేడది ఉద్యమంగా మారి, ప్రజలను చైతన్యవంతులను చేస్తూ స్వచ్ఛభారత్ సాకారం క్రతువులో భాగస్వాములను చేస్తూ వడివడిగా అడుగులు పడుతున్నాయి.ప్రజా భాగస్వామ్యం లేనిదే ఏ పథకం కూడా ఖచ్చితమైన ఫలితాలను సాధించలేదు.కానీ స్వచ్ఛభారత్ సాక్షాత్కరింపజేయడానికి విస్తృత ప్రచారం గావించి,లక్ష్యాలవారీ ప్రణాళికలు రూపొందించి ప్రజా సమూహాలను, అధికారులను, అనధికారులను భాగస్వాములను చేసి, గ్రామీణుల్లో పరివర్తనను పెంపొందించి సంపూర్ణ పారిశుధ్యమునకు బంగారు బాటలు పడుతున్నాయి.చత్తీస్‌ఘడ్‌లోని ధమ్‌తరీ జిల్లా కోటభర్రీ గ్రామానికి చెందిన 104 ఏళ్ళ కున్వర్‌బాయి మరుగుదొడ్డి కట్టుకోవడానికి

తన మేకలను అమ్ముకుని మరుగుదొడ్డినిర్మించుకుని స్ఫూర్తిని నింపింది. కొలారస్ బ్లాకు గోపాల్‌పురా గ్రామానికి చెందిన ప్రియాంకా అనే ఆదివాసీ మహిళ అత్తగారింట్లో మరుగుదొడ్డి లేకపోవడంతో తల్లి గారింటికి తిరిగి వచ్చి, మరుగుదొడ్డి నిర్మిస్తేనే అత్త గారింటికి వస్తానని భీష్మించుకుని కూర్చున్నది. మహారాష్ట్రలోని వాశిమ్ జిల్లా సాయిఖేడా గ్రామానికి చెందిన సంగీతా అధవలే మరుగుదొడ్డి కోసం తనమంగళ సూత్రాన్ని అమ్మి, నిర్మాణం చేసుకున్నది. ఇలా దేశంలో జరుగుతున్న పలు సంఘటనలు మరుగుదొడ్డి నిర్మాణం పట్ల నిర్లక్ష్యాన్ని ప్రారద్రోలి తాము నిర్మించుకుంటూ మరెందరికో స్ఫూర్తినిస్తూ మహాయజ్ఞానికి తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు. మరుగుదొడ్డి నిర్మాణం పట్ల తమ అవసరాలు సౌకర్యవంతముగా,సుఖవంతముగా మారడమే కాకుండా భద్రతను పెంపొందించి ఆరోగ్యవంతమైన సమాజందిశగా గ్రామాలు ముందడుగు వేస్తున్నాయి. పారిశుధ్య ఉద్యమం ప్రజా ఉద్యమ స్థాయిని సంతరించుకుని స్వచ్ఛభారత్ స్వప్నం సాకారం దిశగా చేరే రోజులు సమీపంలోనే ఉన్నాయి. ఆధునిక ఆరోగ్యవంతమైన, సంపూర్ణ పారిశుధ్యవంతమైన గ్రామాలుగా దేశం అవతరించి నరేంద్రమోదీ ఆశించిన విధంగా 2019 నాటికి స్వచ్ఛభారత్ సాధించే విధంగా గ్రామాలు సాగుతూ అచ్చేదిన్ దిశగా అడుగులు పడుతున్నాయి.

దేశంలో గ్రామీణాభివృద్ధిని పరుగులు పెట్టించి,అధిక భాగం గ్రామాల్లో నివసిస్తున్న పల్లె జీవనానికి జవసత్వాలు అందించి గ్రామాల ముఖ చిత్రాన్ని మార్చాలని యోచించిన కేంద్ర ప్రభుత్వము బడ్జెట్‌లో అధిక కేటాయింపులు చేసింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం క్రింద 49 లక్షల గృహాల నిర్మాణం మరియు 88 వేల మంది మేస్త్రీలకు శిక్షణ ఇవ్వడానికి 2018-19 బడ్జెట్‌లో 21,000 కోట్లరూపాయలను కేటాయించడం జరిగింది. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన ద్వారా 19 వేల కోట్లతో 57,000 కి.మీ పొడవు రోడ్ల నిర్మాణం చేయాలని సంకల్పించి ఆ దిశగా ముందుకు సాగుతున్నది. మెరుగైన జీవనానికి కావాల్సిన సౌకర్యాలు సమకూర్చుకోవడానికి ఇతర ప్రాంతాలకు రాకపోకలు అవసరము అందుకు గాను రోడ్ల నిర్మాణము ఎంతో అవసరము. గ్రామాలను పట్టణ ప్రాంతాలతో అనుసంధానం చేయడానికి మెరుగైన రోడ్లు ఆవశ్యకము తద్వారా గ్రామీణ ప్రజలు పట్టణ ప్రాంతాలకు వెళ్ళి విద్య,వైద్యము లాంటి సేవలు సులువుగా పొందడానికి ఆస్కారము ఉంటుంది. ఇవే కాకుండా జాతీయ సామాజిక సహాయపథకం ద్వారా 3.09 కోట్ల లబ్ధిదారులకు సహాయం అందించాలని 9,975 కోట్లు కేటాయించింది. వాటర్ షెడ్ కార్యక్రమము ద్వారా 1.86 లక్షల సాగుభూమికి నీటిపారుదల కల్పించడము కోసం 2,146 కోట్లు కేటాయించడం జరిగింది. సౌభాగ్య యోజన ద్వారా నాలుగు కోట్ల పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఇవ్వడానికి 1600 కోట్లు కేటాయించడం జరిగింది. విద్యుత్ వెలుగులు ప్రసరింపనికుటుంబాలకు వెలుగులు నింపి తమ జీవితాల్లో మార్పును తీసుకురావడం ద్వారా సౌభాగ్య వంతులనుచేయాలని భావించిన ప్రభుత్వం అధిక కేటాయింపులు చేసింది. పేద,మధ్య తరగతి ప్రజల సంక్షేమము పట్ల చిత్తశుద్దిని కలిగిన ప్రభుత్వము ఉజ్వల పథకము ద్వారా నిరుపేద మహిళలకు 8 కోట్ల ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడానికి పూనుకొన్నది. వంట చెరుకు కోసం కలపపై ఆధారపడి కంటి సంబంధిత వ్యాధులతో ఇబ్బందిపడుతున్న పల్లె జీవనానికి విముక్తి కలిగించాలని ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం ద్వారా ఆరోగ్యాభివృద్ధికి పూనుకొంటున్నది. పల్లెల్లో డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించాలని భావించిన ప్రభుత్వము డిజిటల్ ఇండియా స్థాపనకు అంకురార్పణ చేసింది. దేశంలో 16.8 కోట్ల గ్రామీణ కుటుంబాల్లో 12 కోట్ల కుటుంబాలకు కంప్యూటర్లు లేవు. డిజిటల్ అక్షరాస్యులు లేరు. డిజిటల్ అక్షరాస్యతను ప్రోత్సహించేందుకు జాతీయ డిజిటల్ అక్షరాస్యత మిషన్,డిజిటల్ సాక్షరత అభియాన్‌ల పేరిట ప్రభుత్వం రెండు పథకాలను అమలు చేస్తున్నది. గ్రామీణ భారత్ కోసం డిజిటల్ అక్షరాస్యత పథకమును ప్రారంభించి వచ్చే మూడేళ్ళలో 6 కోట్లకుటుంబాలను డిజిటల్ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. డిజిటల్ ఇండియా కార్యక్రమం క్రింద జాతీయ భూమి రికార్డు ఆధునికీకరణ కార్యక్రమాన్ని ప్రక్షాళన చేసి కేంద్ర రంగ పథకముగా అమలు చేస్తున్నారు. ఇలా గ్రామీణభారతాన్ని డిజిటల్‌మయంగా చేయాలని భావించిన ప్రభుత్వం డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని విజయవంతముగా అమలు చేస్తున్నది. నగదు రహిత సమాజం దిశగా ఓ వైపు అడుగులు పడి డిజిటల్ అక్షరాస్యులుగా తయారుకావాల్సిన తరుణంలో డిజిటల్ అక్షరాస్యత అత్యంత ఆవశ్యకము. దేశంలో గ్రామాలు, పట్టణాలు ఒకటేమిటి వ్యవస్థ అంతా నగదురహితసమాజం ఆవిష్కరణ దిశగా ప్రభుత్వాలు చేస్తున్న కృషికి ప్రజల మద్దతు ఎంతో అవసరం. ఆధునిక యుగంలో అంతర్జాలమును అనుసంధానము చేసి ప్రపంచీకరణ యవనికపై ఎక్కడినుండైనా సమాచార మార్పిడి జరిగే అవకాశాలు ఆవిష్కృతమవుతున్న వేళ డిజిటల్ గ్రామాలు ఆవశ్యకము ఎంతైనా కలదు. పౌరుల బాధ్యత ఓటు వేయడంతోనే పూర్తవుతుందని అనుకోవడం అసలైన ప్రజాస్వామ్య స్ఫూర్తి కాదు. వారు పరిపాలనలో నిరంతరం పాలుపంచుకొనేలా ప్రోత్సహించాలి. ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యంతోనే జాతి నిర్మాణం,అభివృద్ధి సాధ్యపడతాయి అని ప్రధాని అభిప్రాయపడ్డట్లుగా ప్రజాస్వామ్యదేశంలోని ప్రభుత్వాలు,పరిపాలన,పథకాలు సమర్ధవంతముగా అమలు కావాలంటే ప్రజా భాగస్వామ్యం తప్పనిసరి. అప్పుడే ప్రజాస్వామ్య సౌధాలు ప్రజల ఆశలు,ఆశయాలకు,ఆకాంక్షలకు అద్దంపడుతూ ప్రజాస్వామ్యస్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఏ పథకము అయినా ఆయా ప్రాంతాల,గ్రామాల ప్రజల భాగస్వామ్యంపైననే ఆధారపడి సఫలీకృతమవుతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న వివిధ గ్రామీణ అభివృద్ధి పథకములు గ్రామీణ భారతాన్ని ఆధునిక భారత్ తీర్చిదిద్దే విధంగా కృషిచేస్తున్నాయి. పేదరికంలేని భారత్ సమాజాన్ని చూసే రోజుల అతి దగ్గరలోనే ఉన్నాయనడంలో ఎలాంటి సంశయము లేదు. దేశ నిర్మాణంలో అట్టడుగు భాగాన ఉన్న పల్లెల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి ఆధారపడి ఉన్నది. పల్లె సీమలే దేశ అభివృద్ధికి పట్టుగొమ్మలుగా నిలిచి ఆధునిక భారత్‌గా అవతరించడానికి ప్రభుత్వాలతో పాటు ప్రతీ పౌరుడు కృషి చేయాల్సిన అవసరము ఎంతైనా కలదు.

**- ఎ.శ్యామ్ కుమార్,**

హన్మకొండ,జి. వరంగల్(అర్బన్)

# నూతన పంచాయతీరాజ్ చట్టం-2018 లో పంచాయతీ కార్యదర్శి విధులు, బాధ్యతలు

**ఉపోద్ఘాతము:**

తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018 మరియు సెక్షన్ 43 ప్రకారముగా పంచాయతీ కార్యదర్శి విధులు మరియు బాధ్యతలను పేర్కొనడం జరిగింది. అట్టి విధులు, బాధ్యతలు ఈ క్రింది విధముగా గలవు.

1. పంచాయతీ కార్యదర్శిగారు ప్రతినెల నిర్వహించవలసిన సాధారణ సమావేశము యొక్క తేదీని శ్రీయుత సర్పంచ్ గారికి నివేదించవలయును.

   ఎ) సర్పంచ్ గారి అనుమతితో సాధారణ సమావేశమునకు ఏర్పాట్లు చేయవలెను

   బి) పైన పేర్కొన్న అన్ని విధులు నిర్వహించుటలో విఫలమైనచో క్రమశిక్షణ చర్యలకు బాధ్యుడగును

2. పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ మరియు గ్రామసభ మరియు వాటి కమిటీల సమావేశములలో పాల్గొనవలెను కాని ఎలాంటి తీర్మాణమును ప్రతిపాదించకూడదు మరియు ఓటింగులో పాల్గొనరాదు.

3. పంచాయతీ కార్యదర్శి గారు గ్రామపంచాయతీ సాధారణ సమావేశము నిర్వహించిన మూడు దినముల లోపల అట్టి సమావేశపు తీర్మాణముల ప్రతులను శ్రీయుత విస్తరణ అధికారి (పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి) గారికి పంపించవలెను.

4. గ్రామపంచాయతీ సమావేశములలో చేసిన తీర్మాణములను అమలుపర్చుట పంచాయతీ కార్యదర్శి విధి.

5.(i) పంచాయతీ కార్యదర్శి గారు "రోజ్‌నామ్చా" అనగా ప్రతిరోజు గ్రామములోనికి వచ్చిపోయే అపరిచిత వ్యక్తులసమాచారము నమోదు చేయుట, స్థానికులు కాని వారు గ్రామములోనికి వచ్చినచో వారికి సంబంధించిన సమాచారము సేకరించి రికార్డు చేసి, సర్పంచ్ గారికి తెలియజేయవలెను.

(ii) గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుటకు చర్యలు గైకొనవలెను.

(a)ప్రతిరోజు ఉదయాన్నే పంచాయతీ కార్యదర్శి గారు గ్రామ సందర్శన చేసి అపరిశుభ్ర పరిసరాలను గుర్తించి వెంటనే శుభ్రపర్చుటకు చర్యలు గైకొనవలెను. సఫాయి సిబ్బంది యొక్క హాజరు నమోదు చేసి వారికి పని విభజన చేసి రోజు మొత్తం గ్రామాన్ని శుభ్రపర్చే విధంగా వీక్లి (వారపు) పారిశుధ్య ప్రణాళిక



తయారుచేయవలెను. అట్టి పారిశుధ్య ప్రణాళికకు అనుగుణంగా గ్రామములోని వీధులు, ఇతర పబ్లిక్ స్థలాలు, సంస్థలు మరియు పాఠశాలలు, కాలనీలు మొత్తం శుభ్రం చేయవలెను. మురుగునీటి కాలలువలను శుభ్రపరచి మురుగునీరు నిలువలేకుండా చర్యలు గైకొనవలెను. ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించి దానిని డంపింగ్ యార్డులకు తరలించవలెను. చెత్త తరలించే వాహనాలను ఎప్పటికి తగిన రీతిలో అనువుగా ఉంచవలెను. రిపేర్లు చేయించి లాగడానికి తగురీతిలో ఉంచవలెను. బ్లీచింగ్ మరియు సున్నం చల్లించవలెను.

(b) దోమల నివారణ చర్యలను గైకొనవలెను. మురుగు నీటి నిల్వలను తొలగించవలెను. నిల్వ ఉండే ప్రదేశాలలో గంబూషియా చేపలను వదలవలెను. ఇట్టి వివరములను ఒక లాగ్‌బుక్ ఏర్పాటు చేసి అందులో నమోదు చేయవలెను. దోమల మందు స్ప్రే చేయించవలెను

(c) గ్రామములోని అన్ని పాఠశాలలో వివిధ సంస్థలలో, అంగన్‌వాడీ, పశువుల వైద్యశాల, వైద్యశాల, కమ్యూనిటీ హాల్స్‌లలో పారిశుద్ధ్యము చేయించవలెను

(d) ప్రతిరోజు రోడ్లు ఊడిపించుట మరియు అట్టి ఊడ్చిన చెత్తకుప్పలను ఎత్తివేయించుట, పబ్లిక్ స్థలాలలో ఎలాంటి చెత్తకుప్పలు లేకుండా చూడవలెను

(e) గ్రామములోని, పని చేయని బోరు గుంతలను, బావి గుంతలను, పాత చేదుడు బావులను ఇరత గుంతలను పూడ్పించ వలెను

(i) మ్యాజిక్ సోక్ పిట్స్ మరియు కమ్యూనిటీ సోక్ పిట్స్‌ని నిర్మించుటకు ప్రోత్సహించి తగు చర్యలు గైకొనవలెను

(ii) గ్రామములో త్రాగునీటి సరఫరాకు ఏమైన ఇబ్బందులు ఏర్పడితే సంబంధిత త్రాగునీటి సరఫరా అధికారికి తెలియజేసి నీటి సరఫరాలో ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలి

(iii) గ్రామములో ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా మరియు సీజనల్ జబ్బులైన అతిసార, డైయేరియా లాంటి రోగాలు జరగకుండా చర్యలు గైకొని సంబంధిత వైద్య అధికారికి సమాచారము ఇచ్చి వారితో సహకరించడం

(iv) గ్రామపరిసరాలలో చెట్లు నాటే కార్యక్రమము చేపట్టాలి మరియు 85% నాటిన మొక్కలు బ్రతికే విధంగా చర్యలు గైకొనాలి. నాటిన మొక్కలు ఒక రిజిష్టరులో నమోదు చేయాలి

(v) గ్రామపంచాయతీ యొక్క ఆస్తుల రిజిష్టర్ (మూవబుల్ మరియు ఇమూవబుల్) నిర్వహించాలి. అదేవిధంగా పంచాయతీ భూములను, గ్రామపంచాయతీ పేరున రిజిష్టర్ చేయించాలి. ఎలాంటి అన్యాకాంతము కాకుండా బాధ్యత వహించాలి

(vi) ఉండే పంచాయతీ ప్రదేశాలలో ఎలాంటి ఆక్రమణలను లేకుండా చూడాలి. అతిక్రమణలను వెంటనే తొలగించాలి

(vii) గ్రామపంచాయతీ పరిధిలో సంతల వేలంలు సమయం ప్రకారం నిర్వహించాలి. ఉదా॥ రోజువారి సంత, వారపు సంత మరియు పశువుల సంతలు

(viii) గ్రామపంచాయతీ లెక్కల నిర్వహణ సక్రమంగా చేయాలి. అనగా ఆదాయ వ్యయాలను నిర్వహణ చేయాలి

(ix) గ్రామపంచాయతీ సిబ్బందిపై నియంత్రణ కలిగి ఉండాలి మరియు సర్పంచ్ గారి పరిపాలన నియంత్రణ క్రింద మరియు సిబ్బందికి వేతనాలు చెల్లించాలి.

(x) గ్రామపంచాయతీకి వచ్చే అన్ని రకాల నిధులకు సంబంధించి బాధ్యత వహించాలి మరియు నిధులను తన ఆధ్వర్యములో ఉంచవలెను.

(xi) గ్రామపంచాయతీ రికార్డులను నిర్వహించాలి మరియు కంప్యూటరైజ్ చేయించాలి. అలాగే ప్రతివారం వాటిని అప్‌డేట్



చేయాలి. పంచాయతీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.

(xii) పంచాయతీ కార్యదర్శి గ్రామపంచాయతీ యొక్క పన్నులు మరియు ఇతర ఫీజులు మొత్తం డిమాండ్ వసూలు చేయాలి. పన్నులు విధించే ఇండ్లకు పంచాయతీ ఆమోదించిన 15 రోజులలో కొత్త పన్నులు విధించాలి. విధించిన పన్నులను మొదటి 3 మాసాల వ్యవధిలో వసూలు చేయాలి. గ్రామపంచాయతీ యొక్క పన్నుల డిమాండును తయారుచేసి 15 రోజులలో గ్రామపంచాయతీ ఆమోదించాలి. పంచాయతీ కార్యదర్శి తయారు చేసిన కొత్త పన్నుల విధింపును గ్రామపంచాయతీ 15 రోజుల లోపల సవరణలతోగాని సవరణ లేకుండా కాని ఆమోదించాలి. ఇట్టి విధిని నిర్వహించుటలో పంచాయతీ కార్యదర్శి విఫలమైతే అతనిని సర్వీసు రూల్స్ ప్రకారము సర్వీసు నుండి తొలగించబడును.

ఒకవేళ గ్రామపంచాయతీ పంచాయతీ కార్యదర్శి తయారు చేసిన డిమాండును సరియైన కారణం లేకుండా ఆమోదించకపోతే గ్రామపంచాయతీని కమిటీ రద్దుపర్చబడును.

(xiii) పంచాయతీ కార్యదర్శి జనన మరణముల, వివాహ రిజిష్టర్లను నిర్వహించాలి.

(xiv) పంచాయతీ కార్యదర్శి సాధారణంగా ఏర్పడే ఖాళీలపై జిల్లా కలెక్టరుకు రిపోర్టు చేయాలి (అనగా సర్పంచ్, ఉప-సర్పంచ్ మరియు సభ్యుల ఖాళీలను)

(xv) గ్రామములోని ఇండ్ల యొక్క లెక్కలు, అనగా వారి ఉద్యోగ వివరాలు, ఇండ్ల వివరాలు, భూముల వివరాలు, భూమిలేని నిరుపేదల వివరాలు నిర్వహించాలి.

(xvi) పంచాయతీ పరిధిలోని 90% వీధి విద్యుత్ దీపాలు వెలిగే విధంగా చూడాలి

(xvii) పంచాయతీ యొక్క నీటి సరఫరా, వీధి విద్యుత్ దీపాలు, కరెంటు చార్జీలు పంచాయతీ చెల్లించే విధంగా చూడాలి.

6. సామాజిక అడవుల పెంపకం - హరితహారం:

(i) పంచాయతీ కార్యదర్శి సామాజిక అడవుల పెంపకమునకు చర్యలు గైకొనవలెను. అందులో పండ్ల మొక్కలు పెంపునకు ప్రభుత్వ భూములలో చర్యలు తీసుకోవాలి

(ii) ప్రతి ఇంటికి కనీసం 6 మొక్కలు పంపిణీ చేయాలి. ప్రతి ఇంటి యజమాని బాధ్యత అట్టి (6) మొక్కలు తప్పని సరిగా పెంచవలెను. ఒకవేళ ఇంటి యజమాని అట్టి మొక్కలు పెంచుటలో విఫలమైతే అతని పై ఇంటిపన్నుకు సమానమైన పెనాలిటీ (జరిమాన) విధించాలి

(iii) గ్రామములోని ప్రతి వీధి నందు మొక్కల పెంపకం చేయాలి అలాగే ఖాళీ స్థలాల యందు, ప్రభుత్వ భూముల యందు చెట్ల పెంపకం చేపట్టాలి

(iv) నాటిన చెట్లల్లో 85% బ్రతికే విధంగా చర్యలు తీసుకోవాలి. వాటికి క్రమము తప్పకుండా నీళ్ళు పోయాలి.

(v) గ్రామపంచాయతీలో అవసరాలకు సరిపడ ఒక నర్సరి పెంపకము చేయుట పంచాయతీ కార్యదర్శి బాధ్యత. నర్సరిలో పెంచవలసిన మొక్కల యొక్క సంఖ్య మరియు ఏ రకమైన మొక్కలు పెంచాలి అనే బాధ్యత కూడా పంచాయతీ కార్యదర్శిదే. సాధ్యమైనంతవరకు పండ్ల మొక్కలు మరియు మునగ, మామిడి, చింత, వేప, నిమ్మ, జామ మరియు నేరేడు జాతి మొక్కలు పెంచాలి.

7. పంచాయతీకార్యదర్శి గ్రామపంచాయతీ యొక్క పూర్తి సమాచారము ఎప్పటికప్పుడు సేకరించి పాత సమాచారమును అప్‌డేట్ చేయాలి. ఇది ప్రతి నెల తప్పని సరిగా చేయాలి. (గ్రామములోని పశువుల వివరాలు, భూముల వివరాలు, ఆస్తు వివరాలు)

8. ప్రతి పంచాయతీ కార్యదర్శి తను పని చేస్తున్న గ్రామములోనే నివాసముండాలి

9. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018 ననుసరించి ఏ ఏ సెక్షన్ల ప్రకారము పంచాయతీ కార్యదర్శి యొక్క విధులు, బాధ్యతలు చెప్పబడినవో అవి అన్ని తూచ తప్పకుండా పాటించాలి

10. పంచాయతీ కార్యదర్శి యొక్క విధులను, బాధ్యతలను తప్పని సరిగా ముద్రించి ప్రజలందరికి తెలిసే విధంగా ప్రతి నెల తెలియజేయాలి. ఎలాంటి విధినైనా చేయని పక్షంలో క్రమశిక్షణ చర్యకు బాధ్యుడగును.

11. పంచాయతీ కార్యదర్శి ప్రభుత్వము నుండి వచ్చే ఆదేశములను నిర్వహించుట అతని బాధ్యతగా ఉండును.

12. అనుమతులు లేక మరే ఇతర ఆదేశములనైన గ్రామపంచాయతీ ఇచ్చినచో వెంటనే రెండవ అట్టి పనులను పూర్తిగావించాలి.

పై విధంగా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లో పంచాయతీ కార్యదర్శి యొక్క విధులు, బాధ్యతలు నిర్వహించబడినది.

**డా॥. జి. ఆంజనేయులు**
పరిపాలనాధికారి,
టి. యస్. ఐ. ఆర్. డి

# స్త్రీలపై అణచి'వేత'లకు అంతమెప్పుడు?

దేశంలో మహిళలపై జరిగే నేరాలు-ఘోరాలు కొంగొత్త రూపును సంతరించుకొని,అభద్ర భారతావనిగా దుష్టకీర్తిని మూటగట్టుకుంటున్నది. దేశంలో సాంకేతిక విజ్ఞాన నేత్రాలు విచ్చుకుని,ఆధునికవంతమైన జీవనముతో విద్యావంతులు అధికమవుతున్నా స్త్రీలపై జరిగే అణచివేతలు ఏళ్ళుగా కొనసాగుతూనే ఉంటూ అధికమవుతున్నాయి తప్ప, అడ్డుకట్టపడడం లేదు.దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిర్భయ కేసు దరిమిలా నిర్భయ చట్టం తీసుకొచ్చి స్త్రీలపై జరిగే అఘాయిత్యాలను అంతమొందించాలని ఆశించినా అత్యాచారాల పరంపర కొనసాగుతూనే ఉన్నది. దేశంలో జాతీయ నేర గణాంక సంస్థ వెల్లడి చేస్తున్న నివేదిక ప్రకారంగా సుమారుగా దేశ వ్యాప్తంగా ప్రతీ పావుగంటకో మహిళ వేధింపులకుగురిఅవుతుందన్న చేదు నిజాన్ని వెల్లడి చేసింది.ఇదిలా ఉంటే రోజురోజుకు మహిళలపై జరిగే అత్యాచారాలు, హత్యలు, వేధింపులు లాంటి హింసాత్మక ప్రవృత్తి అధికమయి భారత నారీమణుల భావిజీవితాలకు భద్రత కరువవుతున్నది.సంస్కృతి, సంప్రదాయాల కలబోతతో కూడిన భారతదేశంలో స్త్రీలకు విశిష్ట ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను కల్పించి భారతమాతగా కొనియాడే దేశం లో ఆధునికతవైపు పయనిస్తున్నా మహిళలపై హింసా ప్రవృత్తి పెచ్చరిల్లుతూ జారుడు మెట్ల వ్యవస్థను తలపిస్తున్నది. పురాణాలు, ఇతిహాసాలు ఇత్యాది చారిత్రక గ్రంథాల లోనూ స్త్రీలను కనిపించే దేవతలు గా అభివర్ణిస్తూ సమాజం విస్తృతికి, కుటుంబవ్యవస్థకు స్త్రీనే ప్రధాన వ్యక్తిగా కీర్తిస్తూ, మహిళా శక్తిని వేనోళ్ళా కొనియాడుతారు.ఇలాంటి చారిత్రక సంస్కృతి కలిగిన దేశంలో మహిళలపై ఆమ్లదాడులు,వేట కొడవళ్లతో దాడులు లాంటి దుష్ట చర్యలతో దుష్కీర్తిని మూటగట్టుకొని ఆధునిక భారతావనికి అర్ధమేలేకుండా పోతున్నది. అభివృద్ధిలో ఆధునికతవైపు పయనిస్తున్నామని భావిస్తున్నా మహిళలపట్ల పెచ్చుమీరుతున్న హింసా ప్రవృత్తితో మాత్రం అనాగరిక చర్యలతో ఆటవిక వ్యవస్థను తలపిస్తున్నది.

జాతీయ నేరగణాంక సంస్థ నివేదిక ప్రకారం దేశంలో 3,27,394 నేరాలు మహిళలపై జరగగా, 6070 అత్యాచార కేసులు నమోదయినాయి. ముక్కుపచ్చలారని ఆరేళ్ళలోపు పిల్లలపై జరిగే అత్యాచారాలు భారత జాతిని నివ్వెరపరుస్తున్నాయి. మానవుని పరిణామక్రమం ఆధునికత వైపు పయనిస్తున్నదా ? ఆటవిక జీవనం వైపు పయనిస్తున్నదా ? అన్న సందేహాన్ని లేవనెత్తుతూ ఇలాంటి జంతు సంస్కృతికి అడ్డుకట్ట వేయడానికి అత్యంత తీవ్రంగా పరిగణించకపోతే వినాశనానికి దారితీసే ప్రమాదము పొంచి ఉంటుంది. రేపటి సాధికారత వైపు పయనించే మహిళా సమాజాన్ని నిర్మించాలంటే ఇలాంటి చర్యలను కూకటివేళ్ళతో పెకిలించాలి. ఇప్పటికే దేశంలో ఆడపిల్లల సంఖ్య తగ్గుతున్నది.పెచ్చుమీరుతున్న హింసాప్రవృత్తి, వరకట్న దురాచారాలు, మార్కెట్ మాయాజాలంలో అమ్మకాలను పెంచే ఆటబొమ్మగా స్త్రీమూర్తులను భావిస్తున్న కార్పోరేట్ విషవలయంలో కాసులతో కొలవబడుతూ అపసవ్యధోరణిలో పయనిస్తున్నది. భారతీయ సంస్కృతి ఇప్పుడు విదేశీమోజులో పడి కట్టు,బట్టు మారుతున్నాయి.అంగడిలో సరుకులా కాసులు గుమ్మరిస్తే ఏదైనా దొరుకుతుంది అన్న దురాలోచనతో భారతీయ సంస్కృతి కనుమరుగయిపోయే రోజులు రానున్నాయి. దేశంలో పెరుగుతున్న సమాచార ప్రసారమాధ్యమాలు, సామాజిక మాధ్యమాల పుణ్యమాని అని ఏమూలన జరిగే కార్యక్రమము అయినా బహిర్గతం అవుతున్నది.ఆడపిల్లను అమ్మకడుపులోనే అంతమొందించే విషసంస్కృతికి అంతమొందించాలని చట్టం రూపొందించినా పకడ్బంధీగా అమలయిన జాడలు అంతంత మాత్రమే. పేదరికంలో మగ్గుతున్నవారికి ఆడ్డపిల్ల పెనుభారంగా మారుతున్నది. సమాజంలోను ఆడపిల్లల పట్ల అవలంబించే ధోరణిలోనూ మార్పులు కనిపిస్తున్నాయి. ఆడపిల్ల పుట్టగానే ఆసుపత్రిలోనే వదిలివెళ్ళే అభాగ్యులు ఒకవైపు, చెత్తకుండీల యందు, ముళ్ళపొదలయందు పడవేసే ప్రబుద్దులు ఒకవైపు, లేదంటే ఆసుపత్రి నుండే అమ్మకానికి పెట్టే మార్కెట్ సంస్కృతి మరోవైపు తో ఆడపిల్లల జననాలు మురికికూపంలోకి నెట్టబడుతున్నాయి.ఇలాంటి సంఘటనలు నిత్యకృత్యం అవుతూ ఉంటే ఆధునిక భారతీయ సమాజం భారతమాతల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసే ప్రమాదఘడియలు ముంచుకు రానున్నాయి.

మన దేశంలో స్త్రీలపై జరిగే హింసకు వ్యతిరేకంగా పలు కార్యక్రమాలతో మహిళలను చైతన్యవరుచుతూ చట్టం ప్రాధాన్యతను, భారతీయ మహిళల విశిష్టతను వెలిబుచ్చవలసిన ఆవశ్యకత కలదు.భారతీయ మహిళలంటే కట్టులోనూ, బొట్టులోనూ ప్రపంచ వ్యాప్తంగా విశిష్ట ప్రాధాన్యతను సంతరించుకుని విదేశీయులు సైతం అనుకరణకు ప్రాధాన్య మిస్తున్నారు. అలాంటి మహిళా



మూర్తులపై దేశంలో జరిగే హింసాత్మక కార్యక్రమాలతో భారతమాత నిస్సిగ్గుగా తలదించుకుంటోంది. ప్రపంచ వ్యాప్తంగా విలువల ఘనకీర్తితో ఊరేగుతున్న నారీమణుల కీర్తి స్వదేశంలో అక్కడక్కడా జరిగే నిస్సిగ్గు కార్యక్రమాలతో యావత్‌దేశం నివ్వెరపోతూ విలువల వలువలు పలుచనవుతున్నాయి. అలనాటి స్త్రీమూర్తికి ఉన్నటువంటి ప్రాశస్త్యాన్ని భావితరాలకు అందించకుంటే భారతమాత తలదించుకునే పరిస్థితి దాపురిస్తుంది. దేశం ఆటవిక, అనాగరిక సమాజంనుండి నాగరిక, ఆధునిక సమాజము వైపు పయనిస్తూ అభివృద్ధితో తారాజువ్వలా దూసుకుపోతున్నా విలువల పునాదులు మాత్రం పెకిలించకుండా ఉంటేనే దేశం ప్రపంచానికి ఆదర్శప్రాయంగా నిలుస్తుంది. లేదంటే మేడిపండు చందంను తలపిస్తుంది. రానున్న పదిహేనేళ్ళలో ప్రపంచ వ్యాప్తంగా లింగ విచక్షణకు అంతం పలకాలన్న లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి సహా అంతర్జాతీయంగా వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. పురుషాధిక్య సమాజంలో లింగ వివక్షను రూపుమాపాలంటే మేలిమి విద్యనందించడమై ఉపయుక్తమైన మార్గం. విద్యతోనే ఆధునిక సమాజం నిర్మాణం అవుతుంది. మహిళా విద్య పట్ల శ్రద్ధ కనబరుచుతూ స్త్రీలలో సంపూర్ణ అక్షరాస్యతను పెంపొందించాలి. మహిళా విద్యా వంతురాలయితే కుటుంబం, తద్వారా దేశం విద్యావంతముగా రూపుదిద్దబడుతుంది. కానీ దేశంలో పురుషుల అక్షరాస్యతా నిష్పత్తితో పోల్చితే స్త్రీలలో అక్షరాస్యతా శాతం తక్కువగా కలదు. దేశంలో 2011 లెక్కల ప్రకారం అక్షరాస్యతా శాతం 74.04 కాగా పురుషులల్లో 82.14 శాతం, స్త్రీలల్లో 65.46 శాతం మాత్రమే కలదు. పురుషుల అక్షరాస్యతా శాతంతో పోల్చగా 16.68 శాతం వ్యత్యాసం కలదు. ఇదిలా ఉంటే 1951 లో 8.86 శాతం ఉన్న మహిళా అక్షరాస్యత 2011 నాటికి 65.46 శాతంతో గణనీయంగా పెరిగినా 60 సంవత్సరాలు గడిచినా శత శాతం దిశగా అడుగులు పడకపోవడం శోచనీయం. నేటికీ సుమారు 35 శాతం మహిళా నిరక్షరాస్యతతో మహిళాభ్యుదయం వెలవెలపోతున్నది.

స్త్రీ, పురుష లింగ నిష్పత్తిలోనూ తేడా పెరుగుతున్నది. దేశంలో 2011 లెక్కల ప్రకారం 1000 మంది పురుషులకు 943 మంది మాత్రమే స్త్రీలు కలరు. పురిట్లోనే ఆడపిల్లల గొంతు నులిమి భ్రూణ హత్యలకు పాల్పడే దుర్మార్గపు సమాజము ఒక వైపు ఆడపిల్లలను బాహ్యప్రపంచానికి రాకముందే కడతేరుస్తున్నారు. సమాజంలో స్త్రీల పట్ల పెరుగుతున్న వ్యతిరేక ధోరణికి సమాజంలో పెచ్చుమీరుతున్న భ్రూణహత్యలే సజీవ సాక్ష్యం. సృష్టికి మూలమైన ఆడపిల్లల పట్ల సమాజం అపసవ్య ధోరణిలో ఆలోచిస్తున్నది. ఆడపిల్లను భారంగా భావిస్తున్నది. లింగ అసమానత అభివృద్ధికి అడ్డంకిగా మారింది. స్త్రీలను ప్రయోజకులుగా మారి, దేశ ఉత్పత్తిలో పాలుపంచుకోకుండా మహిళాశక్తిని ప్రదర్శించకుండా వారిని వంటింటికే పరిమితం చేసే పురుషాధిక్య సమాజం పాతుకుపోవడంతో దేశంలో అభివృద్ధికి అవరోధంగా మారింది. అంటే ఎంతటి దురవస్థ దాపురించిందో అర్థమవుతున్నది. ఇంతటి భారీ అసమానతలతో స్త్రీలు సమాజంలో ఏటికి ఎదురీదుతున్నారు. తమ మనుగడ కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. లింగ వివక్షతను రూపుమాపడం, లింగ అసమానతలను తగ్గించడానికి గాను ఆర్థిక సంబంధిత విషయాలలో జోక్యం చేసుకోవడం మరియు అవకాశాలు, విద్య, రాజకీయ సాధికారత మరియు ఆరోగ్యం మరియు మనుగడ అనే నాలుగు అంశాల ఆధారంగా జెండర్ అసమానతలను రూపుమాపడానికి ర్యాంకులను ప్రకటించడం జరుగుతున్నది. దేశంలో 63.6 కోట్ల మహిళా జనాభాతో సమారుగా 48 శాతం మహిళా జనాభా కలదు. ఇంతటి భారీ మహిళా జనాభా కలిగిన దేశంలో లింగ అసమానతలను రూపుమాపడానికి, మహిళా సాధికారతను సాధించడానికి 2005 లో లింగ భాద్యాతయుత బడ్జెట్‌ను స్వీకరించడం జరిగింది. దేశంలోని 57 ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు లేదా విభాగాలు జెండర్ బడ్జెటింగ్ సెల్‌ను ఏర్పాటు చేశాయి. తగ్గుతున్న బాలికల నిష్పత్తిని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం హరియాణాలో బేటీ బచావో భేటీ పడావో అనే పథకాన్ని ప్రవేశపెట్టి బాలికల రక్షణ, విద్యాభివృద్ధి లక్ష్యంగా ముందుకుసాగుతున్నది. బాలికల లింగనిష్పత్తి తక్కువగా ఉన్న 100 జిల్లాల్లో తొలిదశలోపథకాన్ని ప్రారంభించడం జరిగింది. శిశు, మాతృ మరణాలను అరికట్టే లక్ష్యంతో జననీ సురక్ష యోజన, జననీ శిశు రక్షణ కార్యక్రమం లాంటి పథకాలు మహిళా సంక్షేమమే ధ్యేయంగా కొనసాగుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న బాల్యవివాహాల్లో 40 శాతానికి పైగా భారత్‌లోనే జరుగుతున్నాయన్న చేదు నిజాన్ని యునిసెఫ్ నివేదిక ఇటీవలి వెల్లడిచేసింది. ఆధునిక సమాజ నిర్మాణములో దేశం ముందుకుసాగుతున్నదని భావిస్తున్నా నేటికీ అభం, శుభం తెలియని అమాయక చిన్నారుల జీవితాలు బాల్యవివాహాల కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నాయి. దేశంలో 19 ఏళ్ళ బాలికల్లో 41 శాతానికి పైగా బాల్యవివాహాలకు సమిధలయ్యారన్న వార్త కలచివేస్తోంది. ఆడిపాడే వయసులో మాతృత్వానికి ఒడిగట్టి తన ఆడిపాడే ప్రాయాన్ని వివాహము అనే బంధానికి బంధించబడితే ఆరోగ్యకరమైన మహిళాసమాజం, ఆరోగ్యవంతమైన భారతము ఎలా నిర్మితమవుతుంది. దేశంలో అక్షరాస్యత లేని రాష్ట్రాలకు తోడు అధిక అక్షరాస్యత ఉన్న రాష్ట్రాల్లోనూ బాల్యవివాహాల మహమ్మారి కబళించివేయడం ఆందోళన కలిగించే అంశం. ఇదిలా ఉంటే పసిప్రాయంలో పురుడుపోస్తే తల్లి, బిడ్డల ఆరోగ్యం ఏ రకంగా సురక్షితంగా ఉంటుంది. దేశంలో పేదరికంతో కునారిల్లుతున్న కుటుంబాల్లోనే అధికంగా ఇలాంటి బాల్యవివాహాలు జరుగుతూ ఉంటాయి. అసలే పేదరికం, ఆపై బాల్యవివాహాలు జరగడం వల్ల మాతృ శిశు మరణాలు సంభవించకుండా ఎలా ఉంటాయి. ఇలాంటి దుర్మార్గపు ఆచారానికి ఆడపిల్లల జీవితాలను బందీగా చేస్తే భవిష్యత్ అంధకారమవుతుంది. పెళ్ళి పేరిట ఆడపిల్లలను చిన్న వయసులోనే కట్టిపడేసే ధోరణికి స్వస్తి పలకాలని, కట్టుతప్పుతున్న తల్లిదండ్రులపై కేసులు పెట్టాలని ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వాలను ఆదేశించింది. బాల్యవివాహాలు సామాజిక వ్యవస్థకు ముప్పుగా పరిణమిస్తాయని వ్యాఖ్యానించింది. ఇలాంటి దుస్థితిలో భావి భారత పౌరులుగా దేశానికి మేలిమి వనరులుగా తయారయ్యి దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్ళాల్సిన ఆడపిల్లలు కట్టుబాట్లు, సామాజిక దురాచారాలల్లో

చిక్కుకుంటే దేశం ఏగతిన బాగుపడుతుంది.ఆడపిల్లల బాగోగులకు కేంద్రము,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దిష్ట కార్యాచరణతో,సంయుక్తంగా ముందుకుసాగితేనే బంగారు భవిష్యత్ సాక్షాత్కరమవుతుంది. అంతర్జాతీయ మహిళా పరిశోధన కేంద్రము(ఐసిఆర్‌డబ్ల్యు) వెలిబుచ్చిన నివేదిక ప్రకారం ప్రపంచంలో ప్రతి ముగ్గురు బాల వధువుల్లో ఒకరు భారత్‌కు చెందిన వారేనన్న చేదునిజం మహిళాలోకాన్ని,దేశాన్ని నివ్వెరపరుస్తోంది. బాల్యవివాహం శిక్షార్హమైన నేరమని,అది పిల్లల నిర్ణయ హక్కును కాలరాయడమేనని పలు సంస్థలు స్పష్టం చేసినా దురాచారము నిర్భయంగా కొనసాగుతూనే ఉన్నది. దేశంలో మహిళాభ్యుదయమే ధ్యేయంగా పలు చట్టాలు చేసి,అమలులోకి తెచ్చినా పసిప్రాయం మోసకారుల,దళారుల చేతుల్లో చిక్కుకుని వంచనకు గురి అవుతోంది.దేశంలో మహిళా రక్షణ పేరిట అమలులోకి వచ్చిన చట్టాలు, పథకాలు పూర్తిగా దురాచారాన్ని రూపుమాపడానికి దోహదపడడం లేదు. గ్రామీణ భారతావని అధికంగా గల మన దేశంలో నిరక్షరాస్యత అనే రాచపుండుహక్కులు, భాధ్యతలను పరిచయం చేయకుండానే జీవితాలను తొలిచివేస్తున్నది.దీనికి తోడు సామాజిక కట్టుబాట్లు అమలుతో కుటుంబాలు కుంగుబాటుకు గురి అవుతున్నాయి.

భారత్ కీర్తి ప్రతిష్టలు ప్రపంచ దేశాలకు ఎగబాకి, ఘనకీర్తిని ఎలుగెత్తి చాటుతున్నా భారతీయ మహిళలు దురాచారాలతో, కట్టుబాట్లతో, అణచివేతలతో, లింగ వివక్షతో మహిళాభ్యుదయానికి నోచుకోవడం లేదు. ఆడపిల్లగా పుట్టడమే శాపంగా మారి సామాజిక అంతరానికి కారణముగా మారుతున్నది. ఆడపిల్ల సమాజంలో మనుగడను కొనసాగించడమే సంక్లిష్టంగా తయారవుతున్నది. అసమానతల అంకురార్పణకు ఆజ్యం పోసి, విస్తరిస్తున్న భారీ తేడాకు సజీవ సాక్ష్యంగా గణాంకాలు చాటిచెపుతున్నాయి.ఇలా దేశంలో భారీ వ్యత్యాసం పోగుపడితే మహిళల మనుగడ ప్రశ్నార్థకం కానున్నది. ఇప్పటికే దేశంలో ఆడపిల్లల జనాభా తగ్గి ఆందోళన కలిగిస్తున్నది. మున్ముందు ఇలాగే కొనసాగితే మహిళాసమాజం కనుమరుగుకానున్నది. ఆడపిల్లల భ్రూణ హత్యలను నిషేదించినా చీకటి సామ్రాజ్యంలో యదేచ్ఛగా కొనసాగుతున్నది.దేశంలో ఏడాదికి సుమారుగా అయిదు లక్షల ఆడశిశువుల భ్రూణ హత్యలు జరుగుతున్నట్లు అంచనా. ఇలా లక్షల సంఖ్యల్లో ఆడశిశువుల హత్యల పరంపర కొనసాగితే సమాజంలో మహిళల పాత్ర ప్రశ్నార్థకం అయి, సమాజం విచ్ఛిన్నం అయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది. ఆడపిల్లల భ్రూణ హత్యల నివారణ చట్టం 1994 అమలులోకి వచ్చినా భ్రూణ హత్యల పరంపర కొనసాగుతూనే ఉన్నది.ఇదిలా ఉంటే మహిళా సంక్షేమము కోసం చేసిన చట్టాలు చుట్టుబండలవుతున్నాయి. భారతీయ మహిళ గడపదాటి బయటికి వచ్చి ఫిర్యాదు చేసే స్థితికి రానంతవరకు మహిళపట్లహింసోన్మాదం, వివక్ష, అణచివేతలు కొనసాగుతూనే ఉంటాయి. ప్రభుత్వాలు దూరదృష్టితో మహిళాభ్యుదయమే ధ్యేయంగా అన్నింటిలోనూ సమాన అవకాశాలు కల్పిస్తూ, మహిళా సాధికారతకు పట్టం కట్టాలని కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నది. మహిళల పట్ల, ఆడపిల్లల పట్ల సమాజంలో లైంగికంగా వేధించే ధోరణి అధికమగుచున్నది.

విద్యాబుద్ధులు నేర్పమని పాఠశాలకు పంపిస్తే తండ్రిలా విద్యాబుద్ధులు నేర్పి సమాజానికి మేలిమి మానవ వనరులను అందించాల్సిన కొందరు కీచక ఉపాధ్యాయులు ప్రేమ పేరుతో వంచించి, అర్ధాంతరంగా భావిజీవితానికి సమాధి కడుతున్నారు. కార్యాలయాల్లో ఉన్నత విలువలతో దిశానిర్దేశం చేయాల్సిన కొందరు కీచక అధికారులు మహిళలను వేధింపులకు గురిచేస్తూ లొంగదీసుకునే ఘనకార్యాలకు ఒడిగడుతున్నారు. నీలిచిత్రాలతో బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే నీచలోకంతో మహిళ విసిగి వేసారుతోంది. అందివచ్చిన ఏ అవకాశాన్ని వదులుకోని ప్రబుద్ధులు కొందరు మహిళలను లైంగికంగా వేధిస్తూ తమ సంసార జీవితాలను అగ్నికి ఆహుతి చేస్తున్నారు. ఇలాంటి చర్యలను నిశ్చేష్టులయిచూస్తూ ఊరుకోక అడ్డుకోవడానికి నడుంబిగించాలి. దేశంలో కొందరు ప్రముఖులు సైతం తమ ప్రేలాపనలతో మహిళల మనోధైర్యాన్ని దెబ్బతీస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. మహిళలు విద్యావంతులు కావాలి. ప్రజాస్వామ్య దేశంలో ప్రతీ మహిళ తమ, తమ హక్కులను సాధించుకునే దిశగా మహిళా శక్తిని కూడగడుతూ ముందుకు సాగాలి. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, చేసిన చట్టాలు అమలు పరిచే విధంగా ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలి. లేదంటే మహిళల పట్ల అణిచివేత కొనసాగుతూ మహిళా సాధికారత ప్రశ్నార్థకం కానుంది.

ప్రజాసమూహాల్లో చైతన్యం నింపాలంటే ముందు మహిళ మేలుకోవాలి. స్త్రీ కళ్ళు తెరిస్తే కుటుంబం, దానితో పాటే గ్రామం, ఆ వెంటే దేశం పురోగతి బాట పడుతాయి అని ప్రవచించిన మహనీయుని వాక్కుల సాక్షిగా మహిళాశక్తి సంఘటితం కావాలి. నినదించే గొంతులు చేతులు ఒక్కటయి పిడికిలి బిగించి మహిళా స్వరూపాన్ని ప్రదర్శించాలి. అలనాటి దేవతామూర్తులయినా, పోరాట వనితల వీరగాధలయినా మహిళల్లో పోరాట శక్తిని, స్ఫూర్తిని నింపాలి. పిడికిలి బిగించి నినదిస్తే దుష్టసమాజ కారకులకు ముచ్చెమటలుపోయాలి. అప్పుడే స్త్రీ శక్తి స్వరూపిణి అని నిరూపితమయి అత్యాచారాలకు తెగబడుతున్న, హింసాత్మక విధానాలకు ఆజ్యం పోసే ఆకతాయిలకు, అంగట్లో సరుకుగా భావించే ప్రబుద్ధులకు భయం పుట్టుకుంటుంది. అరాచక సంస్కృతిని త్యజించి స్త్రీమూర్తిని ఆరాధించే సంస్కృతికి పునరావిష్కృతమవుతుంది. అణిచివేతలకు ఎదురుతిరగనంతకాలము అశాంతి చెలరేగుతూనే ఉంటుంది. మహిళా మహిమాన్విత శక్తినినిరూపించకపోతే హింసాత్మక సమాజం దిశగా పయనిస్తూ హింస పెచ్చరిల్లుతూనే ఉంటుంది.దేశంలో మహిళాభ్యున్నతికి పలు చట్టాలు చేసి అమలవుతున్నా,పలు పథకాలు కొనసాగుతున్నా,పలు కట్టుదిట్టమైన చర్యలతో ప్రభుత్వాలు స్త్రీలపై జరిగే హింసాత్మక విధానాలకు అడ్డుకట్టవేస్తున్నా ఇంకా దుష్టసంస్కృతి వెల్లడి అవుతూనే ఉన్నది. విజ్ఞానవంతమైన సమాజంలో ఆధునిక విలువలతో ముందుకు సాగితేనే మహిళా హింసాత్మక విధానాలు అంతమొందించబడతాయి.అప్పుడే దేశం భారతమాత జెండా రెపరెపల తో శాంతి కాముకంగా, అభివృద్ధిలో అగ్రభాగాన దూసుకుపోతుంది.

**ఎ.చక్రపాణి,** హన్మకొండ, జి.వరంగల్



# నగదు రహితం.. సులభతరం..

కేంద్రం డిజిటల్ చెల్లింపుల వైపు సమాజాన్ని నడిపించాలనుకుంటున్నది. ఇందుకు తెలంగాణ ప్రభుత్వం మద్దతు ఇస్తున్నది. గ్రామాలను సైతం నగదురహిత లావాదేవీలవైపు మళ్లించేందుకు అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేసింది. ఒక్కసారిగా డిజిటల్ చెల్లింపుల వైపు వెళ్లలేకపోయినా క్రమేణా ఆ దిశలో పయనించడం అనివార్యమంటున్నారు ఆర్థికరంగ నిపుణులు.

చేతి నిండా నగదు లేదు. ఏది కొందామన్నా ఆపసోపాలు తప్పడం లేదు. ఏటీఎంకు వెళ్తే నగదు ఉంటదో ఉండదో.. ఉన్నా వచ్చేది రూ. 2వేలు. చాంతాడంత లైనులో మనకొస్తయో లేవో. ఇక ఊర్లల్లో పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఎప్పుడు చూసినా తాళమే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం డిజిటల్ చెల్లింపుల వైపు సమాజాన్ని నడింపించాలనుకుంటున్నది. ఇందుకు తెలంగాణ ప్రభుత్వం కూడా మద్దతు ఇస్తున్నది. గ్రామాలను సైతం నగదురహిత లావాదేవీల వైపు అడుగు లు వేయించేందుకు అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేసింది. అవగాహన కార్యక్రమాలు సైతం ఏర్పాటు చేస్తున్నది. ఈ క్రమంలో నగదురహిత లావాదేవీలతో అనేక లాభాలు ఉన్నాయని ఆర్థిక రంగ నిపుణులు చెబుతున్నారు. నగదురహిత ఆర్థిక వ్యవస్థ మన మంచికే అని చెప్తున్నారు.

**సులువు...**

ఆర్థిక లావాదేవీల్లో సులభ విధానాన్ని అవలంబించే ఆలోచన రావడమే పెద్ద మార్పు. ఆన్‌లైన్ లావాదేవీల వల్ల నగదు, ప్లాస్టిక్ కార్డులను మోసే బాధ తప్పుతుంది. ఎవరైనా తస్కరిస్తారన్న భయం, ఎక్కడైనా పోగొట్టుకుంటే ఎలా అన్న ఆందోళన ఉండదు. ఏటీఎం, బ్యాంకుల్లో గంటల తరబడి నిలబడే బాధ కూడా తప్పుతుంది. ప్రయాణంలో నూ భయాందోళనలు ఉండవు. ఖర్చు చేయడంలో వ్యూహాత్మకంగా వ్యవహరించవచ్చు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండేవారికి ఎప్పటికప్పుడు వారి బడ్జెట్‌ను గుర్తు చేస్తుంది. కుటుంబ నిర్వహణలో నిర్మాణాత్మకంగా వ్యవహరించవచ్చు. ప్రధానంగా అత్యవసర పరిస్థితులు, దవాఖానల్లో వినియోగించేందుకు సులువుగా ఉంటుంది. ఎప్పుడంటే అప్పుడు బ్యాంకులకు వెళ్లకుండానే అవసరమైన ప్రతిసారి వినియోగించొచ్చు. భౌతికంగా ప్రతి లావాదేవీ కోసం వెళ్లాల్సిన పని లేదు. పని వేళల్లోనూ నగదు బదిలీ చేయొచ్చు.

**అన్నీ పక్కాగా**

ఆన్‌లైన్ ద్వారా ప్రతి లావాదేవీలు రికార్డులో ఉంటుంది. దాంతో మనం ఎంత ఖర్చు చేయాలో ప్లాన్ చేసుకోవచ్చు. అలాగే ఆదాయపు పన్ను కోసం పత్రాలు సమర్పించేందుకూ సులభంగా ఉ ంటుంది. అధికారులకు ఏదైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసే వీలు కలుగుతుంది. పన్నుల చెల్లింపు ప్రక్రియకు దోహదపడుతుంది. ప్రతి నెలా బడ్జెట్‌ను రూపొందించుకోవడానికి డిజిటల్ లావాదేవీలు ఉ పయోగపడుతాయి. ఖర్చులను అంచనా వేసుకొని ఆదాయానికి తగ్గట్లుగానే తయారు చేయొచ్చు. దానికీ పలు రకాల యాప్స్‌ను వినియోగించుకోవచ్చు. పెద్దస్థాయిలో ఖర్చు చేసే కంపెనీలతోపాటు చిన్నపాటి కుటుంబానికి అయ్యే ఖర్చు వరకు పక్కా ప్రణాళికను అమలు చేయొచ్చు. చాయ్, బిస్కట్, కాఫీ కోసం 10, 20 వంటి చిన్న చిన్న ఖర్చులు కూడా లెక్కల్లోకి వస్తాయి.

**ఎక్కడైనా పోతే..**

నగదును ఎక్కడైనా పోగొట్టుకుంటే అంతే సంగతులు. పోలీసులు.. కేసులు.. కోర్టులు అని తిరిగినా దొరుకుతుందన్న నమ్మకం ఉండదు. అదే డెబిట్/క్రెడిట్ కార్డు పోయినా ఎలాంటి ఇబ్బంది తలెత్తదు. బ్లాక్ చేయిస్తే పైసా నష్టం వాటిల్లదు. ప్రత్యేకంగా ప్రయాణాల్లో సౌలభ్యంగా ఉంటుంది. దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు నగదును వెంట తీసుకెళ్లడం ప్రమాదకరం కూడా.. ఐరిష్, ఫింగర్ ప్రింట్లతో లావాదేవీలు నడిపే వ్యవస్థ బలోపేతమైతే మరింత ఉపయోగకరంగా ఉంటుంది.

**అవగాహన కల్పనకు ప్రభుత్వ కృషి**

దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణ ఆన్‌లైన్ లావాదేవీల వైపు అడుగులేస్తున్నది. సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో గ్రామీణ ప్రాంతంలోనూ అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందుతున్నది.

# హరిత హారానికి చిరునామా ఆ గృహం

కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని వెల్లి గ్రామంలో ఆ గృహం హరిత హారానికి చిరునామాగా, ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. ఆ గ్రామానికి వెల్లి పలానా వారి ఇల్లు ఎక్కడ అంటే కొందరే చెపుతారు. కానీ బాగా చేట్లుండే ఇల్లు ఎక్కడ అంటే అందరు చెబుతారు. అంతలా పేరు పోయింది ఆ గృహం. ధీనంతటికి కారణం ఆ ఇంటి చుట్టూ పరుచుకున్న పచ్చదనమే.

వెల్లి గ్రామానికి చెందిన కోరుకంటి బాపురావు ప్రభుత్వ ఉద్యోగం చేసి పదవి విరమణ పొందాక ఈ గ్రామంలో ఇంటిని నిర్మించుకొని ఇక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. వీరి సతీమణి అండాలు. వీరికి ఒక కూతురు, కొడుకు వున్నారు. వీరిది దొరల కుటుంబం అయిన మచ్చుకు వారిలో ఆ పోకడ కనపడదు. అందరితో కలివిడిగా, అందరిలో ఒకరుగా వుంటూ ఆ గ్రామస్తులందరి అభిమానాన్ని సంపాదించుకున్నారు.

శ్రీమతి అండాలు బాపురావు గారికి పచ్చదనమన్న,చెట్లన్న చాల ఇష్టం. ఆ ఆసక్తి తో ఇంటి ఖాళీస్తలంలో విరివిగా మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. వీరి ఇంటి పరిసరాలు పచ్చదనంతో కనువిందు చేస్తుంటాయి. పలు రకాల పూలమొక్కలు, పండ్ల మొక్కలు, కూరగాయలు, ఆకుకూరలు, నిడ నిచ్చే చెట్లు, పంటలు, శోకేజ్, ఆయుర్వేద, భక్తి సంబంధిత చెట్లు విరివిగా కనిపిస్తాయి. అండాలు గారి హారితవనంలో ఈ చెట్లు ఉన్నాయి.

**శోకేజ్ చెట్లు:**

ఈ ఇంటి పరిసరాలను పలు శోకేజ్ చెట్లతో అందంగా నందనవనంల తీర్చిదిద్దారు.

**పండ్ల చెట్లు:**

జమ, రేగు, సితాఫలం, ఉసిరి, రామఫలం, నిమ్మ, దానిమ్మ, ఖర్జూర, మునగ బొప్పాయి తదితర పండ్ల చెట్లు ఈ ఇంటి ఆవరణలో వున్నాయి.

**పూల చెట్లు:**

గులాబీ, కనకాంబరం, చామంతి, బంతి, మందార, ముద్ద గన్నేరు, పచ్చగన్నేరు, చక్ర పూలు , పారిజాతం, ఎర్రగుత్తి, కాగడమల్లె, సెంటుమల్లె, డబల్ మల్లె, సన్నమల్లె, గంటిపూలు, రుద్రాక, గుమ్మడి, పట్టుకుచ్చులు,తదితర పూల మొక్కలు ఏన్నో ఇక్కడ కనిపిస్తాయి.

**కూరగాయలు:**

చిక్కుడు, సొరకాయ, భీరకాయ, వంకాయ, దోసకాయ, గోరుచిక్కుడు, గుమ్మడికాయ, మిరప, పుల్లగంధ, కాకరకాయ, టామాట, బెండకాయ, చెమ్మ, గయిగడ్డ ఇత్యాది కూరగాయలు పండుతున్నాయి.

**ఆకు కూరలు:**

గోంగూర, బచ్చలి, పూధిన, కరివేపాకు, కొత్తిమీర, ఎల్లి పాయ, తోటకోర, గంగావాయిలు తదితర ఆకుకూరలు ఇక్కడ ఉన్నాయి.

**భక్తిఆయుర్వేదం:**

తులసీ, గణపత్రి, కలబంద, మైదాకు, కలకండ, దీష్టిపారిజాతం లాంటివి కూడా ఇక్కడ ఉన్నాయి.

**చెట్లు:**

వేప, టేకు, సుభాభుల్, 7 ఆకులు, ఆముదం తదితర నీడనిచ్చే చెట్లు పెంచుతున్నారు.

**పంటలు:**

ఇంటి చుట్టూ తనకున్న కొద్దిపాటి స్థలంలో కంది, పత్తి, మొక్కజొన్న లాంటి పంటలు కూడా పండిస్తున్నారు.

**హరిత హారంలో భాగస్వాములు :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన హరిత హారంలో అండాలు గారు భాగస్వాములు అయ్యారు. రోడ్ వెంబడి "తన ఇంటి పరిసరాలలో నాటిన 8 మొక్కలకు గుంత తీసి, కంచే నాటి, ప్రతి రోజు నీరు పోసి రక్షిస్తున్నారు. దీంతో అన్ని మొక్కలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.




ఇన్ని రకాల చెట్లను పెంచడంలో అండాలు గారి కృషి, పట్టుదల మహోన్నతమైనది. తెల్లవారుజామున లేచి, ఇంటి, వంట పనులు పూర్తి చేసిన తరువాత ఈ మొక్కలను పెంచడం, రక్షించడం లోనే ఆమె దినచర్య అంతా గడిచిపోతుంది.

ఈ ఇంటి ముందు నుండి రోడ్డు వెంట వెళ్ళే వాళ్ళు చాలామంది ఈ ఇంటి పచ్చదనం, పరిశుభ్రత చూడగానే కాసేపు ఆగి ఈ మొక్కలను పరిశీలించి పచ్చదనాన్ని ఆస్వాదించి, వీటిని పెంచడంలో విశేష కృషి చేస్తున్న అండాలు గారిని అభినందించి వెళ్తుంటారు. ఇలా వచ్చే అతిథులను సాదరంగా ఆహ్వానించి, మంచి నీరు, తేనీరు అందించి, మొక్కలన్నీ చూపించి, అడిగినవారికి కావలసిన మొక్కలు ఇచ్చి పంపిస్తారు అండాలు బాపురావు దంపతులు.

తన ఇంటిని పచ్చదనంగా మార్చడంలో భర్త బాపురావు, కొడుకు మహేందర్ రావు, కోడలు కృష్ణవేణి, కూతురు, అల్లుడు పూజిత. వేణుగోపాల్ రావు, మనవడు ఉదయ్ కిరణ్ రావు మరియు బంధు మిత్రులు, గ్రామస్తుల సహకారం, ప్రోద్బలం ఎంతో వుందని చెప్పి అండాలు గారు నేటి కాలంలో ఎందరికో ఆదర్శం. పరిసరాలన్నీ కాంక్రీటు జంగిలిలుగా మారుతున్న వేల, ఉరుకులు పరుగుల జీవితంలో చెట్టు గురించి పట్టించుకొనే తీరిక లేని నేటి తరంలో అండాలు గారు స్ఫూర్తిగా నిలుస్తున్నారు, ఇలాంటి వారికీ తగిన ప్రోత్సాహం అందిస్తే పచ్చఃనాన్ని పెంపొందించడంలో మరెంతో కృషి చేస్తారనడంలో సందేహం లేదు.

– కె.అభిలాష్, కరీంనగర్

# తెలంగాణ రాష్ట్రం నూతన పంచాయతీ రాజ్ చట్టానికి అనుగుణంగా గ్రామసభ నిర్వహణ

మన దేశములో గాని ఏ దేశములో గాని ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ప్రజల వద్ద నుండి పన్నుల రూపేన నిధులు సమకూర్చుకొంటుంది. అంటే ప్రభుత్వం ప్రజల వద్ద నుండి పన్నుల ద్వారా వసూలు చేయబడిన నిధులతోనే ప్రజల మౌళిక వసతులకు సంబంధించిన అవసరాలు తీర్చడానికి మరియు ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయడానికి ఖర్చు పెడుతుంది. సమ సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేయాలి. కాని స్వాతంత్ర్యము వచ్చినప్పటినుండి సమ సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రతి ప్రభుత్వం పనిచేయాలి. కాని స్వాతంత్ర్యము వచ్చినప్పటినుండి సమ సమాజ స్థాపన జరగక పోగా పేదరికానికి ధనిక వర్గానికి మధ్య వ్యత్యాసము పెరుగుతూ పోతున్నది. దేశ సంపద ఏ కొద్దిమంది వద్దే కేంద్రీకృతమవుతున్నది. దీనికి ప్రధాన కారణము ప్రభుత్వం పేద వర్గాల అభ్యున్నతి కొరకు ఖర్చుపెడుతున్న నిధుల గురించి పల్లె ప్రజానీకానికి ముఖ్యంగా పల్లెలో ఉంటున్న అణగారిన వర్గాల వారికి, వారి హక్కుల గురించి, ప్రభుత్వ పథకాలలో వారి అర్హత గురించి సరైన అవగాహన లేకపోవడమే ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. అందుకొరకు ప్రజలకు సాధికారత (కల్పించడానికి) సాధించడానికి భారత ప్రభుత్వము 73వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చి ప్రజలకు గల అధికారాన్ని రాజ్యాంగములోని 243ఏ అధికరణమునందు పొందు పరిచి గ్రామసభకు రాజ్యాంగ బద్ధత కల్పించింది. రాజ్యాంగ సవరణకు ముందు కూడా మన రాష్ట్ర ప్రభుత్వము గ్రామపంచాయతీలలో గ్రామసభ గురించిన చట్టం చేయడం జరిగింది కాని పంచాయతీల పాలన కొరకు గ్రామసభ అని దానిని నిర్వహించవలసిన బాధ్యత గ్రామపంచాయతీలదని ప్రజలు ఇంతకు ముందు అనుకునేవారు, ఇప్పుడు కూడా అనుకుంటున్నారు. కాని గ్రామసభలో ప్రజల బాధ్యత మరియు అధికారం ఉందని దానిలో స్థానిక ప్రభుత్వము అయిన గ్రామపంచాయతీల పనితీరును ప్రశ్నించవచ్చని, వారు కోరుకున్న విధంగా, వారికి కావలసిన పౌర సౌకర్యాలను పొందుటకు పంచాయతీని కోరవచ్చని, ఏనాడు ప్రజలు అనుకోలేదు కాబట్టి ప్రజలకున్న అధికారము వారికి తెలిసి రాలేదు. దాని ఉద్దేశము అప్పుడు ఇప్పుడు కూడా పరిపాలనతో పారదర్శకత పెంపొందించడానికి మరియు ప్రజలకు సాధికారత కల్పించడానికి ఉద్దేశించినది. కాని ప్రజలు మాత్రం గ్రామసభ అనేది పంచాయతీకి సంబంధించినదని మరియు ప్రభుత్వం వేరు ప్రజలు వేరు అని ఇంతవరకు అనుకున్నారు మరియు ఇప్పుడు కూడా చాలా మంది అదే భావనలో ఉన్నారు. రాజ్యాంగం ప్రకారము ప్రజా ప్రభుత్వములో ప్రజలే పాలకులని వారికేది కావాలో వారే నిర్ణయించుకొనే అధికారము వారికుందని చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు. ప్రజలు ఓటు ద్వారా ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం అంటే వారికి బదులుగా పరిపాలించడానికి ఇంకొకరికి అధికారము కట్టబెడుతున్నారు. ఓటు ద్వారా ఆ అధికారము పొందిన వారు, ముఖ్యంగా స్థానిక ప్రభుత్వ ప్రజాప్రతినిధిగా గెలిచి స్థానిక ప్రభుత్వ అధికార పగ్గాలు చేపట్టిన వారు తమ ఆలోచనలకు, ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నారా లేదా అని పర్యవేక్షించే బాధ్యతలను ప్రజలు మరిచిపోతున్నారు. ఆ పర్యవేక్షణకు సంబంధించిన ఏకైక అవకాశము గల వేదికే గ్రామసభ. అలాంటి గ్రామసభకు గల అధికారాలు దానికి ఎవరు ఏయే అంశాలకు ఎవరు బాధ్యులు అనే విషయాలను రాజ్యాంగ పరంగా సంక్రమించిన అధికారములు మరియు పంచాయతీరాజ్ చట్టం ద్వారా సంక్రమించిన అధికారాల గురించి ప్రజా ప్రతినిధులకు మరియు ప్రజలకు తెలియజేయాలనే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యము.

**రాజ్యాంగంలో గ్రామసభ:** భారత రాజ్యాంగములోని 243ఎ అధికరణము ప్రకారము రాష్ట్ర శాసనసభ చట్ట పరిధిలో గ్రామస్థాయిలో తగిన అధికారాలను, విధులను నిర్వహించుటకు తగిన అధికారాలను గ్రామసభకు దఖలు పర్చాలని భారత రాజ్యాంగము చెపుతోంది.

రాజ్యాంగములోని అధికరణమును అనుసరించి మన రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 సెక్షన్-6 ద్వారా తగిన అధికారాలను గ్రామసభకు కల్పించింది. దీనినే ఇంకో విధంగా చెప్పాలి అంటే గ్రామస్థాయిలోని ప్రభుత్వము పనితీరును మరియు ఆ స్థాయిలో పనిచేయు ప్రభుత్వ ఉద్యోగుల పనితీరును సమీక్షించు అధికారము ప్రజలకు ఇవ్వబడినది. గ్రామసభ అనేది గ్రామ శాసన సభ అని కూడా చెప్పవచ్చును. ఇది తెలియని ప్రజలు గ్రామసభకు హాజరు కాకుండా వారికున్న అధికారము కోల్పోతున్నారు. వారికున్న అధికారాలు ఈ క్రింద వివరించిన రాష్ట్ర ప్రభుత్వము ఉత్తర్వుల ద్వారాజారీ చేయబడిన వాటిలో వారికున్న అధికారములను వివరించింది.

1. జి.ఓ.యం.ఎస్.నెం.267(పం.రా & ఆర్.డి), తేదీ:28-08-1998 (ఇంకా కొత్త ఉత్తర్వులు జారి కాబడలేదు)
2. జి.ఓ.యం.ఎస్.నెం.66 (పం.రా & ఆర్.డి), తేదీ:24-03-2011 (షె.ప్రాంతాలు) (ఇంకా కొత్త ఉత్తర్వులు జారి కాబడలేదు)
3. యం.ఎస్.నెం.791 (జి.ఎ.డి), తేదీ:07-11-2013.(ఇంకా కొత్త ఉత్తర్వులు జారి కాబడలేదు)

తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 6 ప్రకారం, గ్రామపంచాయతీ ఓటరు జాబితాలో పేరు ఉన్న వారందరితో కూడిన సభనే "గ్రామసభ" అని అంటారు. అదే షెడ్యూల్డ్ ప్రాంతములో (రూల్ 4(1)) ప్రకారము గ్రామములోని ఓటర్లందరితో కూడిన దానిని గ్రామసభ అని అంటారు. అనగా షెడ్యూల్డ్ ప్రాంత పంచాయతీలలో గల గ్రామాలను గ్రామసభ కొరకు ప్రభుత్వముచే గ్రామాలుగా ప్రకటించిన వాటిలో ప్రతి గ్రామానికి ఒక గ్రామసభ ఉంటుంది. అంటే ప్రతి గ్రామానికి చెందిన ఓటరు జాబితాలో ఉన్న వారందరు ఆ

గ్రామానికి గల గ్రామసభకు సభ్యులుగా ఉంటారు. అంటే షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న గ్రామపంచాయతీలలో ఒకటి కంటే ఎక్కువ గ్రామసభలు ఉండే అవకాశము కలదు.

పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షను 6(3) గ్రామసభకు ప్రతిపాదించు అధికారము మైదాన ప్రాంత పంచాయతీలలోని గ్రామసభకు కలదు. అంటే గ్రామపంచాయతీలలో ఏదేని కార్యక్రమమును గాని పనిని గాని చేపట్టుటకు ప్రతిపాదించు అధికారము ప్రతి పౌరునికి కలదు.

షెడ్యూల్డ్ ప్రాంతాలలోని పంచాయతీలలో గ్రామసభకు నియమము 4(XII) ఆమోదించు అధికారం కలదు. అంటే ఒకవిధంగా చెప్పాలంటే షెడ్యూల్డ్ ప్రాంతాలలోని గ్రామసభను ఆ గ్రామానికి సంబంధించిన గ్రామ శాసనసభ అని అనుటలో అతిశయోక్తి ఏమాత్రమే లేదు. అలాగే షెడ్యూల్డ్ ప్రాంతాలలోని గ్రామసభకు రూల్ 4 (XIV) ప్రకారం నిధుల వినియోగ ధృవీకరణ పత్రం జారీ చేయు అధికారము కూడా కలదు.

మరి ఇంతటి మహత్తరమైన అధికారాలు గల గ్రామసభను ఎప్పుడు నిర్వహించాలి అనే ప్రశ్నకు సమాధానంగా:

గ్రామపంచాయతీగా ఏర్పడిన పది రోజులలోగా గ్రామసభ సమావేశమును ఏర్పాటు చేయాలి మరియు ఆ తరువాతి ప్రతి రెండు నెలలకు ఒకసారి విధిగా గ్రామపంచాయతీ నిర్ణయించిన ప్రదేశంలో మరియు సమయంలో గ్రామసభ సమావేశము ఏర్పాటు చేయాలి.

- సర్పంచ్ లేదా సర్పంచు లేకపోయినా, ఉప-సర్పంచ్ గ్రామసభ యొక్క సమావేశాలను ఏర్పాటు చేయాలి.
- గ్రామసభ సమావేశాలకు, గ్రామపంచాయతీ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్ మరియు రాష్ట్ర శాసనసభ సభ్యులను ఆహ్వానించాలి.
- ప్రతి గ్రామసభ సమావేశమునకు సర్పంచ్ గారు లేదా సర్పంచు లేకపోయిన యెడల ఉపసర్పంచుగారు లేదా వారిద్దరూ లేకపోయినా గ్రామపంచాయతీ సభ్యుల్లో ఒకరు, సభ్యులచే నిర్ణయించబడిన వారు గ్రామసభకు అధ్యక్షత వహించుతారు.
- గ్రామసభలో సమీక్షించవలసిన అంశాలు:
    - గ్రామపంచాయతీకి సబంధించిన అభివృద్ధి కార్యక్రమాల నివేదికను, ప్రస్తుత కాలంలో చేపట్టిన ప్రతిపాదనలు, గ్రామపంచాయతీ యొక్క ఆదాయ, వ్యయాల వార్షిక నివేదిక
    - ఆడిట్ రిపోర్ట్ మరియు ముందటి సంవత్సరం పరిపాలన నివేదిక
    - గ్రామసభ యొక్క ఏదైనా నిర్ణయం అమలు చేయలేకపోతే, గ్రామసభ ముందు, సర్పంచ్ దానికి గల కారణాలను నివేదించాలి.
- సంవత్సరానికి ఆరు గ్రామసభలను నిర్వహించాలి. అందులో కనీసం రెండు గ్రామసభలు మహిళలపై, వయోజనులు (వృద్ధులు) మరియు వెనుకబడిన వర్గాలపై దృష్టి పెట్టాలి.
- గ్రామపంచాయతీ ఆమోదంతో పంచాయతీ కార్యదర్శి సబ్ సెక్షన్ (8)లో పేర్కొన్న విధంగా సభ్యులందరకు, గ్రామసభ కోసం సిద్ధం చేసిన ఎజండా అందరికి తెలియజేయాలి.
- క్రింది విషయాలను కూడా గ్రామసభ సమీక్షించవచ్చు:
- పారిశుద్ధ్యము: ఘన మరియు ద్రవ వ్యర్థ నిర్వహణలో చెత్తను కంపోస్టుగా మార్చడం ద్వారా చెత్తను సురక్షితంగా పారవేయడం
- బహిరంగ మలవిసర్జన (ఓ.డి.ఎఫ్) లేనిగ్రామం గా చేయడం కోసం ప్రయత్నం
- వీధిలైట్ల నిర్వహణ : విధ్యుత్తు ఆదా చేయుటకు కావలసిన ఎల్.ఇ.డి బల్బులను వాడుట
- గ్రామపంచాయతీలో వివిధ పథకాల క్రింద చెట్ల పెంపకం మరియు వాటి నిర్వహణ
- కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, బాల కార్మిక నిర్మూలన, బంధిత బానిస కార్మికులు, సామాజిక దుష్ప్రభావాలు మొదలైన వాటిపై అవగాహన కల్పించడం.
- అంతర్గత రహదారుల నిర్వహణ, కల్వర్టులు మరియు కాలువలు నిర్మాణం, నిర్వహణ
- సామాజిక ఆస్తుల నిర్వహణ: సాధారణ స్థలాలు, ప్రామాణిక స్థలాలు, భవనాలు, కమ్యూనిటీ హాల్స్, పార్కులు మొదలైనవి
- సాంస్కృతిక కార్యక్రమాలు ప్రోత్సహించడం : ఉత్సవాలు మరియు పండుగలు, క్రీడలు మరియు ఆటలు
- పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడానికి అవసరమైన వివరాల సేకరణ మరియు సంకలనం
- గ్రామ పంచాయతీలో అమలు చేయడానికి పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాల ప్రాధాన్యతలను ప్రతిపాదనలు రూపొందించడం
- నిర్ణయించిన ప్రమాణాల ఆధారంగా అన్ని లబ్ధిదారుల – ఆధారిత పథకాలకు సంబంధించిన ప్రాధాన్యత క్రమంలో అర్హత పొందిన లబ్ధిదారుల తుది జాబితాను తయారు చేయడం
- స్థానికంగా అవసరమైన సౌకర్యాలను అందించడం ద్వారా సమర్థవంతంగా అభివృద్ధి పథకాలను అమలు చేయడానికి సహాయం అందించడం
- స్వచ్ఛంద సేవా, శ్రమదానం మరియు అభివృద్ధి ప్రణాళికలకు నగదు లేదా ఏ రకమైన సహకారం సమీకరించడం
- వీధి లైట్లు, ప్రజా కుళాయిలు, ప్రామాణిక బావులు, ప్రజా పారిశుద్ధ్య విభాగాలను గుర్తించడం, ఇతర ప్రజా ప్రయోజన పథకాలు
- పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ వంటి ప్రజా ప్రయోజనాలపై అవగాహన కల్పించడానికి, ఆరోగ్యం మరియు పరిశుభ్రతపై అవగాహన కల్పించడానికి పథకాలు రూపొందించడం.
- గ్రామపంచాయతీలోని ప్రజలలో మత సామరస్యాన్ని, ఐక్యతను ప్రోత్సహించుట

- గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి కార్యకలాపాలలో వినియోగించిన లబ్ధిదారులకు పర్యవేక్షణ అందించడం
- పెన్షన్లు వంటి ప్రభుత్వం నుండి వివిధ రకాల సంక్షేమ సాయం పొందడం కోసం వ్యక్తులను నిర్ధారించడం
- గ్రామపంచాయతీలో అమలు చేయడానికి ప్రతిపాదించిన పనుల యొక్క వివరాల గురించి సమాచారాన్ని సమీక్షించుట
- గ్రామసభ యొక్క నిర్ణయాలు వాటిపై తీసుకున్న చర్యలను మరియు ఏ నిర్ణయాలు అమలు చేయకుండా వదిలేసారో వాటిపై వివరణాత్మక కారణాలు
- ప్రస్తుత పన్నుల వివరాలు, తాజాగా కొత్త పన్నులు వేయుట లేదా ఉన్న వాటిని పెంచుటకు సంబంధించి గ్రామపంచాయతీ ప్రతిపాదలనపై సమీక్ష జరుపుట.
- వయోజజన విద్య ప్రోత్సాహం.
- సామాజిక ఆస్తుల పరిరక్షణ మరియు నిర్వహణ
- స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు ప్రోత్సహించడం
- పై సూచించినవే కాకుండా, ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇతర విధులు సూచించవచ్చు.
- గ్రామపంచాయతీ బడ్జెట్ నిబంధనలు, నిధుల కేటాయింపు వివరాలు, అంశం వారీగా అంచనా వేసిన బడ్జెట్ వివరాలు, ఖర్చులు

అలాగే షెడ్యూల్డ్ ప్రాంతాలలోని గ్రామసభలో పై తెలిపిన అంశాలకు అదనముగా క్రింద తెలపిన అంశములపై సమీక్ష జరుపుటకు కూడా షెడ్యూల్డ్ ప్రాంతాలలోని ప్రజలకు అధికారము కలదు.

- భూమి కల వారి జాబితా తయారుచేయుట రూల్ 8(iii) 1(a)
- జాబితాలోని వారి సామాజిక స్థితిని పరిశీలించుట 8(iii) 1(B)
- భూమి స్వంతదారులను మరియు అనుభవదారులను గుర్తించుట రూల్ 8(iii) 1(B)
- వాస్తవాలు తెలుసుకొనుటకు క్షేత్రస్థాయిలో పరిశీలన రూల్ 8(iii) 1(c)
- భూమి కేటాయించుటకు లబ్ధిదారుల జాబితా ఆమోదము రూల్ 8(iii) 1(e)
- షెడ్యూలు జాతుల వారి పేరుతో ఎవరైనా భూములను అనుభవించుచున్నట్లయితే షెడ్యూల్ జాతుల వారికి భూమిని ఇప్పించుట రూల్ 8(iii) 1(F)

♦ గ్రామసభ సమావేశాలకు కోరం క్రింది విధంగా ఉంటుంది.
- 500 మంది ఓటర్ల వరకు– 50 సభ్యులు
- 501 నుండి 1000 ఓటర్ల వరకు – 75 సభ్యులు
- 1001 నుండి 3000 ఓటర్ల వరకు–150 సభ్యులు
- 3001 నుండి 5000 ఓటర్ల వరకు–200 సభ్యులు
- 5001నుండి10,000 ఓటర్ల వరకు–300 సభ్యులు
- 10000 అంతకు మించి ఓటర్లకు – 400 సభ్యులు

♦ ఒక గ్రామసభ సమావేశం నిర్ణయం చేసిన సమయమునకు ఒక గంట లోపల కోరం లేనిచో సమావేశము వాయిదా వేయబడాలి. వాయిదా వేసిన సమావేశంను రెండు గంటల తరువాత ఎప్పుడైనా సమావేశం జరుపవచ్చును మరియు అలా వాయిదా వేసిన సమావేశం కొరకు కోరం అవసరం లేకుండానే గ్రామసభ సమావేశం జరుపుకోవచ్చును.

♦ ప్రతి గ్రామసభలో జరిగిన చర్చలను వీడియో రికార్డు చేయాలి.

♦ గ్రామసభ సమావేశాలలో ఏ సమస్యకు సంబంధించిన తీర్మాణాలను చేతుల ఎత్తుట ద్వారా మెజారిటీ ఆధారంగా తీర్మాణాలు జారీ చేయబడాలి, ఏది ఏమైనప్పటికీ సాధ్యమైనంతవరకు సాధారణ ఏకాభిప్రాయం ఆధారంగా నిర్ణయం తీసుకోవడానికి ప్రయత్నం చేయాలి.

♦ పై సూచించిన విధంగా గ్రామసభ సమావేశాలలో నియమావళిని పాటించాలి

♦ గ్రామపంచాయతీ స్థాయి ఉద్యోగులు గ్రామసభకు తప్పక హాజరు కావాలి మరియు ఎవరైనా గైరుహాజరు అయినచో లేక గ్రామసభ తీర్మాణములను అమలు చేయని ఉద్యోగిపై క్రమశిక్షణా చర్యల కోసం గ్రామసభ తీర్మాణాలు చేయవచ్చును.

♦ గ్రామసభకు ఈ క్రింద వివరించిన గ్రామస్థాయి ఉద్యోగులు తప్పక హాజరు కావలసి ఉంటుంది.

- సాక్షర భారత్ కోఆర్డినేటర్
- వ్యవసాయ విస్తరణాధికారి
- అంగన్‌వాడీ కార్యకర్త
- ఆరోగ్యశాఖ ఆశా కార్యకర్త
- విద్యుత్ శాఖ సహాయకులు లేక లైన్‌మెన్
- జాతీయ ఉపాధి హామి క్షేత్రసహాయకులు
- మత్స్యశాఖ సహాయకులు / పరిశీలనాధికారి
- అటవీశాఖ బీట్ అధికారి
- చౌకధరల దుకాణ డీలరు
- స్వయం సహాయక సంఘాల వారు మరియు బుక్ కీపరు
- పశుగణాభివృద్ధి శాఖ సహాయకులు
- గ్రామీణ నీటిసరఫరా శాఖ లేక స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్
- ప్రధానోపాధ్యాయులు
- గ్రామ రెవిన్యూ అధికారి
- గిరిజన సొసైటీ సహాయకులు
- వర్క్ ఇన్‌స్పెక్టరు ఏయే తేదీన జరిగే గ్రామసభలో ప్రజలు సమీక్ష చేయుటకు వీలుగా గ్రామస్థాయి లేక క్షేత్రస్థాయి ఉద్యోగులు ఏమి చేయాలి?

- గ్రామసభ తేదీకి 7 రోజులు ముందు సంబంధిత శాఖల నివేదికలు పంచాయతీలకు అందజేయాలి.
- మొదటి గ్రామసభలో గత ఆర్థిక సంవత్సరములో అమలు చేయబడిన కార్యక్రమాలు, వాటి భౌతిక, ఆర్థిక ప్రగతి వేదికలు, సామాజిక తనికి నివేదిక, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రణాళిక
- రెండవ గ్రామసభలో గుర్తించిన లబ్దిదారుల, చేపట్టిన పనులపై భౌతిక, ఆర్థిక ప్రగతి నివేదికలు.
- మూడవ సభలో ప్రగతి నివేదికలు, నేరుగా ప్రయోజన బదిలి ద్వార అందిన సేవల నివేదిక, నియమాల మార్పువంటి వాటిని జనవరి 2న నాల్గవ సభలో చేపట్టిన కార్యక్రమాల సమగ్ర పనితీరు దాని ప్రభావాలు, నిర్వహించిన ఏదేని మదింపు.
- మిగతా రెండు గ్రామసభలలో మహిళల, వయోవృద్ధుల మరియు అణగారిన,అనాధల సమస్యల పరిష్కారముపై దృష్టి పెట్టాలి.

**గ్రామసభకు బాధ్యత వహించే అధికారులు అంశాలు మరియు వారు గ్రామసభలో సమీక్షకు సమర్పించవలసిన వివరాలు:**

- వ్యవసాయ విస్తరణ అధికారి / ఆదర్శ రైతు
- డీలరు విత్తనాలు తీసుకున్నవి, సరఫరా చేసినవి, విత్తనాల లభ్యత
- గ్రామ వ్యవసాయ ప్రణాళిక, పంటల రకాలు, సాగు చేయు విస్తీర్ణం
- వ్యవసాయ పాఠశాల ఏర్పాటు చేసిన వివరాలు
- అధిక దిగుబడి రకాల విత్తనాల లభ్యత
- నూతన ఆవిష్కరణలు
- పంట తెగులు నివారణ చర్యలు
- సబ్సిడి వివరాలు
- వ్యవసాయ సాంకేతిక పరికరాల లభ్యత
- సర్వే నెంబర్ల వారిగా పంటనష్టం వివరాలు
- ఎరువుల ఆవశ్యకత, సరఫరా వివరాలు
- నకిలీ విత్తనాల సరఫరా తనిఖీ వివరాలు
- భూసార పరీక్ష వివరాలు

◆ **క్షేత సహాయకులు (ఉ.హా.ప):**

- అనుమతించిన పనులు, వాటి ప్రగతి, వేతన చెల్లింపులు
- నూతనముగా గుర్తించిన పనుల వివరములు
- జాబుకార్డు వివరములు
- కుటుంబాల వారిగా వేతన చెల్లింపులు
- పని కల్పించబడిన వేతన దినములు
- స్వచ్ఛభారత్ కార్యక్రమ వివరములు
- పథకము యొక్క నూతన నియమాలు

◆ **గ్రామ రెవిన్యూ అధికారి:**

- పట్టాదారు వివరాలు, జమాబంది, అజమాయిషి
- భూమి లేని పేదలకు స్థలాల పంపిణీ వివరాలు, అర్హుల జాబితా
- ఇళ్ల స్థలాల పంపిణీ వివరాలు, అర్హుల జాబితా
- భూమి రికార్డుల కొరకు వచ్చిన దరఖాస్తులు వాటి ప్రగతి
- బ్యాంకుల నుండి పంట రుణాల పంపిణీ వివరాలు
- సామాజిక భూముల లభ్యత వాటి వినియోగ వివరాలు
- రేషనుకార్డుల రిజిష్టరు చదివి వినిపించుట
- గ్రామ ఆహార సలహా సంఘం సూచనల అమలు నివేదిక
- పంటల నష్టపరిహారము చెల్లింపు వివరాలు

◆ **క్షేత్ర సహాయకులు/సాంకేతిక సహాయకులు (పి. యం.కె.ఎస్.వై):**

- పనుల ప్రగతి, వేతన చెల్లింపులు
- గుర్తించిన నూతన పనుల వివరాలు
- అమలులో ఉన్న ప్రభుత్వ నియమాలలో మార్పులు
- చిన్నతరహా నీటి వనరుల, సాగు విస్తీర్ణ, మత్తడి, చెఱువుకట్ట స్థితి వివరాలు

◆ **పశుసంవర్ధక శాఖ అధికారి / గోపాల మిత్ర:**

- పశు సంపత్తి స్థితి వివరాలు
- మందుల లభ్యత వివరాలు
- చికిత్స చేయబడిన, రోగ నిరోధక మందులు వేయబడిన పశువుల, మేకల, గొఱ్ఱెల, కోళ్ల వివరాలు

◆ **మత్స్యశాఖ తనిఖీ అధికారి:**

- మత్స్యకారులకు ఇచ్చిన లైసెన్సు వివరాలు
- అభివృద్ధి కార్యక్రమాలలో గుర్తించబడిన మత్స్యకారుల, లబ్ధి, ప్రగతి వివరాలు
- చేపపిల్లల పంపిణీ వివరాలు
- వివిధ నీటి వనరులలో చేపల హక్కుల కొరకు నిర్ణయించబడిన మద్దతు ధర వివరాలు
- మత్స్య కార్మికుల సహకార సంఘాల పనితీరు ప్రగతి నివేదిక

◆ **అటవీ కాపలా అధికారి:**

- వన రక్షణ సమితి పని తీరు వాటిచే చేయబడిన పనుల ప్రగతి నివేదిక
- సామాజిక అటవీ పెంపకమునకు పనికి వచ్చు భూ వివరాలు, మొక్కల పెంపకంలో ప్రగతి నివేదిక
- గ్రామీణ నర్సరీలో మొక్కల లభ్యత వివరాలు
- అటవీ హక్కుల క్రింద గుర్తించిన భూమి దాని పంపిణీ వివరాలు

◆ **గ్రామీణ గిరిజనాభివృద్ధి సంఘం / జి.సి.సి:**

- చిన్నతరహా అటవీ ఉత్పత్తుల సేకరణ ధర, చెల్లింపుల వివరాలు
- గ్రామసభకు బాధ్యత వహించే అధికారులు అంశాలు

◆ **గృహ నిర్మాణ వర్క్ ఇన్స్పెక్టరు:**

- మంజూరీ చేయబడిన, ప్రారంభించిన, గృహాల వివరాలు
- చెల్లింపుల వివరాలు
- అర్హులైన ఇల్లు లేని పేదల వివరాలు
- తాపీ మేస్త్రీల శిక్షణ

◆ **నీటి సరఫరా వర్క్ ఇన్స్పెక్టరు /పంపు ఆపరేటర్/o.SBA.CO**

- రక్షిత నీటి సరఫరా వనరుల స్థితి
- పరీక్షల కొరకు సేకరించిన నీటి నమూనాల సంఖ్య
- మరుగుదొడ్ల మంజూరీ, నిర్మాణ ప్రగతి పూర్తి అయిన వాటి

నివేదిక

• త్రాగు నీటి వనరుల శుభ్రము చేసిన తేదీల వివరము

- **పంచాయతీ కార్యదర్శి:**

• గ్రామపంచాయతీ సాంవత్సరిక లెక్కలు, ఆడిట్ రిపోర్టు

• గత సంవత్సరము పంచాయతీ పరిపాలన నివేదిక

• అభివృద్ధి పనులు మరియు క్రొత్తగా ప్రతిపాదించేవి

• పంచాయతీలో ప్రస్తుత పన్నులను పెంచుట గురించి మరియు క్రొత్తగా వేయవలసిన పన్నుల వివరములు

• ఆస్తుల యాజమాన్య హక్కులు బదలాయించబడిన వారి వివరాలు

• ఆమోదించబడిన పంచాయతీ బడ్జెట్, పంచాయతీకి పన్ను బకాయిదారుల జాబితా

• చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు జారీచేసిన లైసెన్సులు వాటి పనితీరు

• ఖాదీ బోర్డు ద్వారా మంజూరైన వాటి వివరములు

• గోబర్‌గ్యాస్ పథకములు వివరములు

• గ్రామసభకు బాధ్యత వహించే అధికారులు అంశాలు

• పొగలేని పొయ్యిల మంజూరీ వివరములు

• సౌరశక్తి దీపముల మంజూరీ వాటి పనితీరు

• సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరములు

• గ్రామస్థాయి గ్రంథాలయాల నివేదిక

• సామాజిక పెన్షన్‌దారుల వివరములు

• సామాజిన పెన్షన్లకు అర్హులైన వారి వివరములు

• అభివృద్ధి పథకాల అవగాహన కొరకు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు

• పంచాయతీ మార్కెట్లలో చేయబడిన వసతుల వివరములు

• సామాజిక భూములు మరియు భవనాల పరిస్థితి

• వేలముల వివరములు

- **స్వయం సహాయక సంఘాలు బాధ్యులు మరియు సి.సి.లు లేక బుక్కు కీపరులు:**

• సంఘాల పనితీరు

• దీపము పథకము అమలు తీరు

• బంగారుతల్లి ప్రగతి

• ఆమ్ ఆద్మీ భీమా యోజన

• ఇందిరా జీవిత భీమా యోజన

• పౌష్టికాహార, మధ్యాహ్న భోజన పథకము అమలు

• వృత్తి విద్యా శిక్షణ తరగతుల అమలు (EGMM / RYK)

- **పంచాయతీరాజ్ వర్క్ ఇన్స్పెక్టరు:**

• గ్రామీణ రోడ్లు, అంతర్గత రోడ్లు మంజూరీ, పని స్థితి, పూరైన నివేదిక

• రోడ్లు, భవనాల శాఖ వర్క్ ఇన్స్పెక్టరు

• లింకు రోడ్లు, రోడ్లు మంజూరీ, పని స్థితి, పూరైన నివేదిక

- **పాఠశాల ప్రధానోపాధ్యాయులు:**

• పాఠశాలలో చేరిన విద్యార్థుల వివరములు

• పాఠశాల మానేసిన పిల్లల వివరములు

• విద్యార్థుల అభ్యాస స్థాయిల నివేదిక

• పదవ తరగతి ఉత్తీర్ణత నివేదిక

• మధ్యాహ్న భోజన స్థితి నివేదిక

• సాక్షర భారత్ కో-ఆర్డినేటర్

• వయోజన విద్యా కేంద్రాల పనితీరు

- **బహుళార్థ ఆరోగ్య సహాయకులు:**

• ఉపకేంద్రాల పనితీరు

• జాతీయ ఆరోగ్య మిషన్ నిధుల వినియోగం

• గ్రామ సందర్శన వివరాలు

• ఆరోగ్య సందర్శన వివరాలు

• అతిసార వ్యాధుల వివరములు

- **ఆరోగ్య కార్యకర్త / ఆశా కార్యకర్త (ANM /ASHA):**

• కుటుంబ నియంత్రణకు అర్హత గల దంపతుల సంఖ్య

• తాత్కాలిక నియంత్రణ పాటిస్తున్న దంపతుల సంఖ్య

• సంస్థాగత ప్రసవాల సంఖ్య

• రోగనిరోధక టీకాల ప్రగతి

• మాతా శిశు మరణాల స్థితి

• గర్భిణీ స్త్రీల & పాలిచ్చు తల్లుల ఆరోగ్య సంరక్షణ చర్యల నివేదిక

• జననీ సురక్ష యోజన / మాతృత్వ సహయోగ్

• ఎయిడ్స్ రోగుల చికిత్స వివరములు

• దీర్ఘకాల రుగ్మతల వివరాలు

- **అంగన్‌వాడి కార్యకర్త:**

• అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు

• 0 సం॥ నుండి 6 సం॥ల వయసు గల పిల్లల నమోదు వివరాలు

• గర్భిణీ స్త్రీల నమోదు వివరాలు

• పోషకాహార పదార్థాల సరఫరా, పంపిణీ, నిలువ వివరములు

• ఆరోగ్య లక్ష్మి మరియు బాలామృతం పథకాల ప్రగతి నివేదిక

• పోషకాహార లోపము గల పిల్లల వివరాలు

- **చౌకధరల దుకాణ దారు:**

• చౌక వస్తువుల సరఫరా

• అమ్మహస్తం ప్రగతి

- **లష్కరు/వాచరు (నీరటి):**

• గట్టు పరిరక్షణ కొరకు మొక్కల పెంపకం

• కాలువల ద్వారా నీటి విడుదల

- **వనరక్షణ సమితి:**

• రక్షించబడిన అటవీ విస్తీర్ణం, దాని ద్వారా లబ్ధి పొందిన కుటుంబాల సంఖ్య

– ఎస్.శంకరయ్య
టిఎస్ఐఆర్‌డి

# బౌద్ధం బాదన్‌కుర్తి



- బుద్ధుని శిష్యుల ఆవాసం ఇదే..
- బుద్ధుడిని కలసిన 16 మంది యువకులు ఇక్కడివారే
- ఆయన ఆదేశంతో ఇక్కడ్నుంచే బౌద్ధ ప్రచారానికి శ్రీకారం
- నిర్మల్ జిల్లా బాదన్‌కుర్తిలో వెలుగుచూసిన తొలి తరం బౌద్ధ నిర్మాణాలు

బుద్ధుడు సజీవంగా ఉండగానే బౌద్ధ ప్రచారానికి నడుంబిగించిన బృందం తెలంగాణ ప్రాంతానికి సంబంధించిందే అన్న విషయం ఎందరికి తెలుసు ఇప్పటి వరకు చరిత్రపుటల్లోనే నిక్షిప్తమైన ఆ అంశానికి సంబంధించి తిరుగులేని ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. నేరుగా బుద్ధుడిని కలిసి ఆయన ఆదేశంతో బౌద్ధ ప్రచారాన్ని ప్రారంభించిన తొలి బృందం ప్రస్తుత నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని బాదన్‌కుర్తి ప్రాంతానికి చెందినదే! ఈ విషయం బౌద్ధ గ్రంథం సుత్తనిపాతంలోని పారాయణ వగ్గలో ఉంది. కానీ సాక్ష్యాలు లేకపోవడంతో ఇదంతా వట్టి ప్రచారమే అన్న వాదన కొనసాగింది.

కానీ అది నిజమని చాటే ఆధారాల జాడ ఇప్పుడు దొరికింది. సుదీర్ఘ ప్రయత్నం తర్వాత దాని జాడ వెలుగుచూసింది. వెరసి రెండున్నర వేల ఏళ్ల నాటి అత్యంత కీలక చారిత్రక సాక్ష్యం ప్రపంచానికి చాటిచెప్పే అవకాశం తెలంగాణకు దక్కింది. తెలంగాణ వేదికగా బౌద్ధ చరిత్రకు ఇది కీలక పరిణామంగా భావిస్తున్నారు.

**ఆ ప్రస్తావన ఇక్కడిదే..:** బౌద్ధ సాహిత్యంలో గోదావరి నదీ ప్రస్తావన.. బాదన్‌కుర్తి గ్రామానికి సంబంధించిందే అయి ఉంటుందని చరిత్రకారులు చాలాకాలం క్రితమే పేర్కొన్నారు. 'మహాజనపథ రాజ్యం అస్మక పాలన కాలం.. గోదావరి నది రెండుగా చీలిన ప్రాంతంలోని ఆవాసానికి చెందిన బావరి ఆధ్వర్యంలో 15 మంది యువకులు బుద్ధుని కలసి ఆయన బోధనలకు ప్రభావితులయ్యారు. వారు ఆయన బోధనలను విశ్వవ్యాప్తం చేసేందుకు బయలుదేరారు' అని సుత్తనిపాతం పారాయణవగ్గలో బుద్ధునికాలంలోనే లిఖించి ఉంది. అస్మక పాలన పరిధి తెలంగాణలోనే ఉంది. ఇక్కడ గోదావరి రెండుగా చీలిన ప్రాంతం ఇక్కడే కనిపిస్తుంది. అదే బాదన్‌కుర్తి గ్రామం ఉన్న చోటు. అది నదీ ద్వీపంగా భావిస్తారు.

గోదావరి రెండుగా చీలగా మధ్యలో ఏర్పడ్డ భూభాగంలో ఉన్న ఒకేఒక్క జనావాసం ఈ గ్రామం. బావరి పేరుతోనే ఈ ప్రాంతానికి బాదన్‌కుర్తిగా పేరు వచ్చిందని పేర్కొన్నారు. కానీ ఆ గ్రామంలో ఇప్పటి వరకు ఎక్కడా బౌద్ధ సంస్కృతిని చాటే ఒక్క నిర్మాణం జాడ వెలుగు చూడలేదు. దీంతో ఆ వాదనలో సత్యం లేదనే వాదన మొదలైంది. కానీ ఇప్పుడు బౌద్ధ స్థూపానికి చెందినదిగా భావిస్తున్న నిర్మాణాల జాడను గుర్తించారు. ఇవి బౌద్ధానికి చెందిన తొలి నిర్మాణాలుగా భావిస్తున్నారు. ఈ ప్రాంతం నుంచే బౌద్ధమత ప్రచారం మొదలై ఇతర దేశాలకూ విస్తరించిందని అంచనా వేస్తున్నారు. బావరి బృందంతోపాటు అప్పట్లో బయలుదేరిన మరికొన్ని బృందాలే ప్రపంచానికి బౌద్ధాన్ని పరిచయం చేశాయి.

**వెలుగుచూసిన పురాతన ఇటుకల వరుస**

తెలంగాణలో బౌద్ధానికి చెందిన జాడలు చాలా వెలుగుచూశాయి. వాటి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బుద్ధవనం ప్రాజెక్టు అధికారులే తాజాగా బావన్‌కుర్తిలో నిర్మాణాల జాడ కనిపెట్టారు. స్థానిక దత్తాత్రేయ దేవాలయం వెనకవైపు గోదావరి తీరం చేరువలో పురాతన ఇటుకల వరుస బయటపడింది. రెండడుగుల పొడవున్న ఆ ఇటుకలను వెలికితీసి పరిశీలించగా అవి బౌద్ధ స్థూప నిర్మాణాల్లో వాడేవని రూఢి అయింది. దీంతో అక్కడే బౌద్ధ స్తూపంతో పాటు ఇతర నిర్మాణాలు ఉండిఉంటాయని భావిస్తున్నారు. ఆ ప్రాంతంలో తవ్వకాలు జరిపి విలువైన ఆ నిర్మాణాలను వెలుగులోకి తేవాలని కేంద్రానికి లేఖ రాయాలని బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య నిర్ణయించారు.

**బౌద్ధ చరిత్రలో ఇది కీలక పరిణామం**

బావన్‌కుర్తి ప్రస్తావన బౌద్ధ సాహిత్యంలో ఉన్నా.. దాన్ని రూఢి చేసే ఆధా రాలు లేకపోవటం ఇంతకాలం వెలితి. ఇప్పుడు వాటి జాడ దొరకటం బౌద్ధ చరిత్రలో కీలక పరిణామం. బుద్ధుడిని స్వయంగా కలిసి ఆయన బోధనలను విశ్వవ్యాప్తం చేసేందుకు బయలుదేరిన బృందం తెలంగాణకు చెందినది కావటం విశేషం. త్వరలో చేపట్టబోయే బుద్ధిస్ట్ సర్క్యూట్ ప్రాజెక్టుకు ఇది కీలకం కానుంది. ఆ ప్రాంతంలో తవ్వకాలు జరిపి భూగర్భంలో నిక్షిప్తమైన బుద్ధుడి కాలంనాటి అపురూప కట్టడాలను ప్రపంచం ముందు నిలపాల్సి ఉంది.

**– మల్లేపల్లి లక్ష్మయ్య,**
**బుద్ధవనం ప్రత్యేకాధికారి**

# బోనమెత్తిన తెలంగాణ

తెలంగాణలో సంస్కృతి సాంప్రదాయాలను అద్దం పట్టె ఆశాఢం జాతర. మన తెలంగాణకే ప్రత్యేకమైన బోనాల జాతర అంగరంగ వైభవంగా ప్రారంభం అయింది. తొలి బోనం గోల్కొండ జగదాంభిక అమ్మవారికి బోనం సమర్పించడంతో బోనాల పండుగ ఆరంభం అయింది.



పంటలను, పశువులను, చెరువులను కాపాడమని, తమను తమ పిల్లలకు అంటు రోగాలు ప్రబలకుండా, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆడపడుచులు జరుపుకునే పండుగే బోనాల పండుగ ఆషాఢమాసంకు ఎంతో విశిష్టత ఉంది. ఆషాడ మాసం అంటే అమ్మవారికి ఎంతో ఇష్టం అని ఈ మాసంలోనే అమ్మవారు తమ పుట్టింటికి వెలుతుందని భక్తుల నమ్మకం అందుకే ఆడపడుచులను తమ పుట్టింటికి తీసుకువచ్చి బోనాలు జరుపుకుంటారు. తమ కూతురు రూపంలో అమ్మవారు తమ ఇంటికి వచ్చిందనీ భావనతో, భక్తి శ్రద్దలతో, ప్రేమానురాగాలతో కుల, మతాలకు అతీతంగా ఎంతో ఆప్యాయంగా ఆత్మీయంగా అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు.

**భోనం - విశిష్టత**

భోనం అంటే భోజనం, అన్నం పరమాన్నం, అని అర్థంలో వాడుతారు. ఈ అన్నం ను నైవేధ్యంగా గ్రామ దేవతలైన "రేణుక ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, పెద్దమ్మ, మహంకాళీ, పోలేరమ్మలకు సమర్పించుకునే అన్నంనే భోనం అంటారు. కుమ్మరి ఇంటి నుండి కొత్త కుండను తీసుకువచ్చి దాని అడుగు భాగాన, మూతికి సున్నం రాసి మధ్యలో పసుపు, కుంకుమలతో బొట్లు పెట్టి అందంగా భోనం కుండను అలంకరిస్తారు. భోనం కుండపై ఒక చిన్న గరిక ఉంచి దానిపై ప్రమిదలు వెలిగించి చుట్టూ వేపాకు రెమ్మలతో అందమైన పూలతో భోనం కుండను అలంకరిస్తారు. ఈ విధంగా ముస్తాబైన భోనం కుండను ఇంటి ఆడపడుచు తలపైకి ఎత్తి ఆడపడుచు కాళ్ళకు నీటి సాక పోసి నమస్కరించి డప్పు చప్పుల్లతో, డోలు దెబ్బలతో భోనం ను అమ్మవారి గుడికి సాగనంపుతారు.

గుడి ముందర లేదా బొడ్రాయి దగ్గర తాము తెచ్చిన నైవేధ్యంను అమ్మవారికి సమర్పించి సాక పోసి, కొబ్బరి కాయలు కొడతారు. నైవేధ్యంలో కొంత భాగాన్ని భోనం కుండలోనే తిరిగి తీసుకొని అమ్మవారి ప్రసాదంలాగా భావించి తమ కుటుంబ సభ్యులు, భంధుమిత్రులు, స్వీకరిస్తారు. కొందరు తమ తమ పొలాల్లో పంటలు సంవృద్దిగా పండాలని ఈ నైవేధ్యంను పొలాల్లో చల్లుకుంటారు.

**ఘట నృత్యం-శివ సత్తుల చిందులు :-**

పసుపు, కుంకుమలతో, వేపాకు రెమ్మలతో అందంగా అలంకరించబడిన భోనంను నెత్తిన పెట్టుకొని మూగ తాండవం చేసే తీరును ఘట నృత్యం అంటారు. ఈ ఘట నృత్యం చేసే వారు తలపై భోనం మోస్తూ ఏ మాంత్రం తొలకకుండా అయ బద్దంగా నృత్యం చేస్తారు. శివసత్తులు మైకంలో మైమరచి చిందులు వేస్తారు. ఇదంతా దేవతపైన పరిపూర్ణ భక్తితోనే సాధ్యమని వారు నమ్ముతారు.

**పోతురాజుల వీరంగం :-**

ఏడుగురు అక్కచెల్లెల్లు అయిన అమ్మవార్లకు తోడ బుట్టిన ముద్దుల తమ్ముడిగా ఈ పోతు రాజును భక్తులు నమ్ముతారు. భోనాలలో ఈ పోతురాజు ముఖానికి నిండ పసుపు పూసుకొని, బొట్టు పెట్టుకొని, గజ్జెల లాగు ధరించి, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని చేతిలో చెర్నకోల పట్టుకొని ఆ చెర్నకోలతో లయబద్దంగా శబ్దం చేస్తూ గంభీక స్వరంతో కేకలు పెడుతూ నృత్యం చేస్తూ భోనాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాడు. పోతురాజును వీరభద్రుడి స్వరూపంగా భక్తులు నమ్ముతారు.

**భవిష్యవాణి(రంగం) :-**

ప్రతి యేటా పరమ పవిత్రంగా ఉంటూ అమ్మవారిని ఆరాదిస్తూ ఉన్న అవివాహత స్త్రీని అమ్మవారు దిగి వచ్చి అవివాహిత స్త్రీలో లీనమౌతుంది. అప్పుడు ఆ దేవతా మూర్తి వచ్చి కుండలో నిలబడుతుంది. అప్పటికి ఆ తల్లి జగన్మాతగా మారుతుంది. ఆ తల్లి నిలిచిన కుండయే రంగం అవుతుంది. దేశం గూర్చి, పరిపాలన గూర్చి, పాడి పంటల గూర్చి, వర్షభావ పరిస్థితుల గూర్చి, కరువు, కాటకాల గూర్చి, శుభాలు, అరిష్టాల గూర్చి భక్తులు అడిగిన ప్రశ్నలన్నింటికి ఓపికగా, సూటిగా సమాధానం చెబుతుంది. దీనినే రంగమెక్కడం లేదా భవిష్యవాణి అంటారు. ఈ రంగం దృశ్యం మనకు సికింద్రాబాద్ (లష్కర్) మహంకాళి ఆలయం లో లాల్ దర్వాజలోని సింహవాహిని అమ్మవారి గుడి దగ్గర అట్టహాసంగా నిర్వహిస్తారు.

**- అనురాధ**





# పొలం దగ్గరకే ఏటీఎం

తొలకరి మొదలైంది...దుక్కి దున్నాలి,విత్తనాలు కొనాలి. బ్యాంకులో పైసలున్నాయి కానీ, తీసుకోవాలంటే పది కిలోమీటర్ల దూరం పోవాలి. ఒక పూట పని పోద్ది, ఎట్లరా దేవుడా... అని దిగాలు పడుతున్న ఈ రైతుల పొలాల ముందు ఒక మొబైల్ ఏటీఎం ప్రత్యక్షమవుతుంది. కథగా కల్పనగా కనిపించే వాస్తవ గ్రామీణ ఆర్థిక చిత్రం ఇది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం,రామనగరంలో రైతుల ఇళ్ల దగ్గరకే ఏటీఎం వాహనాల రావడం ఇటీవల మొదలయింది.

**బ్యాంకులు అందుబాటులో లేని చోట**

బ్యాంకింగ్ రంగ సేవల్లో ఇటీవల కాలంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఎక్కడ చూసినా ఏటీఎంలు, ప్రజల చేతుల్లో క్రెడెట్, డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్... ఇలా ఎన్నెన్నో సౌకర్యాలు అందరికీ అందుబాటులోకి వచ్చినప్పటికీ, భారతదేశంలో 41 శాతం మందికి బ్యాంకుల సేవలు అందుబాటులో లేవు. 39 శాతం మంది గ్రామీణ ప్రాంతాల వారికి, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న 60శాతం మందికి బ్యాంకుల సేవలు అందటం లేదు. పల్లె ప్రజల పట్ల అమర్యాదపూర్వకంగా, బాధ్యతా రాహిత్యంతో అధికారులు ప్రవర్తించటం ఒక సమస్య కాగా, ఖాతా తెరవడానికి చేయడానికి అనేక నిబంధనలు, డబ్బులు తీసుకోవడానికి ఏటీఎంలు అందుబాటులో ఉండక పోవడం,ఉన్నా వాటిల్లో నగదు లేకపోవడం వంటి కారణాలవల్ల ప్రజలు బ్యాంకులంటే భయపడుతున్నారు.

**ప్రజలకు అవగాహన**

ఇలాంటి నేపథ్యంలో బ్యాంకులను ప్రజలకు చేరువ చేయడానికి, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాల్లో భాగంగా ఇ లావాదేవీలు, ఏటీఎం కార్డుల వినియోగం, రుణాలు పొందడం, ఫిక్సిడ్ డిపాజిట్‌లు వంటి భిన్న అంశాలపై గ్రామీణ ప్రజలకు చైతన్యం కల్పిస్తారు. గృహ వినియోగ బడ్జెట్ రూపొందించుకోవడం, ఆర్థిక లావాదేవీలన్నింటినీ నమోదు చేయడం, పొదుపు ఖాతాల్లో లావాదేవీలను ప్రోత్సహించడం, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్ల ద్వారా క్రియాశీలంగా పొదుపు చేయడం వంటి లక్షణాలు ప్రజల్లో అలవరచేలా మారు మూల పల్లెల్లో జిల్లా సహకార బ్యాంకు సిబ్బంది సమావేశాలు నిర్వహిస్తారు.

**కదిలే ఏటీఎంలు అంటే?**

తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలన్ని బ్యాంకులకు అనుసంధానం చేయడంతో నేటి పరిస్థితుల్లో బ్యాంకుల ప్రాధాన్యత పెరిగింది. దీంతో గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకు సేవలు విస్తృతం చేయడానికి జిల్లాసహకార బ్యాంకులు నాబార్డ్ సహకారంతో ఉమ్మడి తెలంగాణ జిల్లాల్లో (మహబూబ్‌నగర్ తప్ప) ఒక్కొక్క ఏటీఎం వ్యాన్‌ను సమకూర్చుకున్నాయి. ఎక్కడో మండల కేంద్రంలో ఉన్న బ్యాంకు వద్దకు వెళ్ల లేనివారికి ఈ మొబైల్ ఏటీఎంలు సేవలు అందిస్తున్నాయి.

**బయోమెట్రిక్ విధానం ద్వారా...**

మొబైల్ బ్యాంకులకు తోడు, డీసీసీబీ బ్యాంకు శాఖల ఆధ్వర్యంలో



రైతు సంఘాలకు ఒక బయోమెట్రిక్ యంత్రాన్ని ఇచ్చారు. ఈ యంత్రంతో ఖాతాదారుడు నగదు డ్రా చేయడం, నగదు వేయడంగాని చేసుకునే అవకశం కల్పించారు. డబ్బులు తీసుకునే ఖాతాదారులు తమ కిసాన్ క్రెటిట్ కార్డును బయోమెట్రిక్ మిషన్‌కు అనుసంధానం చేసిన అనంతరం ఖాతాదారుడి వేలిముద్రలను తీసుకుంటారు. దీంతో వారికి కావాల్సిన నగదు తీసుకునే అవకాశం ఉంది.

ఈ సేవలు నడవలేని వృద్ధులు, దివ్యాంగులకు ఆసరాగా ఉన్నాయి. కదల లేని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. మొబైల్ ఏటీఎంలు ఇంటింటికీ వెళ్లి వారికి సేవలందిస్తున్నారు.

**ప్రజలకు చేరువలో**

'గ్రామీణ ప్రాంతాల బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి డిసీసీబీ బ్యాంకులు గ్రామాల్లో మొబైల్ ఏటీఎంలను నడుపుతున్నారు. ఒక్కొక్క వాహనం కోసం నాబార్డు రూ.15లక్షలు గ్రాంట్ మంజూరు చేసింది. ఏటీఎం యంత్రాలు,సిబ్బంది నిర్వహణ డీసీసీబీ లే చూసుకుంటాయి. ప్రజలు సమయాన్ని వృథా చేసుకోకుండా నిరంతరం వారికి అందుబాటులో ఈ వాహనాలు పని చేస్తున్నాయి. ప్రజలకు బ్యాంకుల సేవల గురించి తెలిపి, ఆర్థిక అక్షరాస్యతను పెంచుతున్నాం ' అని ఖమ్మం జిల్లా నాబార్డు అధికారి అంటారు.

ఖమ్మం జిల్లాలో బ్యాంకు సౌకర్యం లేని మారు మూల పల్లెలకు ఏటీఎం వ్యాను పంపుతున్నారు. 1,80,000 కిసాన్ క్రెడిట్ కార్డుదారులు ఈ సేవలు వినియోగించుకుంటున్నారని. అని ఖమ్మంలోని డిసిసిబీ అధికారులు చెప్పారు.

**సమయం వృథా కాకుండా**

'ఇపుడు సాగు సీజన్. విత్తనాలకు,దుక్కిదున్నడానికి కూలీలకు డబ్బులివ్వడానికి డబ్బు అవసరం. దీని కోసం పక్క ఊరికి పోవాలంటే ఒక పూట పని మానుకోవాలి. ఇపుడా నష్టం లేకుండా మా పొలం దగ్గరకే ఏటీఎం వ్యాన్ వస్తున్నది. సమయం, డబ్బు వృథాకాకుండా అయింది.' అంటోంది రామనగరం గ్రామస్తురాలు.

**జూపూడి మమత.**

**అప్పుల నుండి బయట పడ్డాం**

" మా ఊర్లో ఏటీఎంలు లేవు. డబ్బులు అవసరమైనపుడు సత్తుపల్లి పోవాల్సి వచ్చేది. అంత దూరం పోయే ఓపిక లేక కొందరు వడ్డీకి అప్పు చేసేవారు. బ్యాంకులో డబ్బులున్నా మాకు ఇలాంటి పరిస్థితి దాపురించేది. ఇపుడు ఏటీఎంలు మా ఇంటి ముందుకే వస్తున్నాయి. అవసరమైన వారు కార్డు పెట్టి డబ్బులు తీసుకుంటున్నారు." అంటారు, రామనగరం సర్పంచ్,

**వేల్పుల కళావతి.**

శ్యాంమోహన్



# పాలమూరులో పసిడి పంటలు

కరవు నేలలో తొలిసారి నీళ్లు పారించుకున్న పాలమూరు జిల్లా గత చరిత్రను తిరుగరాస్తున్నది. వేసంగిలో కూడా బంగారంలాంటి పంటలు తీస్తున్నది. కనుచూపు మేర పండ్లతోటలు, పచ్చటి పొలాలతో పాలమూరు కళకళలాడుతున్నది. కరువుకాటకాలతో అల్లాడిన ఆ జిల్లాలో ఇప్పుడు జలసిరుల పరవళ్లు... చెరువు గట్లమీద తంగేడు పూలు విరగబూస్తుంటే పంటచేలమీద వలస కొంగల గుంపులు బారులు తీరుతున్నాయి. పాలమూరు ఆకుపచ్చ విప్లవాన్ని పురుడు పోసుకున్నది. పాలుపెరుగుతో ఒకనాడు పాలమూరుగా ఖ్యాతినొందిన తన గత వైభవాన్ని పునర్ లిఖించుకునే దిశగా అడుగులు వేస్తున్నది.

రేపటి వానకాలం పంటకు రెట్టింపు ఉత్సాహంతో రైతులు సిద్ధమవుతున్నారు. ఇది జలం తెచ్చిన మార్పు.

కొందరు రైతులు వాటర్ షెడ్ ఫలాలను పొందుతుంటే, మరి కొందరు కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాల కింద చెరువులు నిండి, వాటి కింద సాగులో నిమగ్నమయ్యారు.

అమ్మలక్కలు నడుం వొంచి పంట పొలాల్లో కొత్త పాటలు పాడుతున్నరు. పాలమూరు తెలంగాణలోనే అతిపెద్ద జిల్లా. దాదాపు 35లక్షల మంది నివసించే ఈ జిల్లా ప్రజల శ్రమకు ఒక గుర్తింపు ఉంది. అదే పాలమూరు లేబర్. వారు చిందించిన చెమటతో దేశంలోని ఎన్నో పెద్ద పెద్ద ప్రాజెక్టులు నిర్మించారు. వారి రక్తం అక్కడి మట్టిలో కలసిపోయింది. కానీ పాలమూరు జీవితాలకు వెలుగులిచ్చే, సాగునీటి ప్రాజెక్టులు మాత్రం దశాబ్దాల తరబడి పెండింగ్‌లోనే ఉండిపోయి, పాలమూరు తరాల తలరాత మాత్రం మారలేదు. అయితే ఇదంతా గత కాలపు చేదు చరిత్ర. కరువుతో, కడగండ్లతో, కష్టాలతో ఏండ్ల తరబడి సహవాసం చేసిన పాలమూరు మట్టి మనుషులకు కొత్త జీవితంలోకి అడుగులేస్తున్నారు.

జిల్లా మొత్తము విస్తీర్ణము 43.73 లక్షల ఎకరాలు. ఇందులో సాగుకు యోగ్యమైనది 35 లక్షల ఎకరాలు...

రాబోయే మూడు నాలుగు సంవత్సరాల్లో పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్, జూరాల, ఆర్డీఎస్, తుమ్మిళ్ళ, గట్టు, చిన్న నీటి చెరువుల కింద సుమారు 18 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మొత్తంమ్మీద తెలంగాణ ప్రభుత్వం ముందు చూపుతో మహబూబ్‌నగర్ జిల్లా దశ, వలస జీవుల దిశ మారడం మొదలైంది. అని ఇరిగేషన్ వర్గాల అంచనా.



**ఏడువందల చెరువులకు జలకళ**

అత్యధిక చెరువులున్న జిల్లా కరువు జిల్లాగా, వలసల జిల్లాగా మారడం ఒక విచిత్రం, విషాదం. పాలమూరు గోస తీర్చేందుకు తెలంగాణ సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ కింద మహబూబ్ నగర్ జిల్లా చెరువుల పునరుద్ధరణ జరిగింది. పునరుద్ధరణ జరిగిన చెరువులను ఎత్తిపోతల పథకాలతో అనుసంధానం చేయడంతో వాటికి పూర్వ వైభవం వచ్చింది. జిల్లాలో దాదాపు 700లకు పైగా చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. దీనికి తోడు గత ఆరేళ్లుగా వాటర్ షెడ్ కార్యక్రమాల్లో చేపట్టిన జలసంరక్షణ పనులు కూడా పాలమూరు పచ్చగా మారడానికి కారణమయ్యాయి. పదండి పాలమూరు రైతుల స్పందన విందాం...

**పంట పండింది...**

"మాకు బోరు ఉంది కానీ ఏనాడూ చుక్కనీరు లేదు. పొలాల్లో ఎంత వాన కురిసినా అదెటో పోయేది. మా ప్రాంతంలో చెరువులు నిండాక మా బోరు నుండి 4 అంగుళాల నీళ్లు వస్తున్నాయి.రెండెకరాల్లో బత్తాయి, ఒక ఎకరంలో పశుగ్రాసం పెంచుతున్నాం" అని సంతోషంగా చెప్పింది రంగారెడ్డిపల్లి రైతు నాగమణి.

**స్వశక్తితో సుభిక్షంగా**

"చెరువులు నిండటంతో మాకున్న రెండు ఎకరాల బీడు భూమి ఇపుడు సాగు లోకి వచ్చింది. కందులు, కూరగాయలు పండిస్తున్నాను. ఒక నీటి కుంటను తవ్వి బోరు నీటిని దానిలో నిలువ చేసి పైపుల ద్వారా పొలాలకు అందిస్తున్నాం" అంటారు తోడేళ్ల గడ్డ రైతులు

**పక్షులు కూడా వలస వస్తున్నాయి**

"ఇంతకు ముందు ఇక్క దంతా బీడు భూములే. పంటలు లేక, ఉపాధిలేక ముంబాయి, పూణె లకు వలసలు పొయేటోళ్లు, మిషన్ కాకతీయ చెరువులు, వాటర్ షెడ్ పనుల వల్ల మార్పు వచ్చింది. మాకు 4 ఎకరాల పొలం ఉంది. భూగర్భ జలాలు పెరగడంతో మొక్కజొన్న, ఉల్లి, అరటి పండిస్తున్నాం. నీటివసతి వల్ల నిరంతరం పంటలు పండిస్తుండటం వల్ల రకరకాల కొంగలు వస్తున్నాయి" అంటారు,

మహబూబ్‌నగర్ రైతు అనంతయ్య,

**కరవు నేలలో తుంపర సేద్యం**

"ఏడాదంతా చెమటోడ్చినా ఎకరానికి నాలుగైదు వేలు మిగలని పాలమూరు నేలల్లో ఇపుడు పంటలు పండుతున్నాయి.వేసంగిలో కూడా కూడా నీళ్లు ఉన్నాయి. పంటలకే కాదు పశువులకు నీరు ఉంది" అంటారు అచ్చం పేట రైతు కోట్ల రామకిష్టయ్య.

ఇపుడు పచ్చదనం పాలమూరులో కనిపిస్తున్నది. సొంత ఊళ్లకు తిరిగొస్తున్న రైతులు, రద్దవుతున్న ముంబాయి బస్సులు, ఆ చివర నుంచి ఈ చివర వరకు పరచుకున్న పొలాలు, కళకళలాడుతున్న గ్రామాలే ఇందుకు నిదర్శనం.

శ్యాంమోహన్



# క్వినోవాతో ఉపాధి బాట

చిలుకలగూడకు చెందిన రమేష్.. ఐటీ ఉద్యోగం.. సీనియర్ డైరెక్టర్ స్థాయి పోస్టు.. ఏడాదికి 36 లక్షల జీతం.. అంతా సాఫీగా సాగిపోతుందనుకున్న సమయంలో ఒక్కసారిగా కుదుపు. ఉద్యోగం ఊడింది. చేతిలోని డబ్బు పోయింది. ఉద్యోగం ఇక దండుగ.. ఓ ఉపాధి రంగాన్ని ఎంచుకొని నలుగురికి సాయపడాలని నిర్ణయించుకున్నారు. వ్యవసాయ రంగమే ఉత్తమమని భావించి క్వినోవా సాగుపై దృష్టిపెట్టారు. ప్రస్తుతం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం పొన్నాల గ్రామంలో క్వినోవా శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

రమేష్ క్వినోవానే ఎంచుకోవడానికి కారణాలున్నాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ 2013ను క్వినోవా ఇయర్‌గా ప్రకటించింది. ఈ పంటతో ఎన్నో ఉప ఉత్పత్తులు తయారు చేయవచ్చు. పెట్టుబడి తక్కువ. సస్యరక్షణ చర్యలు అవసరం లేదు. దిగుబడి ఎక్కువ.

2013లో అమ్మభూమి ప్రాజెక్టు ఏర్పాటు చేసిన రమేష్ వరంగల్ జిల్లా కొన్నె గ్రామంలో సాగు చేపట్టారు. మొదటగా టిఎస్ఐఆర్‌డ్‌లో 30 గ్రాముల విత్తనం తెచ్చారు. ఎకరం పొలంలో సాగుచేశారు. వెయ్యి కిలోలు దిగుబడి సాధించారు. సగం పంటను 60 మంది రైతులకిచ్చి సాగు చేయించారు. మిగిలిన సగాన్ని కిలోకు రెండు వేల చొప్పున అమ్మారు. క్వినోవా సాగు చేసిన రైతులకు సాగు విధానాలు తెలియజేశారు. ఇతర రాష్ట్రాల్లో తిరిగి క్వినోవా సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేశారు. పంటను తనకున్న పరిచయాలతో అమ్మించి రైతులను గిట్టుబాటు అయ్యేలా చూశారు.



అనంతపురానికి చెందిన ఓ రైతు చేసిన సూచనతో క్వినోవా సాగుతో పాటు ప్రాసెస్ యూనిట్‌ను ప్రారంభించాలని నిర్ణయించుకున్నాడు. పెట్టుబడి కోసం కొన్నెలోని భూమిని అమ్మేశాడు. బ్యాంకు లోన్‌తో పాటు.. చిన్ననాటి ఫ్రెండ్ ప్రకాష్ చౌదరి సాయం చేయగా మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం పొన్నాల గ్రామంలో యూనిట్‌ను ఏర్పాటుచేశారు.

పొన్నాల గ్రామంలో నెలకొల్పిన ఈ క్వినోవా శుద్ధి కేంద్రం తెలంగాణ జిల్లాల్లో మొదటిది, ఇండియాలో ఐద వ ప్రాజెక్టు. ఈ శుద్ధి కేంద్రానికి కోటి రూపాయ లు పెట్టుబడి కాగా.. గంటకు టన్ను క్వినోవా పంటను శుద్ధి చేయవచ్చు. తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల రైతులు ఈ కేంద్రానికి వచ్చి క్వినోవా పంటను శుద్ధి చేయించుకొని వెళ్తున్నారు. కిలో క్వినోవా శుద్ధికి 50 రూపాయలు వసూలు చేస్తున్నారు. 100 కిలోల నుంచి 500 కిలోల లోపు ఉంటే 70 రూపాయలు, 500 నుంచి 1000 కిలోలు ఉంటే 50 నుంచి 60 రూపాయలు 1000 కిలోల పైన ఉంటే కొంత తగ్గించి చార్జీలు వసూలు చేస్తున్నారు. శుద్ధి చేసిన క్వినోవా సూపర్ మార్కెట్‌లో కిలోకి రూ.350 నుంచి రూ.1000 వరకు అమ్ముడవుతుంది. అయితే ప్రస్తుతం ఉత్తర భారతంలో గత కొన్ని సంవత్సరాలుగా అధిక విస్తీర్ణంలో పంట వేయడం మూలంగా ప్రస్తుతం ఈ పంటకు గిట్టుబాటు ధర రావటం లేదు. ఈ పంటలోని పోషక విలువలను గురించి చాలా మందికి అవగాహన లేకపోవడం, ఎలా వండుకోవాలో తెలియకపోవడం, ప్రాసెసింగ్ యూనిట్లు అందుబాటులో లేకపోవడం కూడా ముఖ్య కారణాలు.

అధిక పోషకాలు కలిగిన ఈ పంటపై ప్రభుత్వ పరంగా అవగాహన కల్పించి కనీస మద్దతు ధర ప్రకటించి పోషకాహార లోపాలు నివారించే ప్రభుత్వ పథకాల ద్వారా ఈ పంటను కొనుగోలు చేయగలిగితే తెలంగాణ రాష్ట్ర రైతులు కూడా విరివిగా ఈ పంటను పండించి అధిక లాభాలు పొందే అవకాశం ఉంది. ఇతర వివరాలకు www.facebook.com/iquinoa ను సందర్శించండి.

– అండెం శ్రీనివాస్‌రెడ్డి

– జి.జయపాలరెడ్డి

# ఆసక్తే ఆదాయమార్గం



**చి**న్నప్పటి నుంచి ఉన్న ఆసక్తినే ఉపాధిగా మలుచుకున్నారు. తరిగిపోతున్న నాటుకోళ్లను సంరక్షించాలనే తలంపుతో మొదటగా 50 కోళ్లతో పెంపకం ప్రారంభించారు. స్టేషన్ ఘన్‌పూర్ మండలం శ్రీపతిపల్లికి చెందిన కేశిరెడ్డి నర్సింహారెడ్డి ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లాలోని జలాల్‌పూర్‌లోని ఆరున్నర ఎకరాల మామిడితోటను లీజుకు తీసుకొని మొత్తం 3600 కోళ్లను పెంచుతూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శ్రీపతిపల్లికి చెందిన కేశిరెడ్డి నర్సింహారెడ్డి 13 సంవత్సరాల కిందట యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం జలాల్‌పూర్‌కు వలస వచ్చారు. అక్కడ ఆరున్నర ఎకరాల మామిడి తోటను లీజుకు తీసుకున్నారు. శ్రీపతిపల్లి లో ఉన్నప్పుడు తనకున్న 15 ఎకరాల్లో వరి, మక్కజొన్న, జొన్న, రాగులు ఎక్కువగా పండించేవారు. అంతేగాక ఇంటి వద్ద 100-150 నాటుకోళ్లతో పాటు బాతులు, కుందేళ్లు పెంచేవారు.

వలస వచ్చిన తర్వాత జలాల్‌పూర్‌లోని మామిడితోటలోనూ నాటుకోళ్లను పెంచాలని నిర్ణయించుకున్నారు. ఆలోచన వచ్చిందే తడవుగా తన ఇద్దరు కొడుకులతో కలిసి దేశవాళీ బ్రీడ్ కోసం అనేకచోట్ల వెతికారు. కోళ్లపై అవగాహన పెంచుకునేందుకు ఎన్నో ప్రాంతాలు తిరిగారు. కొన్ని నాటు కోళ్లను ఎంపిక చేసుకొని పెంపకం ప్రారంభించారు.

**మామిడి తోటలోనే అంతా..** తాను లీజుకు తీసుకున్న మామిడితోటను కోళ్ల పెంపకానికి అనువుగా మార్చాడు. కోళ్లు బయటికి వెళ్లకుండా.. ఇతర జంతువులు తోటలోకి రాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. కోళ్ల సైజును బట్టి మూడు షెడ్డులు ఏర్పాటు చేశాడు. మొదట 50 కోళ్లతో ప్రారంభించిన పెంపకం ప్రస్తుతం 3600 కోళ్లకు చేరింది.

**పోషణ ఇలా..** షెడ్డులోని ప్రతీ కోడిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతారు. ప్రతి రోజు కిలో కోడికి 100 గ్రాముల దాణా ఇస్తారు. ఈ దాణాను కూడా కోళ్లకు ప్రక ృతి సిద్ధంగానే అందిస్తున్నారు. తోటలోనే కోళ్ల కోసం పాలకూర, అజోల్లా, లూసర్న్ పెంచుతున్నారు.

అంతేకాక చుట్టుపక్కల రైతుల నుంచి కూరగాయలు కొనుగోలు చేసి కోళ్లకు వేస్తున్నారు. వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మామూలుగా నాటు కోళ్లకు వచ్చే రోగాలు తక్కువ. అయితే గంబోరా, అమ్మతల్లి, కొక్కర లాంటి రోగాలు తట్టుకునేందుకు కోళ్లకు వెల్లుల్లి రసంతో పాటు జామ, వేపాకు, అరకు ఆకులను ఉడికించి ఆ రసాలను తాగిస్తున్నారు.

**వృద్ధి ఇలా..** షెడ్డులోని బ్రీడ్‌ను చాలా జాగ్రత్తగా కాపాడుతున్నారు. కోళ్లు పెట్టిన గుడ్లను కొన్నింటికి కోళ్లకే పొదిగేస్తుండగా.. మరికొన్నింటిని ఇంక్యుబేటర్‌లో పెడుతున్నారు. అయితే ఇంకుబేటర్ నుంచి వచ్చిన పిల్లలను రాత్రివేళల్లో మరో పిల్లల కోడికి కలిపేస్తారు. పెద్ద కోళ్ల కంటే చిన్న పిల్లల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వీటికి ఓ సపరేట్ షెడ్డు వేశారు. పిల్లలు నెల రోజులు అయ్యేంతవరకు ఎక్కువగా బయటతిప్పకుండా షెడ్డులోనే ఉంచి దాణా అందిస్తారు. ఆ తర్వాత పెద్ద కోళ్లతో కలియ తిప్పుతారు. నాటు కోడి నాలుగు నుంచి నాలుగున్నర నెలల కాలంలో 1.5 కేజీ నుంచి 2.00 కేజీల వరకు బరువు తూగుతాయి. వీటికి కిలోకు రూ.220 నుంచి రూ.250 వరకు అమ్ముతారు.

**మార్కెట్.. :** నాటు కోళ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో నాటుకోడి మాంసం కిలో రూ.350లకు అమ్ముడుపోతున్నది. రైతు కేశిరెడ్డి నర్సింహారెడ్డి మాత్రం తన ఫాంలోనే కోళ్లను అమ్మేస్తున్నాడు. స్థానికంగానే వాటికి భారీ డిమాండ్ ఉంది. మార్కెట్‌లో ఎంత రేటు ఉన్నా నర్సింహారెడ్డి మాత్రం స్థానికులకు రూ.220, ఇతర ప్రాంతాల వారికి రూ.250లకు ఇచ్చేస్తాడు. అంతేకాక నాటు కోడి గుడ్లను కూడా విక్రయిస్తాడు. ఒక్కో గుడ్డుకు రూ.10ల చొప్పున రోజుకు ఇంటి వద్దే వంద గుడ్ల వరకు అమ్ముతాడు. మరోవైపు నాటు కోళ్ల ఎరువును మామిడితోటకు అందిస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నాడు.

**డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులకు ఇక్కడి నుంచే సరఫరా..** సీఎం దత్తత గ్రామాలైన ఎర్రవల్లి, నర్సపేటలోని డబుల్ బెడ్ రూం లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రకటించిన 10 కోళ్లను నర్సింహారెడ్డి ఫాం నుంచే తీసుకువెళ్లారు. మొత్తం పది కోళ్లలో 9 పెట్టేలు, ఒక పుంజును ఇచ్చారు. వీటిని పెంచుకొని లబ్ధిదారులు ఆర్థికంగా ఎదగాలన్నదే అధికారుల ఉద్దేశం.

> ### నాటుకోళ్లంటే ప్రాణం
>
> నాటు కోళ్లంటే.. మరీ ముఖ్యంగా తెలంగాణకు చెందిన స్వచ్ఛమైన బ్రీడ్ అంటే ఎంతో ప్రాణం. చిన్నప్పటి నుంచి ఊరిలో నాటు కోళ్లను పెంచేవాళ్లం. జలాల్‌పూర్‌కు వచ్చిన తర్వాత కోళ్లను పెంచాలని నిర్ణయించుకొని ప్రస్తుతం 3600 కోళ్లను పెంచుతున్నాం. ఇంకుబేటర్ లేక కొంత ఇబ్బంది అవుతుంది. ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తే నాటుకోళ్ల సంఖ్యను రెట్టింపు చేయాలనే ఆలోచనలో ఉన్నా. నాటు కోళ్లను పెంచే ఆలోచనలో ఉన్నవారు పిల్లల కోసం 9542314286 నెంబర్‌లో సంప్రదించవచ్చు. రూ.30లు తీసుకొని ఒక్క పిల్ల ఇస్తాం.
>
> **- నర్సింహారెడ్డి, రైతు**

**ఆదాయం ఇలా..** ఎకరం పొలంలో 1000 కోళ్లను సులువుగా పెంచవచ్చు. ఇందుకు 1,00,000 నుంచి 1,20,000ల వరకు ఖర్చు వస్తుంది. 1000 పిల్లల్లో 800ల నుంచి 900ల పిల్లలను కాపాడుకోగలగి కేజీ రూ.220ల చొప్పున అమ్మినా రూ.1,75,000 ఆదాయం వస్తోంది.

**- అందెం శ్రీనివాస్‌రెడ్డి**



# యువతే నవభారత నిర్మాతలు

యువతా మేలుకో అని పిలుపునిచ్చిన వివేకానందుని జీవితం భారతీయు యువజనులకు నూతన ఉత్సాహాన్నిస్తూ, ధైర్యాన్ని నూరిపోస్తుంది. అపజయాలకు కుంగిపోకుండా యువకులకు లక్ష్యంపట్ల, లక్ష్యసాధన పట్ల శ్రమించేలా వివేకానందుని సందేశాలు కొండంత బలాన్నిస్తాయి. అందుకే దేశ జనులకు కాకుండా ప్రపంచ యవనికపై వివేకానందుని సూక్తులు ఆత్మవిశ్వాసం సడలకుండా విజయంవైపు ముందుకుసాగేలా ప్రోత్సహిస్తాయి.నరేంద్రనాథ్ దత్తా అనే వ్యక్తి స్వామివివేకానంద అనే శక్తిగా మారి సమాజాన్ని ప్రేరేపించగలిగాడు, ప్రేరేపిస్తూనే ఉన్నాడు. దేశం గర్వించదగ్గ ఆధ్యాత్మిక వేత్తలల్లో ముందు వరుసలో ఉండే నరేంద్రుడు ఎందరో యువతకు ఆత్మవిశ్వాసానికి ప్రతికగా నిలిచాడు. నరేంద్రనాద్ దత్తాగా 1863 జనవరి 12 న కలకత్తా నగరంలో జన్మించి స్వామివివేకానందగా మారాడు.తన చిన్నతనం నుండే చదువులో చురుకుగా ఉండే వివేకానందుడు మహాభారతం,రామాయణం లాంటి ఆద్మాత్మిక గ్రంథాలు, ఇత్యాది పుస్తకాలను ఆసాంతం చదివి ఆధ్యాత్మికత వైపు పయనించినాడు. అందుకే స్వామి వివేకానంద గొప్ప ఆధ్యాత్మికవేత్తగా ఎదిగాడు. మనిషికి వెలుగునిచ్చి మనోవికాసానికి తోడ్పడేది విద్య అని నమ్మిన వివేకానందుడు విద్యద్వారానే నూతన సమాజం ఆవిష్కరిస్తుంది అని నమ్మి జాతి జనులను విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి, వివేకవంతులుగా మార్చడానికి తన ప్రసంగాలు,సందేశాలతో కార్యాచరణకు పూనుకున్నాడు.విద్య అంటే ఎనలేని అభిమానం కలిగిన వివేకానందుడు అపజయాలను లెక్కచేయకుండా గెలుపుకోసం నిరంతరం శ్రమిస్తేనే అవిజీవితానికి అందంచేకూరుస్తాయని నమ్మి ఆచరించినవాడు.అందుకే వివేకానందుని సూక్తులు,సందేశాలు నేటికీ యువకులకు కరదీపికలుగా నిలుస్తున్నాయి.తనకున్న పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ స్వప్రయోజనం కోసం జీవించేవాడు సాధారణ వ్యక్తి అవుతాడు, పరిజ్ఞానానికి యుక్తిని జోడించి,తనతోపాటు ఇతరుల కోసం కూడా పాటుపడేవాడు పరుల విశ్వసనీయతను కూడగట్టుకొన్న ఆప్తుడవుతాడు,పరిజ్ఞానం,యుక్తి మాత్రమే కాక ప్రతివ్యక్తిలో అంతర్గతంగా తరగని విశిష్ట శక్తి దాగి ఉంటుందని గుర్తించి దాని ప్రయోజనాత్మకంగా సమాజ వికాసం కోసం ఉపయోగించేవాడు సర్వ మానవ శ్రేయం కాంక్షించే నాయకుడవుతాడు.పరోపకారమే పరమావధి అని నమ్మి సమాజంలోని అవలక్షణాలను ఆమూలాగ్రం తొలగించాలని త్యాగనిరతితో కంకణం కట్టుకున్నవాడు సంస్కర్త అవుతాడు వీటిలో ఏరకానికీ చెందక స్వయం సామర్థ్యం, బాధ్యతలకూ నీళ్ళదిలి పరాన్న భుక్కుడై బతికేవాడు దేశానికి బరువైన సమస్య అవుతాడు అని స్వామివివేకానంద కొన్ని సంవత్సరాల క్రితమే యువకులనుద్దేశించి సందేశమిచ్చాడు.అందుకే నేటికీ వివేకానందుడుయువశక్తికి ప్రతీకగా నిలుస్తూ,దేశములోనే కాకుండా ప్రపంచంలోనే యువజనులకు ఆశాకిరణం అయి, స్ఫూర్తిగా నిలుస్తూ అందరి మన్ననలను పొందుతున్నాడు. వివేకానందుడి వారసత్వం సాక్షిగా దేశంలో యువజనం పరవళ్ళు తొక్కుతోంది.కానీ ఆ యువజనులనంతా అభివృద్ధి భారత్‌లో భాగస్వాములను చేసి, ఆర్థికంగా ఎదగడానికి మానవవనరులను సమాజ

హితానికి,శాంతి కాముక సమాజాన్ని నిర్మించడానికి ప్రభుత్వాలకు సమగ్ర కార్యాచరణ అవసరము.




ప్రపంచంలో జనాభాలో భారతదేశం రెండవస్థానంలో ఉన్నా,యువజనాభాలో మాత్రం భారత్ మొదటిస్థానం ఆక్రమించింది. ఇటీవల ఐక్యరాజ్యసమితి జనాభానిధి సంస్థ ద పవర్ ఆఫ్ 1.8 బిలియన్ పేరిట విడుదల చేసిన నివేదికలో యువజనం గురించి వెలిబుచ్చింది. దేశంలో 35.6 కోట్ల మందితో 10 నుంచి 24 మధ్య వయస్సు గల వారు ప్రపంచంలోనే యువభారత్ లో అధికంగాగలరని నివేదిక తెలిపింది.ప్రపంచంలో 180 కోట్ల మంది యువకుల జనాభా ఉండగా,ఐదోవంతు జనాభా భారత్ లోనేఉన్నారు. మన దేశ జనాభాలో 28 శాతం మంది యువకులు కలరు. భారత్ తర్వాత వరుసగా 26.9 కోట్ల మందితో చైనా రెండవస్థానంలో,ఇండోనేసియా 6.7 కోట్ల తో మూడవ,అమెరికా 6.5 కోట్ల తో నాల్గవ, పాకిస్థాన్ 5.9 కోట్ల తో ఐదవ, నైజీరియా 5.7 కోట్లతో ఆరవ, బ్రెజిల్ 5.1 కోట్ల తో ఏడవ, బంగ్లాదేశ్ 4.8 కోట్లతో ఎనిమిదవ స్థానంతో యువకుల జనాభా కలిగి ఉన్నాయి.ప్రపంచ జనాభాలోనిఐదవ వంతు జనాభా మనదేశంలోనే ఉన్నారు.ప్రపంచంలోని అధిక యువజనాభా అల్ప అభివృద్ధి చెందిన దేశాలలోనే నమోదుకావడం గమనించదగినది. ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ (పిడబ్ల్యుసి) అనే అంతర్జాతీయ సంస్థ ఫ్యూచర్ ఆఫ్ ఇండియా -ద విన్నింగ్ లీప్ పేరుతో విడుదల చేసిన నివేదికలో 2034నాటికి 9 శాతం వార్షిక వృద్ధి రేటుతో 10 లక్షల కోట్ల డాలర్లు ( సుమారు రూ.600 లక్షల కోట్లు) ఆర్థికవ్యవస్థగా ఎదిగే సత్తా యువ భారత్ దేశానికే ఉందని వెల్లడించింది.మానవ వనరులు లభ్యత అధికంగా గల భారత్‌లో సమర్ధవంతంగా వినియోగించుకునే అవకాశాలను అన్వేషించి, సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధిలో అగ్రగామిగా నిలువవచ్చని నివేదిక విశ్లేషించింది.దేశంలోని 125 కోట్ల జనాభా యొక్క తలసరి ఆదాయం ప్రస్తుతమున్న 1500 డాలర్ల నుంచి 7000 డాలర్లకు పెరిగితేనే ప్రజల జీవన ప్రమాణములు మెరుగుపడతాయని అందుకు గాను ప్రభుత్వము,కార్పోరేట్ రంగము క్రియాశీలకంగా వ్యవహరించవలెనని తమ నివేదికలో పేర్కొంది.ముఖ్యంగా దేశంలోని అధికంగా గల మానవవనరులను విరివిగా ఉపయోగించుకోవలెనని,తద్వారానే దేశ ఆర్థికవ్యవస్థ భారీగా అభివృద్ధిచెందుతుందని ఆ శక్తి అంతా దేశ యువజనుల శక్తిపైననే ఆధారపడిఉన్నదని తెలియజేసింది.దేశాభివృద్ధిలో మానవవనరుల పాత్ర వెలకట్టలేనిది.మానవవనరుల ఎంత నైపుణ్యవంతముగా అభివృద్ధి చెందితే, అంతే శీఘ్రగతిన అభివృద్ధికి బంగారుబాటలు పడతాయి. కానీ దేశంలో నైపుణ్యవంతమైన వనరుల కొరత వేధిస్తున్నది.ప్రభుత్వాలు విద్య పట్ల అనుసరిస్తున్న శ్రద్ధతో పాటు, నైపుణ్యవనరుల తయారీ పై అంతగా దృష్టిపెట్టకపోవడంతో నైపుణ్యము కొరతగా మారింది. 2011 లెక్కల ప్రకారం దేశ జనాభా 121.02 కోట్లు కాగా అందులో సుమారు 64 శాతం జనాభా ఉత్పాదక సామర్థ్యం కల వారు కావడం విశేషం.అధిక మొత్తంలో ఉన్న ఉత్పాదకవనరులకు పనిచూపడంతోపాటు, తగిన ఉపాధి, ఉద్యోగఅవకాశాలు కల్పించవలసిన అవసరం ప్రభుత్వాలపైన ఉంటుంది.ఉత్పాదక వనరులు విరివిగా లభ్యమవుతున్నా సరైన నైపుణ్యంగలవారు లేక కొట్టుమిట్టాడుతున్నది. మన దేశ కార్మిక శక్తిలో నైపుణ్యంగల వారు కేవలం 2 శాతం మాత్రమే ఉన్నారని లేబర్ బ్యూరో నివేదిక వెలిబుచ్చుతున్నది. ఇంతటి తీవ్రస్థాయిలో నైపుణ్యలేమి ఉంటే ఏటేటా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కల్పించకపోతే మానవవనరులు పెనుగండంగా మారే ప్రమాదం పొంచి ఉంటుంది.

జాతీయ ఆర్థిక గణాంకాల అంచనాల నూతన విధానం ప్రకారం దేశ ఆర్థిక వృద్ధిరేటు 7 శాతంగా చైనా ఆర్థిక వృద్ధి రేటును దాటి ముందుకుపోతున్నది. ఇలా వృద్ధిరేటు పెరిగిపోతూ ఉన్నప్పటికీ, పెరుగుతున్న పనిచేసేవారి జనాభాకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు మందగిస్తున్నాయి.దానికి తోడు తగిన సామర్ధ్యంగల వారిని తయారుచేసేలా విద్యా విధానంను సమూలంగా మార్చివేయాలి. అన్ని దేశాల ఉత్పాదక జనాభా తగ్గుముఖం పడుతుండగా మన దేశంలో మాత్రం పెరుగుతుండడం ఆర్థిక వృద్ధి శుభ సూచకం కాగా వారందరినీ ఏరకంగా ఉత్పాదకకార్యకలాపాలలో పాలుపంచుకొనేలా సద్వినియోగం చేసుకుంటామనే దానిపైననే దేశ అభివృద్ధి ఆధారపడి ఉన్నది.దేశంలో 18 సంవత్సరాలకంటే తక్కువ వయసున్న యువతీ, యువకులు 470 మిలియన్ల మంది ఉన్నారు. ఆర్థికసర్వే ప్రకారం ప్రతి సంవత్సరం



మనదేశంలో పనిచేసే వయస్సుకలవారు 63 మిలియన్ల మంది కొత్తగా చేరుతున్నారు. ఇలా పెరుగుతున్న ఉత్పాదక సామర్ధ్యం గల మానవవనరులను ఆర్ధికపురోగతి వనరులుగా మలచడంపైననే ప్రభుత్వాలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నది. దేశ జనాభాలో ఉత్పాదక సామర్ధ్యం గల 15-60 సంవత్సరాల మధ్య గల వయసు వారు అధికంగా ఉన్నారు. ప్రస్తుత గణాంకాల ప్రకారం 2040 నాటికి దేశ కార్మికుల సంఖ్య చైనా దేశ కార్మికశక్తిని దాటిపోతుందని అంచనా. అది గమనించిన చైనా ప్రభుత్వం ఇటీవల ఒక్కరు లేదా అసలే వద్దు అనే జనాభా నియంత్రణ విధానానికి స్వస్తి పలికింది. 2022 నాటికి ప్రపంచ కార్మిక శక్తిలో 15 నుంచి 17శాతం మంది భారతీయకార్మికులే ఉంటారని అంచనా. కానీ ఇంతగా కార్మికలోకం అధికంగా ఉన్నా ప్రస్తుతం నైపుణ్యంలేక మెరుగైన ఉద్యోగభద్రత,జీవనవిధానమును అందిపుచ్చుకోలేక పోతున్నారు. దేశ అవసరాలకు సరిపడా మానవవనరులు లభ్యమవుతున్నా సువర్ణావకాశాలను అందుకోలేక అంధకారంలోనే మగ్గుతున్నారు. 500 మిలియన్లు గల ప్రస్తుత కార్మిక శక్తిలో కేవలం 14 శాతం మాత్రమే సంఘటితరంగములో పనిచేస్తుండగా మిగతా 86 శాతం అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. అసంఘటితరంగ కార్మికులకు తగిన అవకాశాలు కల్పించి, మేలిమి వనరులుగా తయారుచేయడం పైననే దేశ భవిష్యత్తుఆధారపడి ఉన్నది. లేకపోతే పలు సమస్యలు సహవాసం చేసి,ప్రమాదఘంటికలు మోగించే అవకాశమున్నది.దేశంలో ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల పట్ల సంఘటితరంగము కుచించుకుపోయి,అసంఘటితరంగము దినదినవర్ధమానంగా వర్ధిల్లుచున్నది.కానీ అసంఘటితరంగకార్మికుల పట్ల ప్రభుత్వముచేపట్టే చర్యలు పురోగతినిసాధించక,వారి పట్ల ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ కనబరచవలసిన ఆవశ్యకతను నొక్కి చెపుతున్నది.

మెకెన్సీ నివేదిక ప్రకారం 54 శాతం మంది యువత మాత్రమే పై చదువులతోనే ఉపాధిఅవకాశాలు మెరుగయినాయని భావిస్తున్నారు.అంటే ఇంకా 46 శాతం మంది ఉన్నత చదువులేక ఉపాధిఅవకాశాలను అందుకోవడంలో వెనుకబడినారని తెలియుచున్నది. మరియు 65 శాతం మంది ఉన్నతవిద్యకు మధ్యలోనే స్వస్తిపలికి ఉసూరుమనిపిస్తున్నారు. ఇలా చదువులమ్మ ఒడిని చేరలేక ఒక అడుగు ముందుకి రెండడుగులు వెనక్కి అన్న తరహాలో దిగజారి పోతున్నారు. ఉపాధి, శిక్షణ అవకాశాలను కూడా సక్రమంగా వినియోగించుకోలేక సతమత మవుతున్నారు. ఉపాధి కల్పించే యాజమాన్యాలలోనూ సైతం 53 శాతం మంది నైపుణ్యం గల కార్మికుల కొరతను ఎదుర్కొంటున్నారంటే ఇక ప్రస్తుతం ఉన్నటువంటి వనరులతో నైపుణ్యంగల వనరులు ఎలా రాటుతేలుతాయో ఊహించదగినది. ఇలా నైపుణ్యంగల కార్మికులకొరతను దేశం ఎదుర్కొంటున్నది. ఇదిలా ఉంటే కాస్తో, కూస్తో నైపుణ్యంగల వారు తమ ఉద్యోగ, ఉపాధి, ఆదాయ అవకాశాలను మెరుగుపరచుకోవటానికి విదేశాలకు తరలిపోతున్నారు. మేలిమివనరులు విదేశాలకు తరలిపోయి స్వదేశానికి నిరుపయోగంగా మారుతున్నాయి. మేధోవలస మూలానా అధికంగా ఉన్నటువంటి మానవవనరులను నైపుణ్యంవంతంగా తయారుచేయడం కోసం విదేశీయులను ఆకర్షించాల్సి వస్తోంది. విదేశీయులు దేశంపట్ల ఆకర్షితులవుతున్నా తమ వ్యాపార, ఆర్ధిక, పారిశ్రామిక ప్రయోజనాలు నెరవేర్చుకోవడంపైననే వారి విధానాలు ఆధారపడి ఉంటాయి. దేశంలో శాస్త్రీయ అవగాహన కావలసినంతగా వృద్ధిలోకి రావడము లేదు.పరిశోధకులు పరిశోదనలు పెరుగుతున్న దేశజనాభా అవసరాలకు అనుగుణంగా,వారి ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు దేశ ఆర్ధిక విధానములోనూ, వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాలలోనూ అవలంబించవలసిన విధానాలకు ఉపయోగపడే విధంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.కానీ మన పరిశోధనలు అంతర్జాతీయ ఖ్యాతిని గడించలేక చతికిలపడిపోతున్నాయి. దాన్ని వేగవంతము చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.దేశంలో ఐ.టి మరియు అనుబంధ సంస్థల అవసరానికి సుమారు 23 లక్షల మంది నిపుణుల అవసరం అని అంచనా. కానీ నేటికీ దేశంలో కేవలం 16 లక్షల మంది ఐటి నిపుణులను మాత్రమే ఉన్నారని అంచనా.అంటే ఇంకా 7 లక్షల మంది తయారయ్యే నాటికి ఇంకా వారి అవసరం పెరుగుతుంది తప్ప, తగ్గే అవకాశం లేదు.

నాస్కామ్ అంచనా ప్రకారం ప్రతీ సంవత్సరం సుమారు 30 లక్షల మంది డిగ్రీ,పి.జీలు పూర్తి చేసి మానవవనరులుగా మారుతున్నా వారిలో 25 శాతం మంది మాత్రమే వృత్తినైపుణ్యం కలవారుకాగా,మరో 10 నుంచి 15 శాతం మంది ప్రస్తుత పారిశ్రామిక వర్గ ఉద్యోగ అవసరాలకు ఉపయోగపడుతున్నారు తప్ప మిగతా వారికి ఎలాంటి నైపుణ్యంలేక దేశ ఆర్ధికవ్యవస్థకు ఆశనిపాతంలా తయారవుతున్నారు. ఇలా

నైపుణ్యంగలవారి కొరతను గుర్తించిన ప్రభుత్వం 2022 నాటికి 40 కోట్ల మంది యువతకు నైపుణ్యవంతమైన శిక్షణను ఇప్పించి ఉపాధి,ఉద్యోగఅవకాశాలను కల్పించి నైపుణ్యభారత్‌ను తయారీ చేయడానికి పూనుకొన్నది.స్విట్జర్లాండ్ తరహాలో నైపుణ్య శిక్షణా కేంద్రాలను భారత్‌లో ఏర్పాటుచేయడం జరిగింది.అదే విధముగా వృత్తివిద్యావకాశాలను మెరుగపరచాలి.మన విద్యావిధానములో ప్రస్తుతం అవలంబిస్తున్న విధానాలు వృతినైపుణ్యంకలవారుగా తయారుచేయడంలేదు. వృత్తినిపుణులను వృద్ధి చేసే విద్యావిదానమును రూపొందించాలి.పలు సంస్కరణలతో ముందుకు వెళితేనే పెరుగుతున్న మానవవనరులను సద్వినియోగపరుచుకొని దేశఆర్థికాభివృద్ధిని పెంపొందించవచ్చు.లేకపోతే మానవవనరులు దుర్వినియోగమయి అశాంతి,అస్థిరత నెలకొనే ప్రమాదం పొంచి ఉంటుంది.పలు విధానాలతో కౌశలము అభివృద్ధి చేస్తేనే కుశల భారతము సాకారమవుతుంది. విజ్ఞాన ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతున్న 21వ శతాబ్ద విశ్వసమాజంలో సహజవనరులు,భౌతిక సంపద అభివృద్ధిని నిర్దేశించవు.మానవవనరులే అభివృద్ధిని నిర్దేశిస్తాయి.సుశిక్షితులైన మానవవనరులు అభివృద్ధికి చోదక శక్తిగా పనిచేస్తాయి – అని విజ్ఞాన ఆధారిత విశ్వసమాజాలు అనే నివేదికలో ప్రపంచబ్యాంక్ మానవవనరుల ప్రాధాన్యతను గురించితన అభిప్రాయమును వెలిబుచ్చింది.యువజనులతోనే భారత్ దేశ అభివృద్ధి ముడిపడి ఉన్నదని ఐక్యరాజ్యసమితి జనాభా నిధి మరియు ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్(పిడబ్ల్యుసి) నివేదికలు సాక్షాత్కరిస్తున్నాయి.పెరుగుతున్న యువజనులకు అనుగుణంగా సమాజ ప్రజల సంక్షేమంతో ప్రత్యక్షంగా ముడిపడి ఉన్న సామాజిక రంగాలైన విద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, త్రాగునీరు, పారిశుద్యం లాంటి ప్రధానమైన రంగాలను ప్రభుత్వాలు విరివిగా అభివృద్ధి చేయాలి.ఈ సామాజిక రంగాలు మానవ మూలధనకల్పనకుతోడ్పడి, మానవుల ఉత్పాదకతను పెంచి ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేస్తాయి. దేశ జనాభా పరిమాణాత్మకంగా కాక, గుణాత్మకంగా హెచ్చుగా ఏ దేశంలో ఉంటుందో ఆ దేశ ఆర్థికాభివృద్ధి వేగవంతమవుతుంది. జనాభా గుణాత్మకంగా పరిణామం చెందుటకు గాను అక్షరాస్యత,విద్య అవసరం.కావున దేశాభివృద్ధి ఆ దేశ అక్షరాస్యత రేటుపై ఆధారపడిఉంటుంది.అత్యధికంగా గల యువజనాభా వద్ద నైపుణ్యాలు, ఆరోగ్యం, నిర్ణయాధికారం ఉండే విధంగా వారిని తీర్చిదిద్దాలి.యువజనుల విద్య, ఆరోగ్యం పై భారీగా పెట్టుబడి పెట్టి, వారి హక్కులను పరిరక్షిస్తూ,ఈసురోమని మనుషులుంటే, దేశమేగతి బాగుపడునోయ్ అన్న మాటలను స్ఫురించుకుంటూ మానవవనరులను తీర్చిదిద్దాలి.

ఎడ్విన్ కానన్ మహాశయుడు వెలిబుచ్చినట్లు భూమిపైన పుట్టే ప్రతిబిడ్డ ఒక అభివృద్ధి కారకం అన్నట్లుగా మానవవనరులపై అధిక పెట్టుబడి పెట్టి,ఉద్యోగ ఉపాధి అవకాశములు కల్పించి సాధికారతను పెంపొందించాలి.దేశంలో ఆర్థిక సంస్కరణలు అధికమయి అసంఘటి తరంగములోనే అనేక మందికి ఉపాధి,ఉద్యోగిత కల్పిస్తున్న దృష్ట్యా వారికి కావలసిన సాంకేతిక సాధనసంపత్తిని విరివిగా పెంపొందించేలా చర్యలు చేపట్టాలి.తద్వారా ఆర్థిక,సామాజికంగా అభివృద్ధి చెందుతూ తలసరి ఆదాయాల్లో పెరుగుదల మూలానా జీవన ప్రమాణములు మెరుగుపడతాయి.అప్పుడే యువకులు నవభారత నిర్మాతలు,నూతన ఆవిష్కర్తలు,సృష్టికర్తలుగా ఆవిర్భవించి భవిష్యత్ భారత్‌ను ఆవిష్కరిస్తారు.లేనిచో యువకులలో ఏర్పడిన అస్థిరత,నిరాశవాదముతో అశాంతి పెచ్చరిల్లి వినాశన సమాజమునకు కారకులయ్యే అవకాశముంది.కావున ప్రభుత్వాలు యువజన జనాభా సంపదను అభివృద్ధిలో ఉపయోగించుకోవడము పైననే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.యువకులు కూడా ఎవరోవచ్చి,ఏదో చేస్తారని ఎదురుచూడకుండా స్వయం శక్తితో ఎదుగుదలకు ప్రయత్నిస్తూ,ఆదర్శంగా నిలుస్తూ,పదుగురికి జీవనోపాధి కల్పించే భవిష్యత్ భారత్ ప్రతీకలుగా నిలుస్తూ శ్రమించాలి అప్పుడే నయా భారతం సాకారమవుతుంది.నిరంతరం వెలిగే సూర్యున్ని చూసి చీకటి భయపడుతుంది, నిరంతరం శ్రమించే వాడిని చూసి ఓటమి భయపడుతుంది అన్న వివేకానందుని సూక్తి సాక్షిగా దేశ యువజనులకు విద్యావంతులుగా తీర్చిదిద్దితేనే అభివృద్ధి అనే సూర్యుడు నిరంతరం వెలుగుతూ దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది అంతే కాకుండా మేలిమి మానవవనరులుగా యువజనాభాను మలిస్తేనే నిరాశవాదం,నిస్పృహ రూపు మాసిపోతూ దేశ ప్రగతికి యువకులు తమ వంతు భాగస్వామ్యాన్ని అందిస్తూ తాము ఆధునికంగా ముందడుగు వేస్తూ మరెందరికో స్ఫూర్తిప్రదాతలుగా నిలుస్తూ వివేకానందుని వారసులుగా దేశానికి ఖ్యాతిని, కీర్తిని సంపాదించిపెడుతారు.అందుకే ఉరకలెత్తుతున్న యువ జనాభాను ఉత్పత్తిలో భాగస్వాములను చేసే విధంగా ప్రభుత్వము స్కిల్ ఇండియా లాంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడనున్నాయి.దేశంలో ఆధునిక,సాంకేతిక విజ్ఞానము వ్యాప్తి విరివిగా పెరిగింది.వ్యవసాయ,పారిశ్రామిక మరియు సేవారంగాలలోనూ సాంకేతిక విజ్ఞానముతోనే ఉపాధి,ఉద్యోగావకాశాలు విరివిగా లభిస్తున్నాయి.అందుకు అనుగుణంగా యువతకు విద్యావకాశాలను పెంపొందించాలి.నేటికీ నిపుణుల కొరత వేధిస్తున్నది.మున్ముందు మరింత జటిలముకాకుండా ఉండేలామన విద్యావిధానం రూపొందించాలి.ఆధునిక సాంకేతిక విజ్ఞానముతోనే సమాజం ముడిపడి ఆర్థిక కార్యకలాపాలు కొనసాగుతున్న దృష్ట్యా అందుకు కావలసిన విధంగా యువజనాభాకు తీర్చిదిద్దేవిధంగా విద్యావిధానమును రూపొందించి, భవిష్యత్ ఆధునిక భారత్ నిర్మాతలుగా యువజనులను తీర్చిదిద్దేతేనే యువజనభారతం నవ భారత్‌గా నిర్మాణంగావించబడుతూ అభివృద్ధిలో అగ్రభాగాన దూసుకుపోతుంది.అప్పుడే యువత నవ భారత్ నిర్మాతలుగా జాతి నిర్ణేతలుగా నిలుస్తూ సమాజాన్ని మహోన్నతంగా నిలబెడతారు.

**జూపల్లి హరిప్రసాద్,**
**బాలసముద్రము,హన్మకొండ,జి.వరంగల్.**



# శతాబ్దాలు నిలిచే శిలలు!

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ప్రధాన ఆలయ విస్తరణ కోసం అద్భుతమైన శిల్పాలు రూపుదిద్దుకుంటున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా తట్టుకుని నిలబడేలా 2500 ఏండ్ల జీవితకాలం (లైఫ్‌టైమ్) మన్నేలా శిల్పాలు పురుడుపోసుకుంటున్నాయి. కళాకృతుల తయారీ టెండర్లను దక్కించుకున్న ఏపీలోని మూడు శిల్పకళాశాలల్లో సుందరంగా శిల్పాలు తయారవుతున్నాయి.

పాదం నుంచి శిఖరం వరకు పలు అంతస్తులుగా నిర్మాణం కానున్న శిలాశోభిత రాజగోపురాలతో 2.33 ఎకరాల్లో నాలుగు వైపులా యాదాద్రి మాడవీధులు కనువిందు చేయనున్నాయి. యాదాద్రి నుంచి వెళ్లిన విలేకరుల బృందం రెండురోజులపాటు గుంటూరు జిల్లాలోని కమ్మవారిపాలెం, కోటప్పకొండ, ప్రకాశం జిల్లాలోని మార్టూరు, కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో తయారవుతున్న పనుల తీరును పరిశీలించింది. సుమారు 500 మంది శిల్పులు ఈ అద్భుత శిల్పాల తయారీలో నిమగ్నమై రాత్రింబవళ్లు పని చేస్తున్నారు.

**కమ్మవారిపాలెం.. కృష్ణ పురుషశిలలు**

కృష్ణ పురుష శిలలకు 2500 ఏండ్లపాటు ఆయుష్షు ఉంటుందని చెన్నై ఐఐటీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం శిల్పాల మన్నికపై నియమించిన కమిటీ తేల్చింది. తర్వాతే కమ్మవారిపాలెం క్వారీలో లభించే కృష్ణ శిలలను ప్రభుత్వం ఎంపిక చేసింది. శ్రీకాళహస్తిలోని రాజగోపురం భారీ పిడుగుపాటుకు ధ్వంసమవగా, ఇక్కడి కృష్ణశిలతో పునర్నిర్మించారు. కమ్మవారిపాలెంలో మూడు రాజగోపురాల పనులు జరుగుతున్నాయి. 12 వేల చదరపు అడుగుల వైశాల్యంతో కూడిన బ్రహ్మోత్సవ ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి. యాదాద్రి పశ్చిమభాగంలో నిర్మాణం కానున్న ఏడంతస్తుల రాజగోపురం పనులు ఇక్కడే జరుగుతున్నాయి. దీనికి 64 వర్గాల(లేయర్లు)కు అవసరమైన శిల్పాలు రూపుదిద్దుకుంటున్నాయి. నాలుగైదు అంతస్తుల రాజగోపురాలు యాదాద్రిలో నిర్మాణం కానుండగా మూడు రాజగోపురాలకు అవసరమైన శిల్పాలు ఇక్కడే రూపుదిద్దుకుంటున్నాయి. ఒక్కో గోపురానికి 42 వర్గాల శిల్పాలు అవసరమవుతాయి.

**రాజగోపురాలు**

గుంటూరు జిల్లాలోని కమ్మవారిపాలెం క్వారీ నుంచి సేకరించే శిలలతో రాజగోపురాలు తయారవుతున్నాయి. రాజగోపురంలో 1) ఆధారాలు, 2) చిత్త వాహనం, 3) ఉప పీఠము, 4) అధిష్ఠానం, 5) స్తంభవర్గం, 6) ప్రస్తరము, 7) గోపురం భాగాలు ఉంటాయి.

**ఐదంతస్తుల రాజగోపురం**

ప్రకాశం జిల్లా మార్టూరులో ఐదంతస్తుల రాజగోపురం, బంగారుతాపడం చేయనున్న శ్రీవారి దివ్య విమానగోపురానికి అవసరమైన శిల్పాలు తయారవుతున్నాయి.

**ప్రాకార మండపం**

గుంటూరు జిల్లాలోని కోటప్పకొండ శిల్పకళాశాలలో యాదాద్రి ఆలయ ప్రాకార మండప శిల్పాలు తయారవుతున్నాయి.

**రాతి స్తంభాలు**

కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో 32 రాతి స్తంభాలు తయారవుతున్నాయి. వీటిలో ఆరు భాగాలు ఉంటాయి. 1) సింహ స్తంభం 2) బాలపాదం
3) చిత్రకంఠ స్తంభం 4) ఉప కంఠం 5) సౌరఛాయ 6) సాలహారం

**కోహెడలో ఐదు ఆలయాల శిల్పాలు**

గర్భాలయంలో నిర్మాణం చేయనున్న ఐదు ఆలయాలకు అవసరమైన శిల్పాలు రాజధాని శివారు హయత్‌నగర్ మండలం కోహెడలో తయారవుతున్నాయి. ఆండాల్ అమ్మవారి కోవెల, శ్రీలక్ష్మీదేవి కోవెల, ఆళ్వార్ ఆలయం, గరుడాలయం, ఆంజనేయస్వామి ఆలయానికి అవసరమైన శిల్పాలు ఇక్కడ కృష్ణశిలలతో తయారవుతున్నాయి. వీటికి కావాల్సిన ముడిసరుకు కమ్మవారిపాలెం క్వారీ నుంచే వస్తున్నట్లు వైటీడీఏ అధికారులు తెలిపారు.



# అసంఘటిత కార్మికులకు వరం
# అటల్ పింఛను యోజన (ఏపివై) పథకం







దేశంలో పింఛను సౌకర్యం లేనివారు ఎంతో మంది. వీరందరికి మలివయసులో ఆర్థికంగా సహాయం అందలేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి వారందరికి చేయూతనివ్వాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకమే అటల్ పింఛను యోజన (ఏపివై). మరి దీని విశేషాలేమిటో చూద్దామా!

పేద అసంఘటిత కార్మికుల ఉద్యోగ విరమణ అనంతరం వారి వృద్ధాప్యంలో ఆదాయ భద్రత కోసం జాతీయ పింఛను వ్యవస్థ (ఎన్‌పిఎస్) లో డబ్బు దాచుకునేలా భారత ప్రభుత్వం ఆలోచనల నుంచి ఈ పథకం పుట్టింది. అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులు ఎదుర్కొనే సుదీర్ఘ సమస్యల పరిష్కారం కోసం పదవి విరమణ అనంతరం ఆనందంగా జీవించేందుకు పనిచేసే వయస్సులో స్వచ్ఛందంగా పొదుపు చేసేలా ప్రోత్సహించడం దీని ముఖ్యోద్దేశం. 2011-12 లో నిర్వహించిన 66వ ఎన్ఎస్ఎస్ఓ సర్వే ప్రకారం 88 శాతం కార్మికులు అంటే సుమారు 47.29 కోట్ల మంది ఎలాంటి పింఛను సదుపాయం లేకుండా ఉన్నారు. అలాంటి వారికోసం 2010-11 లో స్వావలంబన్ పథకాన్ని ప్రారంభించింది. ఈ మేరకు స్వావలంబన్ పథకంలో 60 ఏళ్ళ వయస్సు వచ్చేసరికి ఖచ్చితంగా పింఛను సదుపాయం కల్పించబడుతుంది.

భారతీయులందరి కోసం భీమా మరియు పింఛను రంగాల్లో ఉత్తమమైన సామాజిక రక్షణ పథకాలను ప్రభుత్వం ప్రకటించింది. ప్రత్యేకించి పేదలకు దానిని హక్కుగా అందించేందుకు 2015-16 ఏడాది బడ్జెట్లో వివిధ పథకాలను ప్రవేశపెట్టింది. ఈక్రమంలోనే ప్రభుత్వం అటల్ పింఛను యోజనను (ఏపీవై) ప్రకటించింది. దీని ద్వారా నిర్ణీత సమయానికి చెల్లించిన మొత్తానికి తగినట్లు ఖచ్చితమైన పింఛన్ అందజేయబడుతుంది. అసంఘటిత రంగాల్లో పనిచేసే పౌరులందరికి కోసం ఈ పథకం రూపొందించబడింది. ఇది జాతీయ పింఛను వ్యవస్థను అనుసరించి భవిష్యనిధి నియంత్రణ మరియు అభివృద్ధి సంస్థ (పీఎఫ్ఆర్డీఏ) ద్వారా రూపొందించిన పథకం. ఏపీవై కింద ఖాతాదారులు నిర్దష్టమైన కనీస పింఛను నెలకు రూ.1000 నుండి రూ.5000 వరకు 60 ఏళ్ల వరకు వారు చెల్లించిన మొత్తం మీద ఆధారపడి చెల్లించబడుతుంది. ఇది ఏపీవైలో చేరే వయస్సుపై ఆధారపడి ఉంటుంది. ఏపీవైలో చేరేందుకు కనీస వయస్సు 18 సంవత్సరాలు మరియు గరిష్ట వయస్సు 40 సంవత్సరాలు. అందుకు అనుగుణంగానే ఏపీవైలో ఖాతాదారుడు చెల్లింపులు జరిపేందుకు కనీస కాలవ్యవధి 20 ఏళ్ళు అంతకంటే ఎక్కువ. నిర్దేశిత కనీసం పింఛను మొత్తానికి ప్రభుత్వం హామీ ఇస్తుంది. ఈపథకం 2015 మే 8న ప్రధానమంత్రి గారు ప్రారంభించడంతో జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.

**పథకం వలన ప్రయోజనం :-**

నిర్దేశిత పింఛను మొత్తం రూ. 1000 నుంచి రూ.5000 మధ్య ఉంటుంది. ఖాతాదారుడు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగినట్లైతే చెల్లించాల్సిన మొత్తాల్లో స్వల్ప మార్పుటుంటాయి.

**ఖాతాదారుడు**

చిన్న వయస్సులో చేరినట్లైతే చెల్లించాల్సిన మొత్తం తక్కువగానూ, వయస్సు పెరిగే కొద్ది ఎక్కువగానూ ఉంటుంది.



**పథకంలో చేరేందుకు అర్హత :-**

ఆటల్ పింఛను యోజన (ఏపీవై) లో అన్ని బ్యాంకుల ఖాతాదారులు చేరవచ్చు. ఐదేళ్ళ కాలవ్యవధికి చెల్లించే మొత్తంలో 50 శాతం లేదా ఏడాదికి రూ.1000 ఏది తక్కువైతే అది కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. 2015-16 నుంచి 2019-20 ఆర్థిక సంవత్సరాలలో అంటే ఖాతాదారులు ఎవరైతే 1 జూన్ 2015 నుంచి 31 డిసెంబర్ 2015 మధ్య కాలంలో చేరతారో, ఎవరైతే చట్టబద్ధమైన సామాజిక రక్షణ పథకాలు వర్తించని మరియు ఆదాయ పన్ను పరిధిలోకి రానివారికి ప్రభుత్వ చెల్లింపు అందుబాటులో ఉంటుంది. ఈతేదిల తర్వాత కూడా పథకం అమల్లో ఉంటుంది కానీ చెల్లింపుల్లో మాత్రం ప్రభుత్వం చెల్లింపు వుండదు.

విడతలవారీ చెల్లింపునకు పీఎఫ్ఆర్డీఏ (Pension Fund Regulatory and Development Authority) నిర్ణయించిందనే సమాచారాన్ని సెంట్రల్ రికార్డ్ కీపింగ్ ఏజెన్సీ ధ్రువీకరించగానే ఫీఎఫ్ఆర్డిఏ కేటాయించిన అర్హులైన ఖాతాలకు ప్రభుత్వం చెల్లింపులు చేస్తుంది.

**పథకంలో చేరేందుకు వయస్సు మరియు చెల్లింపుల కాలవ్యవధి:-**

ఏపీవైలో చేరేందుకు కనీస వయస్సు 18 సంవత్సరాలు మరియు గరిష్టంగా 40 సంవత్సరాలు. 60 ఏళ్ళ వయస్సు రాగానే పథకం నుంచి తప్పుకోవడంతో పాటు పింఛను మొదలవుతుంది. అందువల్ల ఏపీవై కింద చెల్లింపులు జరపడానికి కనీస వ్యవధి 20 సంవత్సరాలు అంత కంటే ఎక్కువ.

**ఏపీవై లక్ష్యం :**

ప్రధానంగా అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులే లక్ష్యం.

**నమోదు మరియు ఖాతాదారుడి చెల్లింపులు :**

అన్ని బ్యాంకుల ఖాతాదారులు ఏపీవైలో చేరేందుకు ఎవరైతే అర్హులో వారి ఖాతాల నుంచి ఆటో డెబిట్ సదుపాయం కలిగి ఉన్నట్లయితే కలెక్షన్ ఛార్జీలు తగ్గింపునకు దోహదం చేస్తుంది. అలాంటి ఖాతాదారులు తమ పొదుపు ఖాతాలో అవసరమైన నగదును గడువు తేదీల్లో నిల్వ ఉండేలా చూసుకుంటే అపరాధ రుసుమును నిరోధించవచ్చు. ఏపీవైలో జమచేసిన ప్రారంభ తేదిని అనుసరించి నెలవారీ చెల్లింపు గడువులు ఉంటాయి. నిర్ధేశించిన సమయంలో తరచూ చెల్లింపుల్లో విఫలమవుతూ ఉంటే ఖాతా మూసివేయబడుతుంది మరియు ప్రభుత్వం నుంచి అందే మొత్తం ఏదైనా నిలిపివేయబడుతుంది. ఈపథకంలో లబ్ధి పొందేందుకు ఏకారణం చేతనైన సరే అతడు లేదా ఆమె యొక్క వివరాల్లో ఏదైనా అసత్య సమాచారం అందించినచో ప్రభుత్వం నుంచి పొందిన మొత్తం చెల్లింపు, అపరాధ రుసుముతో కోల్పోతారు. నమోదు చేయించుకోవాలంటే లబ్ధిదారుడు, జీవిత భాగస్వామి మరియు నామినీల గుర్తింపునకు, భవిష్యత్‌లో తలెత్తే పింఛను సంబంధిత హక్కులు మరియు అర్హత సంబంధిత విభేదాలు రాకుండా చేసేందుకు ఆధార్ ఒక ముఖ్యమైన పత్రం. ఖాతాదారుల అవసరం మేరకు నెలవారి పింఛను మొత్తం రూ.1000 నుంచి రూ.5000 వరకూ మరియు క్రమం తప్పకుండా నిర్ధేశించిన నెలసరి మొత్తాన్ని చెల్లించాలి. అందుబాటులోని నెలవారీ పింఛను మొత్తాల మేరకు ఖాతాదారులు పింఛన్ల మొత్తాన్ని తగ్గించుకునేందుకు లేదా పెంచుకునేందుకు వీలుంది. ఈ మేరకు ఏడాదిలో ఒకసారి ఏప్రిల్ నెలలో ఈ సదుపాయం కల్పించబడినది. ప్రతి ఖాతాదారుడు ఏపీవైలో చేరిన తర్వాత సూచించన పింఛను మొత్తం, భాగస్వామ్యం, చెల్లించాల్సిన గడువు తేది, ప్రాన్, ఇతరములు ముద్రించిన రసీదు పత్రం అందజేయబడుతుంది.

**నమోదు చేసే సంస్థలు :**

జాతీయ పింఛను వ్యవస్థ కింద పనిచేసే అందుబాటులోని అన్ని కేంద్రాలు (అధీకృత సేవా కేంద్రాలు) మరియు స్వావలంబన్ పథకంలో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు బ్యాంకులు, సంస్థలు, నాన్ బ్యాంకింగ్ సంస్థలు, సూక్ష్మ రుణసంస్థల ఏజెంట్లు, మ్యూచువల్ ఫండ్ ఏజెంట్లు కార్యనిర్వహణకు సిద్దంగా ఉంటారు. ఫీఎఫ్ఆర్డీఏ లేదా ప్రభుత్వం నుంచి అందుకున్న ప్రోత్సాహకాలను లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుంది.

**ఏపీవై నిర్వహణ విధానం :**

ఇది భారత ప్రభుత్వం యొక్క పథకం. భవిష్యనిధి నియంత్రణ

**అటల్ పింఛను యోజన కింద ఖాతాదారులు రూ.1000 నెలవారీ పింఛను కోసం చెల్లించాల్సిన మొత్తం, ఖాతాదారుడు మరియు అతని జీవిత భాగస్వామి మరియు నామినీకి చెల్లించే నగదు మొత్తం, చెల్లింపు స్థాయి తెలిపే పట్టిక.**

| ప్రవేశ వయస్సు | చెల్లింపు గడువు (సంవత్సరాల్లో) | నెలవారీ చెల్లింపుల పట్టిక (రూపాయల్లో) | ఖాతాదారుడు మరియు అతని జీవిత భాగస్వామి నెలవారీ పొందే పింఛను (రూపాయల్లో) | ఖాతాదారుడి నామినీ పొందే నగదు మొత్తం పట్టిక (రూపాయల్లో) |
|---|---|---|---|---|
| 18 | 42 | 42 | 1,000 | 1.7 లక్షలు |
| 20 | 40 | 50 | 1,000 | 1.7 లక్షలు |
| 25 | 35 | 76 | 1,000 | 1.7 లక్షలు |
| 30 | 30 | 116 | 1,000 | 1.7 లక్షలు |
| 35 | 25 | 181 | 1,000 | 1.7 లక్షలు |
| 40 | 20 | 291 | 1,000 | 1.7 లక్షలు |

అటల్ పింఛను యోజన కింద ఖాతాదారులు రూ.2000 నెలవారీ పింఛను కోసం చెల్లించాల్సిన మొత్తం, ఖాతాదారుడు మరియు అతని జీవిత భాగస్వామి మరియు నామినీకి చెల్లించే నగదు మొత్తం, చెల్లింపు స్థాయి తెలిపే పట్టిక.

| ప్రవేశ వయస్సు | చెల్లింపు గడువు (సంవత్సరాల్లో) | నెలవారీ చెల్లింపుల పట్టిక (రూపాయల్లో) | ఖాతాదారుడు మరియు అతని జీవిత భాగస్వామి నెలవారీ పొందే పింఛను (రూపాయల్లో) | ఖాతాదారుడి నామినీ పొందే నగదు మొత్తం పట్టిక (రూపాయల్లో) |
|---|---|---|---|---|
| 18 | 42 | 84 | 2,000 | 3.4 లక్షలు |
| 20 | 40 | 100 | 2,000 | 3.4 లక్షలు |
| 25 | 35 | 151 | 2,000 | 3.4 లక్షలు |
| 30 | 30 | 231 | 2,000 | 3.4 లక్షలు |
| 35 | 25 | 362 | 2,000 | 3.4 లక్షలు |
| 40 | 20 | 582 | 2,000 | 3.4 లక్షలు |

మరియు అభివృద్ధి మండలి ద్వారా నిర్వహించబడుతుంది. జాతీయ పింఛను వ్యవస్థకు చెందిన సంస్థాగత నిర్మాణం ద్వారా ఏపీవైలో నమోదు చేయబడతారు. ఏపీవైలో నమోదు పత్రంతో పాటు ఖాతా ప్రారంభించడం సహా అన్నీ పీఎఫ్ఆర్డీఏ సూచనల మేరకు జరగుతాయి.

**ఏపీవైకి నిధులు సమకూర్చడం:**

ప్రభుత్వం సమకూర్చేవి (1) ఖాతాదారులకు నిర్దేశిత పింఛను హామీ అందచేయబడుతుంది (2) అర్హులైన ఖాతాదారులు చెల్లించే మొత్తంలో 50 శాతం లేదా ఏడాదికి రూ. 1000 ఏది తక్కువైతే అది చెల్లిస్తుంది మరియు (3) ప్రజలు ఏపీవైల చేరేందుకు కృషిచేసిన సంస్థలకు ప్రోత్సాహకాలను అందజేస్తుంది.

**స్వావలంబన్ లబ్ధిదారులు ఏపీవైలోకి మార్చబడటం :**

స్వావలంబన్ ఖాతాదారుడు అర్హుడైనట్లయితే ఏపీవై పథకంలోకి వారి అంగీకారంతో మార్చబడుతుంది. అంటే స్వావలంబన్ ఖాతాదారుడు ఎవరైతే ఉన్నారో వారికి ఐదేళ్ళపాటు ఏపీవై పథకం కింద ప్రభుత్వం చెల్లింపు లభిస్తుంది. అంటే ఇప్పటికే ఒక ఏడాది ప్రభుత్వం భాగస్వామ్యం పొందిఉంటే మిగిలిన 4 సంవత్సరాలకు ఈ పథకం వర్తిస్తుంది. స్వావలంబన్ లబ్ధిదారులకు ఏపీవై పథకంలో ప్రభుత్వ చెల్లింపు 2016-17 వరకు అందించబడుతుంది. అర్హులైన వారికి జాతీయ పంఛను పథకం ప్రకారం మరియు స్వావలంబన్ పథకం నిబంధనల ప్రకారం వయోపరిమితి మేరకు కొనసాగించబడుతుంది.

స్వావలంబన్ పథకంలోని 18-40 ఏళ్ళ మధ్యనున్న ఖాతాదారులు అభ్యంతరం వ్యక్తచేయకుంటే ఏపీవైలోకి మార్చబడతారు. కొత్త పథకంలోనికి ఇబ్బందులు లేకుండా మార్చేందుకు అలాంటి ఖాతాదారులకు సంబంధిత వ్యక్తుల నుంచి సహాయ సహాకారాలు అందించబడతాయి. అలాంటి ఖాతాదారులు దగ్గరలోని అధీకృత బ్యాంకు శాఖను సంప్రదించి వారి యొక్క స్వావలంబన్ ఖాతాను ప్రాన్ వివరాలతో ఏపీవైకి మార్చుకోవచ్చు.

40 ఏళ్ళు పైబడిన స్వావలంబన్ ఖాతాదారులు ఈపథకంలో కొనసాగేందుకు ఆసక్తి చూపించకపోతే మొత్తం పెట్టుబడిని వెనక్కి తీసుకోవచ్చు. 40 ఏళ్ళు పైబడిన ఖాతాదారులు ఈ పథకంలో కొనసాగేందుకు ఆసక్తి కలిగి ఉన్నట్లయితే వారు 60 సంవత్సరాలు వచ్చే వరకూ కొనసాగి అన్ని సదుపాయాలు పొందవచ్చు.

**సక్రమంగా చెల్లించనందుకు అపరాధ రుసుము:**

ఏపివై కింద నమోదు చేసుకున్న వ్యక్తిగత ఖాతాదారులు నెలవారి చెల్లింపులు చేసేందుకు అవకాశం కలిగి ఉంటారు. ఆలస్యంగా జరిపే చెల్లింపులకు బ్యాంకులు అదనపు సొమ్ము వసూలు చేయాల్సి ఉంటుంది. ఆమొత్తం నెలకు రూ. 1నుంచి రూ. 10 వరకు కింద చూపిన విధంగా ఉంటుంది.

- చెల్లింపు నెలకు రూ. 100 వరకు నెలకు రూ. 1
- చెల్లింపు నెలకు రూ. 101 నుంచి 500 వరకు నెలకు రూ. 2
- చెల్లింపు నెలకు రూ. 501 నుంచి 1000 వరకు నెలకు రూ. 5
- చెల్లింపు నెలకు రూ. 1001కి పైబడి నెలకు రూ. 10. ఖాతాదారుడి పింఛనులో వడ్డీ /అపరాధ రుసుము నిర్ణీత మొత్తంలో భాగంగా ఉంటాయి. చెల్లింపులు నిలిపివేసినట్లయితే పరిణామాలు ఈక్రింది విధంగా ఉంటాయి.
- 6 నెలల తర్వాత ఖాతా స్తంభింబడుతుంది.
- 12 నెలల తర్వాత ఖాతా రద్దుచేయబడుతుంది.
- 24 నెలల తర్వాత ఖాతా మూసివేయబడుతుంది.

**ఆలస్యంగా జరిపే చెల్లింపులకు అదనపు సొమ్ము స్వీకరణ:-**

ఏపీవై విధానంలో గడువు తేదీలోపు ఖాతాదారుడి ఖాతా నుంచి చెల్లింపు జరుగుతుంది. ప్రతి ఖాతాదారుడి యొక్క నెలవారీ చెల్లింపునకు గడువు తేదీ నెలలో మొదటి రోజు లేదా నెలలో మరే ఇతర రోజైనా కావచ్చు. ఖాతాలో నిధుల లభ్యత ఆధారంగా నెలలో ఎప్పుడైనా ఇది జరుగుతుంది. నెలవారీ చెల్లింపులు ఎఫ్ఐఎఫ్ఓ (బకాయిల ప్రాధాన్యత) ఆధారంగా తీసుకోబడతాయి. ముందస్తు

అటల్ పింఛను యోజన కింద ఖాతాదారులు రూ.3000 నెలవారీ పింఛను కోసం చెల్లించాల్సిన మొత్తం, ఖాతాదారుడు మరియు అతని జీవిత భాగస్వామి మరియు నామినీకి చెల్లించే నగదు మొత్తం, చెల్లింపు స్థాయి తెలిపే పట్టిక.

| ప్రవేశ వయస్సు | చెల్లింపు గడువు (సంవత్సరాల్లో) | నెలవారీ చెల్లింపుల పట్టిక (రూపాయల్లో) | ఖాతాదారుడు మరియు అతని జీవిత భాగస్వామి నెలవారీ పొందే పింఛను (రూపాయల్లో) | ఖాతాదారుడి నామినీ పొందే నగదు మొత్తం పట్టిక (రూపాయల్లో) |
|---|---|---|---|---|
| 18 | 42 | 126 | 3,000 | 5.1 లక్షలు |
| 20 | 40 | 150 | 3,000 | 5.1 లక్షలు |
| 25 | 35 | 226 | 3,000 | 5.1 లక్షలు |
| 30 | 30 | 347 | 3,000 | 5.1 లక్షలు |
| 35 | 25 | 543 | 3,000 | 5.1 లక్షలు |
| 40 | 20 | 873 | 3,000 | 5.1 లక్షలు |

**అటల్ పింఛను యోజన కింద ఖాతాదారులు రూ.4000 నెలవారీ పింఛను కోసం చెల్లించాల్సిన మొత్తం, ఖాతాదారుడు మరియు అతని జీవిత భాగస్వామి మరియు నామినీకి చెల్లించే నగదు మొత్తం, చెల్లింపు స్థాయి తెలిపే పట్టిక.**

| ప్రవేశ వయస్సు | చెల్లింపు గడువు (సంవత్సరాల్లో) | నెలవారీ చెల్లింపుల పట్టిక (రూపాయల్లో) | ఖాతాదారుడు మరియు అతని జీవిత భాగస్వామి నెలవారీ పొందే పింఛను (రూపాయల్లో) | ఖాతాదారుడి నామినీ పొందే నగదు మొత్తం పట్టిక (రూపాయల్లో) |
|---|---|---|---|---|
| 18 | 42 | 168 | 4,000 | 6.8 లక్షలు |
| 20 | 40 | 198 | 4,000 | 6.8 లక్షలు |
| 25 | 35 | 301 | 4,000 | 6.8 లక్షలు |
| 30 | 30 | 462 | 4,000 | 6.8 లక్షలు |
| 35 | 25 | 722 | 4,000 | 6.8 లక్షలు |
| 40 | 20 | 1164 | 4,000 | 6.8 లక్షలు |

తీసుకునేందుకు అనుమతిస్తారు, లేకుంటే ముందస్తు చెల్లింపు అనుమతించబడదు.

**చేరేందుకు వయస్సు, భాగస్వామ్యపు స్థాయిలు, నిర్దేశిత నెలవారీ పంఛను మరియు ఖాతాదారుని నామినీకి నగదు చెల్లింపులు :-**

భాగస్వామ్యపు చెల్లింపు స్థాయిల పట్టిక, ఖాతాదారుడు మరియు అతని జీవిత భాగస్వామికి నిర్దేశిత కనీస నెలవారీ పింఛను మరియు వారి నామినీకి నగదు చెల్లింపునకు చెల్లించాల్సిన మొత్తం కాలపరమితి క్రింది పట్టికలో ఇవ్వబడినది. ఉదాహరణకు. 18 ఏళ్ళ వయస్సులో ఖాతాదారుడు చేరినట్లైతే రూ. 1000 పింఛను పొందేందుకు నెలకు రూ. 42 మరియు గడువులోపు చెల్లించాల్సిన మొత్తం చార్జీలతో ముందు తీసుకోబడుతుంది.

నెలకంటే ఎక్కువ చెల్లింపులు బకాయి ఉన్నట్లయితే నిధుల లభ్యత ఆధారంగా తీసుకోబడతాయి లేనట్లయితే నెలవారీ చెల్లింపు నిర్దేశిత మొత్తం ద్వారా తీసుకోబడుతుంది. అన్ని వ్యవహారాల్లోనూ చెల్లింపులు నిర్దేశిత చార్జీలతో స్వీకరించబడతాయి. ఇదంతా బ్యాంకుల అంతర్గత వ్యవహారంలో భాగంగా జరుగుతుంది. ఖాతాల నిధుల లభ్యత ఆధారంగా బకాయి సొమ్ము తిరిగి తీసుకోవడం జరుగుతుంది.

**ఏపీవై కింద భాగస్వామ్యపు పెట్టుబడులు :-**

ఏపీవై కింద సేకరించిన సొమ్మును ప్రభుత్వం సూచించిన పెట్టుబడుల విధానం మేరకు పీఎఫ్ఆర్డీఏ నియమించిన పింఛనుల సంస్థ నిర్వహిస్తుంది. ఖాతాదారుడు పెట్టుబడుల విధానంలో కానీ పింఛను నిధుల్లోకానీ జోక్యం చేసుకునేందుకు ఎలాంటి అవకాశం ఉండదు.

**ఖాతాదారులకు నిరంతరం సమాచారం :-**

ఖాతాలో నగదు నిల్వకు సంబంధించిన సమాచారం, చెల్లింపుల వివరాలు అన్నీ దశలవారీగా ఏపీవై ఖాతాదారులకు సంక్షిప్త సందేశాలు (SMS) రూపంలో తెలియజేయబడతాయి, ఖాతాదారులు ఆర్థికఅంశాలు కాని నామినీ పేరు , చిరునామా, ఫోన్ నెంబరు ఇతర వివరాలు అవసరమైతే మార్చుకునే అవకాశముంటుంది.

ఏపీవై ఖాతాదారులకు ఖాతా ప్రారంభ సమయంలో అందజేసిన మొబైల్ నెంబరుకు చెల్లింపుల సమాచారం, వారి ఖాతాలో నగదునిల్వ వివరాలు దశలవారీగా సంక్షిప్త సందేశం (SMS) ద్వారా తెలియజేయబడుతుంది.

**నిష్క్రమణ మరియు పింఛను చెల్లింపు :**

60ఏళ్ళు పూర్తయిన తర్వాత ఖాతదారులు తమకు రావలసిన నెలవారీ పింఛను పొందేందుకు బ్యాంకులో అభ్యర్థన పత్రాన్ని ఇవ్వాలి. కొన్ని ప్రత్యేక సందర్భాలు అంటే లబ్ధిదారుడు మరణిస్తే లేదా నయంకాని వ్యాదితో బాధపడుతున్నట్లైతే 60ఏళ్ల కంటే ముందే పింఛను మొత్తాన్ని

**అటల్ పింఛను యోజన కింద ఖాతాదారులు రూ.5000 నెలవారీ పింఛను కోసం చెల్లించాల్సిన మొత్తం, ఖాతాదారుడు మరియు అతని జీవిత భాగస్వామి మరియు నామినీకి చెల్లించే నగదు మొత్తం, చెల్లింపు స్థాయి తెలిపే పట్టిక.**

| ప్రవేశ వయస్సు | చెల్లింపు గడువు (సంవత్సరాల్లో) | నెలవారీ చెల్లింపుల పట్టిక (రూపాయల్లో) | ఖాతాదారుడు మరియు అతని జీవిత భాగస్వామి నెలవారీ పొందే పింఛను (రూపాయల్లో) | ఖాతాదారుడి నామినీ పొందే నగదు మొత్తం పట్టిక (రూపాయల్లో) |
|---|---|---|---|---|
| 18 | 42 | 210 | 5,000 | 8.5 లక్షలు |
| 20 | 40 | 248 | 5,000 | 8.5 లక్షలు |
| 25 | 35 | 376 | 5,000 | 8.5 లక్షలు |
| 30 | 30 | 577 | 5,000 | 8.5 లక్షలు |
| 35 | 25 | 902 | 5,000 | 8.5 లక్షలు |
| 40 | 20 | 1,454 | 5,000 | 8.5 లక్షలు |

రూ. 5000 పింఛను పొందేందుకు నెలకు రూ. 210 చెల్లించాలి. ఇదే నిర్దేశిత పంఛను స్థాయి కోసం 40 ఏళ్ళ వ్యక్తి నెలకు రూ. 291 మరియు రూ. 1454 చెల్లించాల్సి ఉంటుంది.

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలు రైతుకూలీలు మరియు కార్మికుల అభ్యున్నతి కోసం అనేక భీమా పథకాలను ప్రవేశపెడుతూవుంది. నిధులలేమితో కొట్టుమిట్టాడే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రభుత్వనిధులకోసం ఎదురుచూడకుండా తమనిధులతో సంబంధం లేని ఇలాంటి పథకాలపట్ల అవగాహన పెంచుకొని వారివారి గ్రామాల పరిధిలోని ప్రజలను చైతన్యపరచి అవసరమైన వారిని ఇటువంటి పథకాల ద్వారా ఆదుకుంటే వారు జీవితాంతం ఆయొక్క ప్రజాప్రతినిధుల సేవలను గుర్తించుకుంటారనటంలో ఎటువంటి సందేహం లేదు.

**జి. జయపాలరెడ్డి,**
సి. ఇ. ఓ జడ్పి (విశ్రాంత),
సలహాదారుడు, సి. ఎన్. ఆర్. ఎమ్.
సెంటర్ హెడ్ & డిప్యూటీ డైరెక్టర్, టిఎస్ఐఆర్డి



# యువత - దేశ భవిత

ప్రస్తుతం మన భారత దేశంలో నెలకొని ఉన్న పరిస్థితులను పరిశీలిస్తే ప్రాశ్చాత్య సంస్కృతి నాగరికతను అనుకరిస్తూ యువత జీవిత లక్ష్యం ఏమిటో జీవిత గమ్యం ఏమిటో తెలియక తమ శక్తియుక్తులను నిరూపయోగం చేసుకుంటూ నిరాశ నిస్పృహలకు గరి అవుతున్నారు. యువత తమకంటూ ఒక ఆదర్శం లేకుండా కొట్టుమిట్టాడుతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దాలంటే వారికి ఒక మార్గదర్శక సందేశాన్నివ్వాలి ఒక స్ఫూర్తిదాయక జీవితాన్ని వారికి పరిచయం చేయాలి. ఆయనే దేశ యువతలో ఆత్మ విశ్వాసాన్ని ఆత్మస్తర్యాన్ని నింపి వారిని ప్రగతి పథంలో ముందుకు నడిపించి నవజాతి నిర్మాణానికి గట్టి పుణాది వేయగల ఆశాజ్యోతి భారత మాత ముద్దు బిడ్డ..... విశ్వవిజేత...... యువనాయక...... వీరకిశోరా.... వేదాంత సింహా..... స్వామి వివేకనందా.

**వివేకనందా జీవితము :-**

స్వామి వివేకనందా అసలు పేరు నరేంద్రనాథ్ దత్తా (నరెన్) ఈయన 1863 జనవరి 12న కలకత్తా నగరంలో విశ్వనాథ్ దత్తా, భువనేశ్వరీ దేవి దంపతులకు జన్మించారు. నరేంద్రుడు చిన్న నాటి నుండి ఆద్యాత్మికత అంటే ఎంతో ఇష్టం. చదువుల్లో, ఆటల్లో, సంగీతంలో ఎంతో నిష్ణాతుడిగా ఎదగసాగాడు.

రామక్రిష్ణ పరమహంస గారితో పరిచయం ఏర్పడిన తరువాత నరేంద్రుడు ఆధ్యాత్మిక ప్రపంచంలో లీనమైపోయాడు. ఆయనకు ప్రియ శిశ్యుడిగా మారిపోయాడు. రామక్రిష్ణ పరమహింస మరణం తరువాత నరేంద్రుడు తనకు తానుగా " స్వామి వివేకనందాగా ప్రకటించుకొని గొప్ప ఆధ్యాత్మిక వేత్తగా ఎదిగాడు.

1893 వ సం॥లో చికాగో నగరంలో జరిగిన విశ్వమత మహాసభలో నా అమెరికా దేశ సోదరా, సోదరీమనులారా అంటూ అమెరికా దేశ ప్రజలను తన ప్రసంగంలో మంత్ర ముగ్దులను చేశాడు. భారతదేశంపై వారికి గల అభిప్రాయాన్ని మార్చి వారి మనస్సులో భారతదేశాన్ని గొప్పగా భావించేలా చేశాడు.

భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత తన అద్భుతమైన వాగ్దాటితో, ప్రసంగాలతో భారతదేశ సంస్కృతిని, వారసత్వ సంపదను గూర్చి ప్రజలకు తెలియజేసి వారిలో చైతన్యాన్ని నింపాడు. ఆత్మ విశ్వాసాన్ని ఆశవాహ దృక్పథాన్ని పెంపొందించి అనగారిన జనులను ఉద్ధరించాల్సిన తక్షణ అవసరాన్ని తెలియజేశారు. ఆదునిక భారతంలో పేదల అభ్యున్నతికై పాటు పడమని భోధించిన విశ్వజనని ఆదర్శ పురుషుడే వివేకనంద. ఆయన జీవిత కాలం 39 సం॥రాల ఆరు నెలలు. ఇంతటి స్వల్ప జీవితంలోనే ఆయన ఎంతో సాధించారు. మానవాళి సంక్షేమానికి, అభ్యున్నతికి అధ్యాత్మికోన్నతికి కృషి చేసిన భారతదేశం గర్వించదగ్గ ఆధ్యాత్మిక వేత్తగా చరిత్రలో తన స్థానాన్ని చిరస్థాయిగా నిలుపుకున్నారు.

**యువతకు సందేశం :-**

ఓ నా వీర హృదయుడా ! మీరందరూ ఆత్మ విశ్వాసం కలిగి ఉండాలి. గొప్ప విశ్వాసాల నుండే మహత్తర కార్యాలు సాధించబడతాయి. ఆత్మ విశ్వాసం ఉన్న కొందరి వ్యక్తుల చరిత్ర ప్రపంచ చరిత్ర. ఆ విశ్వాసం వ్యక్తిలోని దైవత్వాన్ని వ్యక్త పరుస్తుంది. మీరు ఏదైనా సాధించగలరు. ఆ అనంత శక్తి అభివ్యక్తం చేయడానికి చేయవలసినంత ప్రయత్నం చేయనప్పుడు మీరు విఫలం అవుతారు. ఎప్పుడైతే మనిషిలో నమ్మకం సన్నగిల్లుతుందో అప్పుడు మరణం ఆసన్నమౌతుంది. మీపై మీకు విశ్వాసం కోల్పోవడం అంటే భగవంతుడిపై విశ్వాసం కోల్పోవడమే. ఇప్పటి యువత పైన నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. వారి నుండి నా కార్యనిర్వాహకులు రాగలరు. సింహం వలె వారు నా సమస్యనంతటిని పరిష్కరిస్తారు. ఒక ఆదర్శాన్ని నిర్మించుకొని దానికై మీ జీవితం అంకితం చేయండి.

మొదట మన యువకులు బలిష్టులు కావాలి. ! ముఖ్యంగా నా యువ సోదరులకు చేసే విజ్ఞప్తి ఇదే. మనకు కావలసింది బలం ఆత్మవిశ్వాసం కాబట్టి మీ నరాలను దృడపరచుకోండి. మనకు ఇనుప కండలు ఉక్కు నరాలు ఉన్నప్పుడు భగవత్ గీత పారాయనం కన్నా "ఫుట్‌బాల్" ఆటనే మిమ్మల్ని మోక్ష మారానికి తీసుకువెళుతుంది. పట్టుదల వదలకుండా చేసే ప్రయత్నం చివరకు విజయాన్ని చేకూరుస్తుంది.

ఒక్క రోజులో దేనిని సాధించలేము. వెనక్కు చూడవలసిన పనిలేదు. పరోగమించండి మనకు కావాలసిన శక్తి, పట్టుదల , ధైర్యం




మరియు అనంత సహనం ఉన్నప్పుడే మహాకార్యాలు సాధించబడతాయి. లేచి నిలబడు ధైర్యంగా బలిష్టంగా ఉండు మొత్తం భాద్యతనంతా నీ భుజస్కంధాల మీదనే వేసుకో నీ భవిష్యత్తుకు నీవే భాద్యుడవని తెలుసుకో నీకు కావలసిన బలం, శక్తి అన్ని నీలోనే దాగి ఉన్నాయి. మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించండి. బలహీనపరిచే ప్రతి ఆలోచనను తిరస్కరించండి.

అపజయాలను లక్ష్యపెట్టకండి. అవి వాటిల్లడం సహజం అపజయాలు జీవితానికి అలంకారప్రాయాలు. ఇవి లేని జీవితం ఒక జీవితమేనా ? పోరాడటానికి సంసిద్ధం చేసేవి ఈ అపజయాలే కదా ! ఇవి మీ జీవిత సౌరభాలు. కాబట్టి ఈ పొరపాట్లను పోరాటాలను లక్షించవద్దు. అపజయాలచే నిరుత్సాహపడకండి. లక్ష్యసిద్ధికై వెయ్యి సార్లు ఓటమి వాటిల్లినా ఇంకొక్కసారి మళ్ళి ప్రయత్నించండి.

మీరు నిజంగా ఒక లక్ష్యసాధన కోసం జీవిస్తే మీరు దేనికి భయపడరు. ఎక్కడ ఆగిపోరు మీరు సింహల్లా ఉంటారు. మనం భారతదేశాన్ని ప్రపంచాన్ని జాగృతం చేయాల్సి ఉంది. నా యువకులారా మీ లక్ష్యసిద్ధి కోసం అవసరమైతే అగ్నిలో దూకడానికైనా సంసిద్ధులు కండి లేవండి ! మేల్కోండి ! గమ్యం చేరేవరకు విశ్రమించకండి.

**దోడ్డి కుమార్ జూకల్,**
**శంషాబాద్, రంగారెడ్డి జిల్లా**



# వివేకనందా సూక్తులు

**మొదట మీరు పవిత్రుల కండి. ప్రపంచం అంతా పవిత్రంగా కనబడుతుంది.**

**ఇసుమంత ఆచరణ, ఇరవై వేల టన్నుల వ్యర్థమైన మాటలతో సమానం.**

**మీరెలా ఆలోచిస్తే అలాగే తయారు అవుతారు. బలహీనులమని భావిస్తే బలహీనులే అవుతారు, శక్తిని స్మరిస్తే శక్తి మంతులు అవుతారు.**

**మానవుడు ఎంత గొప్పవాడైతే, అంత కఠనమైన పరీక్షలను ఎదుర్కొవలసి ఉంటుంది.**

**నిరు పేదల కష్టాలను చూసి ద్రవించే హృదయం కలవాడే మహాత్ముడు.**

**సత్యానికి దేనినైనా త్యజించవచ్చు కాని దేని కొరకైన సత్యాన్ని త్యజించకూడదు.**

**మీలోని దివ్యత్వాన్ని పెంపొందొంచేది పుణ్యం, పాశవికతను పెంచేది పాపం.**

**స్వర్గంలో జీవించడానికి ఈ ప్రపంచంలో జీవించడానికి తేడా లేదు.**

**అపజయాలను లక్ష్య పెట్టకండి, అవి వాటిల్లడం సహజం, అవి జీవితానికి అందం చేకూరుస్తాయి.**

**నీవు ఏ పరిస్థితులలో ఉన్నా నీ కర్తవ్యం నీకు గుర్తుంటే జరగవలసిన పనులు అవే**

# ఒంటరి స్త్రీలకు వెయ్యి రూపాయల జీవన భృతి పథకం

ఒంటరి జీవితాన్ని గడుపుతున్న మహిళలు రాష్ట్రంలో రెండు నుండి మూడు లక్షల వరకు ఉంటారు. పేదరికం పురుషుల కన్నా మహిళలను మరింతగా వేధిస్తుంది. నిస్సహాయులైన ఆ మహిళలకు నెలకు వెయ్యి రూపాయల పింఛను అందిస్తుంది. మన తెలంగాణ ప్రభుత్వం ఖజానాపై భారాన్ని లెక్క చేయకుండా మానవీయ కోణంలో దీన్ని అమలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

రాష్ట్రంలోని ఒంటరి మహిళలకు జీవన భృతి కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం సరి కొత్త సంక్షేమ పథకాన్ని అమలు చేస్తుంది. అదే ఒంటరి మహిళలకు జీవనభృతి పథకం. ఈ పథకం కింద సుమారు మూడు లక్షల మంది ఒంటరి మహిళలు ఆర్థిక ప్రయోజనం పొందుతున్నారు. తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం అభించాలనీ, సామాజిక వర్గాలన్నీ ఆర్థిక స్థోమతతో, ఆత్మగౌరవంతో జీవించాలనీ, దీని కోసం తెలంగాణ ప్రజల జీవికను పరిపుష్టం చేయాలనే ఆశయంతో తెలంగాణ ప్రభుత్వం ఈ పథకానికి రూపకల్పన చేసింది.

తెలంగాణ ప్రభుత్వం పరిపాలనలో అడుగడుగునా మానవీయ కోణాన్ని ఆవిష్కరిస్తుందనడానికి ఈ పథకమే నిదర్శనం. ప్రభుత్వం బడ్జెట్లో సింహభాగం సంక్షేమ రంగానికి కేటాయించింది. ప్రభుత్వం పేదల పక్షం వహించిందనేదానికి నిదర్శనంగా అనేక కార్యక్రమాలను అమలు జరుపుతుంది. పేదల పక్షం. పేదల కోసం అనే లక్ష్య సాధనతో గత రెండున్నర సంవత్సరాలుగా పాలకులు ముందుకు సాగుతున్నారు. రాజకీయ పార్టీలు చాలా వరకు మ్యానిఫెస్టోలో ఉన్న నిర్ణయాల అమలుకే పరిమితం అవుతాయి. కాని తెరాస ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రస్తావించకపోయినా పేదలు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమైనా దృష్టికి వచ్చిందే తడవుగా వెంటనే వాటి పరిష్కారం కోసం నిర్ణయాలు తీసుకుంటుంది.

తెరాస ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగానే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆసరా పేరుతో పెద్ద ఎత్తున పెన్షన్లు మంజూరు చేస్తుంది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మహిళలు బీడిలు చుట్టి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఎంత శ్రమించినా వారు తమ జీవనావసరాలకు తగినంత ఆదాయం పొందలేకపోతున్నారు. వారి కష్టాలను గమనించిన ప్రభుత్వం బీడి కార్మికులకు నెల నెలా వెయ్యి రూపాయల జీవన భృతిని ఇస్తుంది. గతంలో ఉద్యమాలు చేసినా తమకు న్యాయం దక్కలేదు. కాని తెలంగాణ రాష్ట్రంలో తెరాస ప్రభుత్వం తామెవ్వరం అడగక ముందే తమకు న్యాయం చేసింది అని బీడి కార్మికులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పేద కుటుంబాల ఆడపిల్లల పెండ్లి ఖర్చు కోసం తల్లీదండ్రులు పడుతున్న బాధలను సానుభూతితో అర్థం చేసుకున్న తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టింది. ఈ పథకాల ద్వారా వేలాది కుటుంబాలకు ఆడ పిల్లల పెండ్లీల కోసం రూ. 51 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందచేస్తుంది. ఈ పథకాల మాదిరిగానే మ్యానిఫెస్టోలో పేర్కొనకపోయినప్పటికీ ఒంటరి మహిళల కష్టాలను



తీర్చడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. ఒంటరి మహిళలకు జీవన భృతి అందించే విధంగా చర్యలు తీసుకుంది.

ఒంటరి స్త్రీలకు ప్రతి నెలా వెయ్యి రూపాయలు జీవన భృతి పథకం 2017-18 ఆర్థిక సంవత్సరం నుండి అమలులోకి తెచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఒంటరి మహిళలు తమ పేర్లను ప్రభుత్వం గుర్తించింది. శాసనసభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించి అసలైన ఒంటరి స్త్రీలు మాత్రమే ఆర్థిక సహాయం పొందే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. పథకంలో లబ్ధిదారుల పేర్లను నమోదు చేసే బాధ్యతలను శాసనసభ్యులు కూడా స్వీకరించాలని ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు కోరారు. ప్రభుత్వం ప్రకటించిన ఈ కొత్త పథకాన్ని అన్ని వర్గాలు స్వాగతించాయి. ఒంటరి మహిళలను గుర్తించడం, వారికి ఆర్థిక తోడ్పాటు కల్పించడంతో ప్రభుత్వ మానవీయ కోసం మరింత ఇనుమడించింది. అన్ని వర్గాలకు అండగా ఉంటామనే సంకేతాలు ప్రభుత్వం నుండి వెలువడటం హర్షనీయ పరిణామంగా అంతా భావిస్తున్నారు.

రాష్ట్రంలో 30 ఏళ్లకు పైబడి పెళ్లి కాకుండా ఒంటరిగా జీవిస్తున్న సుమారు 1 లక్షా 16 వేల మంది మహిళలను 2014లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో అధికారులు గుర్తించారు. వారి వివరాలన్ని గ్రామాల వారిగా రికార్డుల్లో భద్రపరిచారు. పెళ్లికాకుండా ఉండిపోయినవారితో పాటుగా అనేక కారణాల వల్ల ఒంటరిగా జీవితాన్ని గడుపుతున్న మహిళలు కూడా ఉన్నారు. భర్త చనిపోయిన, భర్త కానరాకుండా పోయిన, భర్తతో వేరుపడిన, కుటుంబ ఆదరణ లేక ఒంటరిగా జీవితాలను వెళ్లదీస్తున్న మహిళలు మరో 16.22 లక్షల మంది సమగ్ర కుటుంబ సర్వేలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. జోగిని ముద్ర పడిన మహిళలు ఒంటరిగా దుర్భర జీవితం గడుపుతున్నారు. భర్త చనిపోయినప్పటికీ ధ్రువీకరణ పత్రం ఇవ్వని కారణంగా వితంతు పింఛను పొందలేని వారు అనేక మంది ఒంటరి జీవితం గడుపుతున్నారు.

ఎలాంటి ఆలనా పాలనా లేకుండా ఒంటరి జీవితం గడుపుతున్న వారినందరిని ఒంటరి మహిళల పింఛను పథకంలో చేర్చడానికి త్వరలోనే సర్వే జరిపి అర్హులను గుర్తించడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 36 లక్షల మందికి సామాజిక భద్రత పింఛన్లను అందచేస్తుంది. ఒకొక్కరికి రూ. 1000ల చొప్పున ప్రతి నెలా పింఛను అందే విధంగా కార్యాచరణ అమలవుతోంది. వికలాంగులకు రూ. 1500ల చొప్పున పింఛను అందుతుంది. ఇక మీదట సుమారు 3 లక్షల మంది ఒంటరి మహిళలు కూడా నెలకు రూ. 1000ల చొప్పున పింఛను అందుకుంటున్నారు. వీరితో కలిపితే తెలంగాణలో సామాజిక పింఛన్లు అందుకుంటున్న వారి సంఖ్య 39 లక్షలకు చేరుకుంటుంది.

పంతంగి శంకర్, సీనియర్ జర్నలిస్టు

# తల్లిబిడ్డల సంరక్షణ



పేదరికానికి దగ్గరగా ఉన్నవారి పాలిట అనారోగ్యం వారిని ఆర్థికంగా శిథిలావస్థకు చేర్చగల మహాసంక్షోభం. ప్రతి సంవత్సరం అనేక మంది స్త్రీలు గర్భధారణ సంబంధిత వ్యాధుల కారణంగా మరణిస్తున్నారు. వారి మరణాలకు గల కారణాలతో పాటు పేదరికం, వైద్యవసతులు అందుబాటులోలేని మారుమూల ప్రాంతాలలో జీవనం సమస్యని మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. ఖర్చు తక్కువ కావటం వలన, అందుబాటులో ఉండటం వల్ల స్త్రీలలో అధికభాగం సాంప్రదాయక వైద్యాన్ని ఎంచుకుంటారు.

అనారోగ్యానికి, పేదరికానికి మధ్యవున్న సంబంధాన్ని అర్థం చేసుకోటానికి జీవనోపాధుల విశ్లేషణా పద్ధతిని అవలంభిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఈ పద్ధతి వలన అనారోగ్యం ఉత్పాదకతను హరించి వేసి కుటుంబాలలో పరిస్థితులను దుర్భరం చేసే విధానాన్ని అర్థం చేసుకోటానికి దోహదం చేయటంతో పాటు కుటుంబాలు, గ్రామాలు విపరిమాణాలు తట్టుకోలేని అశక్తతను తేటతెల్లం చేస్తుంది. సమాజంలో ఉన్న వివిధ వర్గాల మధ్య అనారోగ్యం, ఆరోగ్య సేవల అందుబాటులో ఉన్నదనటానికి సాక్ష్యాలు కోకొల్లలు.

పేదరిక నిర్మూలన క్రింద రూపొందిచబడిన పేదల సానుకూల ఆరోగ్య వ్యూహాలు చౌకగా నివారించగల సాధారణ సమస్యలకే ప్రాధాన్యం ఇస్తాయి. ఈ వ్యూహాల అమలు గురించి వ్యక్తమైన ఆందోళనలలో ముఖ్యమైనది ఏమిటంటే అనేక మంది పేద ప్రజలు ప్రభుత్వ పరిపాలన, పరిపాలనా వ్యవస్థలు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్నారు. స్వయం సహాయక సంఘాల సామర్థ్యాన్ని నిరంతరం మెరుగుపరచటం ద్వారా ఈ ప్రక్రియ మరింత బలపడుతుంది. అభివృద్ధికి ఇదే సరైన సూత్రం. ఆరోగ్య సంబంధిత సందేశాలను గ్రామస్థాయి ఆరోగ్య కార్యకర్తల ద్వారా గ్రామాలకు చేరవేయవలసి వుంటుంది.



**ప్రసవానికి ముందు ఆరోగ్య సంరక్షణ:**

ఒక స్త్రీ తను గర్భవతినని తెలియగానే ఆరోగ్య కార్యకర్తకి సమాచారం ఇచ్చి తన పేరును నమోదు చేయించుకోవాలి. ఈ విధంగా నమోదు చేయించుకోవడం వల్ల గర్భాదారణ తొలిదశలో ఎదురయ్యే సమస్యలను వెంటనే గుర్తించవచ్చు. తద్వారా మొత్తం గర్భాదారణ సమయంలో ఆమెకు పూర్తి ఆరోగ్య సంరక్షణ అందుతుంది. సుఖప్రసవం సాధ్యమవుతుంది. ఫలితంగా తల్లిబిడ్డలు ఇద్దరికి ఆరోగ్య భద్రత లభిస్తుంది.

- గర్భాదారణ సమయంలోనూ, పాలు ఇస్తున్నప్పుడు స్త్రీలు మరింత ఎక్కువ ఆహారం తీసుకోవలసిన అవసరం ఉంది. గర్భవతిగా ఉన్నప్పుడు చేసేదేదైనా అది ఆమెలో పెరుగుతున్న బిడ్డ మీద ప్రభావం చూపుతుంది. అందుకే బలంగా ఉండటానికి గర్భవతి ఈ క్రింది పనులు చేయడానికి ప్రయత్నించాలి.
- పిండి పదార్థాలు – మాంసకృతులు కలిగిన అన్నం, మాంసం, చేపలు, చిక్కుడు, వేరుశెనగ, బత్తాయి, మామిడి, వంటి పండ్లు, ఆకుకూరలతో కూడిన మిశ్రమ ఆహారం తీసుకోవాలి.

• మామూలుగా తీసుకొనే దానికంటే అదనపు విశ్రాంతి (నిద్ర) తీసుకోవాలి. అంటె పగటిపూట కనీసం ఒక గంట, రాత్రి పూట 8 గంటలు విశ్రాంతి తీసుకోవాలి.

• భారీ బరువులు మోయడం లాంటి కష్టమైన పనులు మానుకోవాలి.

• ప్రతిరోజు సురక్షితమైన నీటిని ఎక్కువగా తీసుకోవాలి.

• వదులుగా ఉండే, హాయిగా ఉండే దుస్తులను

వేసుకోవాలి.

- ప్రతి రోజు స్నానం చేయాలి. శరీర శుభ్రత అంటువ్యాధులు రాకుండా నివారిస్తుంది.
- పొగత్రాగటం, మద్యపానం తీసుకోకూడదు. ఇవి పుట్టబోయే బిడ్డకు హానిచేస్తాయి.

**ఆరోగ్య సంరక్షణ పొందటానికి తీసుకోవాల్సిన ఖచ్చితమైన చర్యలు:**

- గర్భవతినని తెలుసుకునప్పటి నుండి బిడ్డ పుట్టేంత వరకు ఆరోగ్య సంరక్షణ పొందటానికి కొన్ని ఖచ్చితమైన చర్యలు తీసుకోవలసి ఉంటుంది. గర్భదారణ సమయంలో వచ్చే ఆరోగ్య సమస్యలు గుర్తించడంలో గ్రామాల్లో ఉన్న ఆరోగ్య కార్యకర్తలకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. కాబట్టి గర్భవతులు ఖచ్చితంగా ఆరోగ్య కార్యకర్తలు ప్రాథమికంగా వారు ఇచ్చే సలహాలు పాటించాలి.
- గర్భదారణ సమయంలో కనీసం 4 లేక 5 సార్లు ఆసుపత్రికి వెళ్లి డాక్టరును సంప్రదించాలి.
- తనకు పుట్టబోయే బిడ్డకు ధనుర్వాతం రాకుండా టీకాలు (ఇంజక్షన్) తీసుకోవాలి.
- గర్భవతినని తెలియగానే అప్పటి నుండి శిక్షణ పొందిన ఆరోగ్య కార్యకర్త ఇచ్చిన మందులనే వేసుకోవాలి.
- రక్తహీనత రాకుండా చేయడానికి ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవాలి. అవి తల్లిబిడ్డలను బలంగా ఉంచుతాయి. పుట్టేటప్పుడు వచ్చే లోపాలు నుండి పోలిక్ యాసిడ్ కాపాడుతుంది.
- జననేంద్రియం నుండి రక్తస్రావం, కడుపునొప్పి, జననేంద్రియం నుండి నీరు స్రవించడం, వాంతులు, తలతిరగడం, గుండె కొట్టుకోవడంలో తేడా రావడం, జననేంద్రియం మీద పొక్కులు రావడం మొదలగు లక్షణాలు కన్పించినట్లయితే వెంటనే డాక్టరుని సంప్రదించాలి.

**ఆరోగ్యవంతమైన బిడ్డను ప్రసవించడానికి కొన్ని సలహాలు:**

- అర్హత కలిగిన ఆరోగ్య కార్యకర్త లేదా శిక్షణ పొందిన సాంప్రదాయక మంత్రసాని పర్యవేక్షణలో ప్రసవం జరగాలి.
- ప్రసవం పరిశుభ్రమైన ప్రదేశంలో జరగాలి.
- ఒక వేళ ప్రసవం ఇంట్లోగాని, స్థానిక ఆసుపత్రిలో కాని జరిగే పక్షంలో సమస్య ఎదురైతే పెద్దాస్పత్రికి తీసుకెళ్లేందుకు వీలుగా రావాణా సదుపాయాన్ని సిద్ధం చేసుకోవాలి.

**ప్రసవం తరువాత తల్లి తీసుకోవల్సిన జాగ్రత్తలు:**

ప్రసవం తర్వాత కోలుకోవడానికి స్త్రీకి కొంత సమయం కావాలి. ఆ తరువాత ఆమె తన గురించి, తన బిడ్డ గురించి సంరక్షణ తీసుకోగలుగుతుంది.

- బాగా తినాలి అంటే పిండిపదార్థాలు, ప్రోటిన్లు, పళ్లుకాయగూరలతో కూడిన మిశ్రమ ఆహారం తీసుకోవాలి. అన్నం, మాంసం, చేపలు, చిక్కుళ్లు, నారింజ, మామిడిపళ్ళు, అరటిపళ్లు, ఆకుకూరలు తీసుకోవాలి. వీటి వల్ల తల్లి ఆరోగ్యంతోపాటు బిడ్డకు కావల్సిన పాలు కూడా బాగా పడతాయి. ద్రవపదార్థాలు కూడా ఎక్కువగా తీసుకోవాలి.
- ప్రసవించిన వారంలోపు ఆరోగ్య చెకప్ కోసం వెళ్లాలి.
- ఆమె తను చేయగలనని అనుకున్నప్పుడు రోజు వారి పనులు చేయడం మొదలుపెట్టాలి.

**తల్లిపాలు యొక్క ప్రాముఖ్యత:**

- పుట్టిన బిడ్డకు ఎంత త్వరగా తల్లి ఇవ్వగలుగుతుందో బిడ్డ అంత ఆరోగ్యంగా ఉంటుంది.
- బిడ్డ పుట్టిన అరగంటలోపు బిడ్డను రొమ్ము దగ్గరకు తీసుకొని బిడ్డకు ముర్రుపాలు పుట్టడానికి ప్రయత్నం చేయాలి. ముర్రుపాలును వృథా చేయకూడదు.
- మొదట ఆరునెలల్లో బిడ్డకు కేవలం తల్లిపాలు తప్ప మరే ఇతర ఆహారం అవసరం లేదు.
- తల్లిపాలల్లో మొదటి ఆరునెలల్లో బిడ్డకు కావలసిన నీరు, ఆహారం అంత వుంటుంది.

**పుట్టిన బిడ్డ సంరక్షణ:**

అప్పుడే పుట్టిన బిడ్డకు సంరక్షణ, సహాయం చాలా అవసరం. బిడ్డలు చక్కగా పెరగడానికి కొన్ని ముఖ్యమైన చర్యలు తీసుకోవాలి. తల్లులు, అత్తలు, అమ్మమ్మలు, శిశువులు సంరక్షణలు కీలకపాత్ర పోషిస్తారు. అందుకే పుట్టిన బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలంటే వీరికి పూర్తి పరిజ్ఞానం ఉండాలి.

- అప్పుడే పుట్టిన బిడ్డను పరిశుభ్రంగా ఉంచాలి.
- బిడ్డలకు ప్రతిరోజూ స్నానం చేయించవలసిన అవసరం లేదు. అయితే వారి ముఖం, కళ్లు, చెవులు, చేతులు, కాళ్ళను శుభ్రమైన నీటితో గుడ్డతో తుడిచి శుభ్రంగా ఉంచాలి.
- బిడ్డకు వెచ్చగా ఉండేలా చూడాలి.
- బిడ్డలకు సరైన సమయంలో టీకా వేయించాలి.

ఈ విధంగా గర్భం సమయంలోను, బిడ్డ పుట్టిన తరువాత తగు జాగ్రత్తలు తీసుకుంటే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు. ఫలితంగా దేశంలో, రాష్ట్రంలో మాతాశిశు మరణాలు లేకుండా ఉంటాయి.

**– సి. హెచ్.రేణుక, రీసెర్చ్ స్కాలర్,**
**ప్రొ॥ జయశంకర్ వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్**



# చేనేతకు నైపుణ్యం తోడైతే...?

తెలంగాణలో సహజంగానే చేనేత కుటీర పరిశ్రమగా ఉంది. నేతలోని వివిధ దశల్లో కుటుంబ సభ్యులంతా పనిచేస్తారు. చేనేత గిట్టుబాటు కాకపోవడంతో యువతరం వేరే రంగాల వైపు వెళ్తోంది. అయితే కుటుంబంలో నేత మీద ఆధారపడిన వారికి ఆకలి బాధలు తప్పడంలేదు. రోజంతా మగ్గం మీద రెక్కలు ముక్కలు చేసుకున్నా డొక్కాడటం లేదు. తెలంగాణ గడ్డ చేనేతకు పెట్టిందిపేరు. రైతన్న తర్వాతి స్థానం నేతన్నదే. అయితే చేనేత గిట్టుబాటు కాకపోవడంతో చాలామంది నేతన్నలు ఉపాధికోసం ఇతర పనులు చూసుకుని వలస బాటపట్టారు. కుటుంబానికి ఒకరో ఇద్దరో మిగిలారు ఈ నేపథ్యంలో వారికి మెరుగైన జీవనోపాధుల కోసం ఇక్కత్ వస్త్రాల డిజైనింగ్, మరియు నేతపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ముందుగానే దారాలమీద డిజైన్ వెయ్యడం, మగ్గం మీద దారాలు ఏర్పాటు, అద్దకం మొదలైన అనేక అంశాల్లో పేద మహిళలు శిక్షణ పొందారు.

**ఇక్కత్ అంటే?**

చేనేతలో ప్రత్యేకమైన శైలి ఇక్కత్ . ఈ నేతకు ఇవాళ ఫ్యాషన్ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కత్ అద్దకం, నేతలో నైపుణ్యాలను మెరుగుపర్చి జీవనోపాధి అవకాశాలు పెంచడానికి నాబార్డు తొలిసారిగా తెలంగాణాలోని నల్గొండ జిల్లాలో ఈ శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టింది. సంప్రదాయ వస్త్రాల నేతలో నల్లగొండ జిల్లా నేతకారులకు మంచి సామర్థ్యం, నైపుణ్యం ఉన్నాయి,వారి ఉత్పత్తులకు డిమాండ్ పెంచడానికే ఈ కార్యక్రమం

**శిక్షణ...**

నల్గొండ జిల్లాలో నెమ్మాని, మంద్ర, వెల్లంకి గ్రామాలకు చెందిన 90మంది మహిళలకు 15 రోజుల శిక్షణ ఇచ్చారు. ఇక్కత్ నేతకు మార్కెట్లో డిమాండ్ ఉంది.స్థానిక అవసరాలకూ ఎగుమతులకూ కూడా మంచి గిరాకీ ఉంది. ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని మహిళలకు నైపుణ్య శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా ముడిసరుకు, మార్కెటింగ్‌కు సంబంధించి స్థానికంగా ఉండే అవకాశాలనే ప్రధానంగా తీసుకోవడం వల్ల మహిళల ఆదాయం పెరిగి, అంతిమంగా జీవన ప్రమాణాలు మెరుగుపడ్డానికి అవకాశం ఉంది..

కేవలం నైపుణ్యాలు పెంచడమే కాకుండా రుణ సదుపాయం పొందడం, మార్కెటింగ్ మొదలైన అంశాల్లో కూడా ఎన్‌జీఓ కౌన్సిలింగ్ ఇచ్చింది. దీనివల్ల శిక్షణ పొందిన మహిళలకు మంచి లబ్ది చేకూరింది. ఇప్పటికే కొందరు ఉత్పత్తి యూనిట్లు ప్రారంభించారు.

**ఫలితాలు ఇవి...**

1. ఈ శిక్షణ వల్ల మహిళలు రోజుకు 400 రూపాయల నుండి, 600 రూపాయల దాకా ఆదాయం సమకూరుతుంది.
2. గ్రామీణచేనేత, హస్తకళారుల్లో ఎక్కువ మందికి ఉపాధి కలుగుతుంది
3. తక్కువ పెట్టుబడితో స్థిరమైన ఆదాయం
4, వినియోగ దారుల అభిరుచులు, అవసరాలకు అనుగుణంగా వినూత్న డిజైన్లు రూపొందిస్తున్నారు.
5, ఆధునిక పద్ధతులు నేర్చుకోవడం , ఆదాయం సమకూర్చుకోవడం ద్వారా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారిని పైకి తీసుకు రావడంతో వారి జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయి.
6, సహకార పద్ధతి సాంకేతిక సామర్థ్యం పెంచడం వలన, వస్త్రాల నాణ్యత మెరుగుపడింది.
7, గ్రామీణ ఉద్పాదకత పెరిగి, గ్రామీణ మహిళలు, ఉత్పత్తి, మార్కెటింగ్ క్రమంలో భాగస్వాములవుతున్నారు.

**మెరుగైన శిక్షణ వల్ల మేలు**

"ఇక్కత్ డిజైన్ నేర్చుకోవడం వల్ల మా ఆదాయం గతంలో కంటే పెరిగింది. ఆకులు, పువ్వులు కూరగాయల నుండి రంగులు తియ్యడం, రంగుల అద్దకం నేర్చుకున్నాం. బ్యాంకుల సాయంతో మార్కెటింగ్ యూనిట్లు కూడా ఏర్పాటు చేసుకుంటున్నాం" అంటారు ఇక్కడ శిక్షణ పొందిన గంజి ఉమ.

– కె.మాలతి





# చెర్వుగట్టు 'శివలింగ క్షేత్రం'



**హిం**దువులకు సర్వవ్యాపితుడైన దైవం శివుడు. పన్నెండు జ్యోతిర్లింగ క్షేత్రాలతో బాటు, పంచారామాలతో బాటు, పంచభూత శివలింగాలతో బాటు ఊరూరా శంభునికి కోవెల లేకుండా ఉండదు. "శివుడాజ్ఞ లేకుండా చీమైనా కుట్టదంటారు" పెద్దలు. లింగ స్వరూపుడుగా శంకరుడు ఈ భూమండలం మీద అత్యంత విశేష పూజలందుకుంటున్నాడు. భోళా శంకరుడుగా, అభయప్రధాతగా, జగద్రక్షకుడుగా ఆయనకు ఆయనే సాటి.

పరశురాముడు ప్రతిష్ఠించిన ఆఖరి శివలింగ క్షేత్రంగా ఈ 'చెర్వుగట్టు' క్షేత్రం అత్యంత ప్రాచీనయుగ చరిత్ర కలిగింది. భార్గవ రాముడు తపమాచరించిన ఈ పవిత్ర స్థలాన్ని మహిమాన్వితమైనదిగా తెలంగాణ ప్రాంతవాసులు విశ్వసిస్తారు. 'మారలింగం' అంటూ మొక్కుకున్న వారిని కటాక్షిస్తూ పిలిస్తే పలికే, కోరికలు తీర్చే భక్తుల పాలిట కల్పతరువుగా ఈ గుట్టపై వెలసిన స్వామివారి ఆకారం జడల రూపాన్ని కలిగి ఉండటంతో 'జడల రామలింగేశ్వరరస్వామి' అని స్థానికులు పిలుస్తుంటారు.

నల్లగొండ జిల్లా నార్కత్‌పల్లి మండలం 'చెర్వుగట్టు' గ్రామంలో వెలసినటువంటి శ్రీ పార్వతీ సహిత జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం, ఆ జిల్లాలో ప్రసిద్ధిపొందిన శైవక్షేత్రాలలో ఒకటిగా విరాజిల్లుతున్నది. పరశురాముడు తాను ప్రతిష్ఠించిన 108 శివలింగాలలో చెర్వుగట్టు శివక్షేత్రం చరిత్ర ప్రసిద్ధిపొందినది. దీనినే కొందరు రెండవ యాదగిరిగుట్టగా భావిస్తూ ప్రాచుర్యాన్ని కలిగించడం హర్షదాయకమైన విషయం. నల్లగొండ జిల్లా కేంద్రానికి ఈ క్షేత్రం కేవలం పదమూడు కిలోమీటర్ల సమీపంలో, మండల కేంద్రానికీ దగ్గరగా 'చెర్వుగట్టు' గ్రామంలో కొలువుదీరి ఉన్నది.

శైవ ఆగమానుసారం ఈ దేవస్థానంలో పూజాధికములు, ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతూ ఉంటాయి. వీటితో ప్రతి సంవత్సరం నిర్వహించబడే బ్రహ్మోత్సవములు, మహాశివరాత్రి పర్వదినం, తొలి ఏకాదశి వంటి పండుగ దినాలను ముఖ్యమైన దినాలుగా చెప్పుకోవచ్చును. అయితే బ్రహ్మోత్సవాలప్పుడు వాటిని చూడ్డానికిగాను ఆయా ప్రాంతాల నుండి భక్తకోటి పరవళ్ల తొక్కుతూ అక్కడికి విచ్చేస్తుంటారు. క్షేత్రప్రాశస్త్యం మరింత ద్విగుణీకృతమై భక్తుల రాక ఏయేటికి ఆ యేడు ఎక్కువవుతూ క్షేత్రానికి ఆదాయం పెరుగుతూ వస్తున్నది. బహుశా అందువల్లనే కావొచ్చు. దీనిని ఇటీవలి కాలంలో 6-(బి) గ్రేడు సహాయ కమీషనర్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయడం జరిగింది. ఏ శైవక్షేత్రమైనా అది నానాటికీ విస్తరించాలన్నా, జనంలోకి వెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంటుంది.

**దేవతలచేతో - మానవులచేతో**

స్వయంభూ లింగమైనా, ప్రతిష్ఠింపబడిన శివలింగమైనా ఎన్నో శైవక్షేత్రాలు మహిమ గల పుణ్యక్షేత్రాలుగా అటు వారణాసి నుండి ఇటు రామేశ్వరం వరకు ఎన్నో రాష్ట్రాలలో వ్యాపించి ఉన్నాయి. శివతత్వాన్ని, శైవభక్తిని చాటే ఉద్గ్రంతాలెన్నో దక్షిణాది భాషలైన తెలుగు, తమిళ, కన్నడ, మలయాల కూడా నిక్షిప్తమై ఉన్నాయి. శివునినెలవైన కాశీక్షేత్రం ఉత్తరాదిలో ఉంటే, దక్షిణాది తమిళనాట టెంకాశీ (తెన్-దక్షిణ, కాశీ=కాశీ) దక్షిణ కాశీ అనే ఊరు పుణ్యక్షేత్రంగా వాసికెక్కింది. ఆ ఆలయ గోపురం మిక్కిలి ఎత్తైనది. శివాలయాల్లో రాజగోపురంగాని, ధ్వజస్థంబం గాని ఎంతో కోలాయమానంగా నిర్మించుకుని ఆయా ప్రాంతాలలో భక్తులు తమ భక్తిశ్రద్ధల్ని చాటుకోవడం కద్దు.



ఈ చెర్వుగట్టు శివలింగ క్షేత్రం ప్రాశాస్త్రానికి సంబంధించి పలు పురాణ-ఇతిహాస చరిత్రలు పలు విధాలుగా చెప్పుకుంటున్నప్పటికీ ప్రధానంగా ఒకే ఒక్క చరిత్రను ఆ ప్రాంత భక్తి శిఖామణులు విశ్వసిస్తారు. వాటి వివరాలను సూక్ష్మంగా పరిశీలిద్దాం!

స్థల పురాణాన్ని ఆధారంగా చెప్పుకోవాల్సి వచ్చినట్లైతే త్రేతాయుగంలో కార్తవీర్యార్జునుడు అనే చక్రవర్తి ఒక పర్యాయం తన సమస్త పరివారంతో జమదగ్ని మహర్షి ఆశ్రమానికి వెళ్లాడు. అంత ఆజమదగ్ని మహర్షి తన వద్దనున్న కామధేనువు సహాయంతో ఆ చక్రవర్తికీ ఆయన యొక్క సమస్త పరివారానికీ షడ్రుసోపేతమైన విందు భోజనాలను పెట్టాడట. ఆతిథ్రమిచ్చిన జమదగ్నిని చూసి ఆశ్చర్యచకితుడైన కార్తవీర్యార్జున ప్రభువు ఆ కామధేనువు తమకు అప్పగించాల్సినదిగా కోరినాడు. అందుకు మహర్షి ఆ రాజు కోరికను అంగీకరించలేదు. కార్తవీర్యార్జునుడు బలప్రయోగం ద్వారా ఆ జమదగ్ని దగ్గరున్న గోమాతను తీసుకొని రావలసిందిగా సైనికులను ఆజ్ఞాపించినాడు.

నిస్సహాయుడైన మహర్షి తనను తాను కాపాడుకోవలసినదిగా తన వద్ద గల హోమధేనువును వేడుకున్నాడు. ఆ విషయాన్ని గ్రహించిన పరశురాముడు ప్రళయకాలరుద్రుడై కార్తవీర్యార్జునుణ్ణి చంపివేసినాడు. దీనికి తోడు ఇరవది యొక్క పర్యాయములు భూప్రదక్షిణం చేసి క్షత్రియుడు (రాజు) అనే వాడు కన్పించకుండా చంపుకుంటు వచ్చాడు. ఆ తర్వాత లోకకళ్యాణం కోసం 108 క్షేత్రియులతో శివలింగ ప్రతిష్ట చేసి ప్రతి ఒక్క క్షేత్రంలో కొన్ని లక్షల సంవత్సరములు తపమాచరించి ఆ శివలింగానికి ధారపోయడం చేస్తూ వచ్చాడు. తన తపస్సును ఆ విధంగా శివయ్యకు ధారపోయడం మూలంగా విశ్వశాంతికి ఆయన పాటు బడినట్లైంది. ఆ విధంగా ఈ చెర్వుగట్టు క్షేత్రం వెలసింది. ఇదే ఆయన ప్రతిష్టించిన ఆఖరి శివక్షేత్రంగా చెప్పబడుతున్నది.

**- మంతెన సూర్యనారాయణరాజు**



# గిరిజనుల పేరులో ప్రత్యేకత

లోకంలో ప్రతి వ్యక్తికి పేరుండాలన్న విషయం విధితమే "పేరులో ఏముంది" అని మన పెద్దలెందుకన్నారో మరి! అమాయకత్వాన్ని గూడుకట్టుకొని నివసిస్తున్న గిరిజనుల 'గూడెం' ఆనాటి గుర్రగూడెం నేటి లక్ష్మీపురం, జయశంకర్‌జిల్లా ములుగు డివిజన్ వాజేడు మండలంలో ఉంది.

ఈ గిరిజనగూడెంలో వ్యక్తుల పేర్లు పరిశీలిస్తే పేరులో ఏదో వుందనిపిస్తుంది.

ఆనాటి గిరిజనులు తమకు సంతానం చాన్నాళ్ళకు కల్గినా, సంతానం దక్కకుండా శిశుమరణాలు సంభవిస్తుంటే తమ సంతానం నిల్వాలని పుట్టిన మగశిశువుకి 'భతకయ్య' ఆడశిశువుకి భతకమ్మ అని పేరు పెట్టి పిలుచుకునేవారు. అలా ఆనాడు భతకయ్య/భతకమ్మ పేరు పెట్టుకున్న వారు పెరిగి పెద్దవారయి జీవనం సాగిస్తున్నారు.

ఇక్కడ గిరిజనులకు కుటుంబ నియంత్రణపై అవగాహన లేక తమకు కల్గే అపరిమిత సంతానాన్ని అదుపు చేసుకునే పద్ధతులు తెలిక ఐదు, ఆరుగురు పిల్లలుండే సరికి తమ ఆరో లేదా ఏడో సంతానానికి ఇక తమకు సంతానం చాలు అనే భావంతో మగశిశువయితే సాలయ్య అని, ఆడశిశువయితే సాలక్క అని పేరు పెట్టుకొనేవారు. అలా ఆనాడు సాలయ్య, సాలక్క పేర్లున్నవారు ఆయా కుటుంబంలో ఆశ్చర్యంగా చిట్టచివరి సంతానంగా నేడు మిగిలిపోయారు! అలా ఆ గిరిజన దంపతులు కుటుంబ నియంత్రణ పాటించేవారు!!

ఆసియా ఖండంలో అతిపెద్ద గిరిజన జాతరగా చెప్పుకునే సమ్మక్క సారలమ్మ జాతర జయశంకర్‌జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ప్రతి రెండేళ్ళకోసారి వనంలోనయినా జనవనంను తలపించేలా జరుగుతుంటుంది.

సమ్మక్క సారలమ్మ వనదేవతలను గిరిజనులు ఇలవేల్పుగా కొలుస్తారు. కోరిన కోరికలను తీర్చేదైవంగా భక్తితో పూజిస్తారు. అంతేకాదు తమకు కల్గిన సంతానంకు ఆ వనదేవతల పేర్లు పెట్టుకుని తమ భక్తిని చాటుకొంటారు.

మగపిల్ల వాడికయితే ఆ రోజుల్లో 'సమ్మయ్య' అని ఆడపిల్లకయితే సమ్మక్క అని పేరుపెట్టి పిలుచుకునేవారు.

నేటి బాలబాలికలను సతీష్, సరిత అనే పేర్లు పెట్టుకుంటున్నారు. అంతే కాదు నేటితరం సినిమా కథానాయకీ, నాయకుల పేర్లు కూడా తమ పిల్లలకు పెట్టుకుంటున్నారు. గర్రగూడెం అనే గిరిజనగూడెం (లక్ష్మీపురం)లో చాలా కుటుంబాలలో ఆ తరం వారికి భతకయ్య, భతకమ్మ, సాలయ్య, సాలక్క, సమ్మయ్య, సమ్మక్క, సారక్క. ఈ తరం వారికి సతీష్, సరిత, సమత పేర్లున్నాయనే చెప్పవచ్చు. వారి వంటి పేర్లను ఇంటిపేర్లే వేరు చేస్తాయనిపిస్తుంది.

ఈ విధంగా గిరిజనగూడెంలో గిరిజనుల పేరులో ప్రత్యేకతలను చెప్పకనే చెబుతుంటాయి. ఇక పేరులో ఏముంది పెన్నిధి అవగలమా మరి!

**- అమ్మిన వెంకటఅమ్మిరాజు, జయశంకర్ జిల్లా, తెలంగాణ**

# కేంద్ర ప్రభుత్వ కొత్త భీమా పథకాలు

**ప్రధానమంత్రి ముద్రాయోజన పథకం:**

లఘు, చిన్నతరహా వ్యాపారస్తులు, వ్యాపారసంస్థలకు తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వడం కోసం ప్రధానమంత్రి మోదీ 'ప్రధానమంత్రి ముద్రా యోజన' పేరుతో ఒక పథకాన్ని 2015 ఏప్రిల్ 8వ తేదీన ఢిల్లీలో ప్రారంభించారు.

**ఈ పథకం ముఖ్యాంశాలు:**

- చిరువ్యాపారులు, చేతివృత్తుల వారు, కొత్తగా వ్యాపారం లేదా సంస్థలు ప్రారంభించాలనే వారికి ఋణం ఇవ్వడం జరుగుతుంది.
- ఈ పథకాన్ని 70,000 కోట్ల మూలధనం సమకూర్చడం జరిగింది.
- ఈ పథకంలో భాగస్వామ్యానికి అంగీకరించిన బ్యాంకులు మూడు రకాల ఋణాలు ఇస్తాయి. సంస్థను బట్టి 'శిశు' కేటగిరి క్రిందకి వచ్చే వారికి రూ.50000 వరకు ఋణం ఇస్తారు. కిషోర స్థాయి సంస్థలకు 50 వేల నుండి 5 లక్షల రూపాయల వరకు తరుణ్‌స్థాయి వారికి గరిష్టంగా 10 లక్షల వరకు ఋణం ఇస్తారు.
- తొలిదశలో భూమి రవాణా, సామాజిక అవసరాలు వ్యక్తిగత సేవలు ఆహారోత్పత్తులు ఔళిరంగాలకు ఋణాల మంజూరులో ప్రాధాన్యం ఇస్తారు.
- తయారీ, వాణిజ్యం, సేవా కార్యక్రమాల్లో ఉన్న 577 కోట్లు సూక్ష్మ, చిన్నపాటి సంస్థలకు ఎటువంటి హామీ లేకుండా ఋణాలు ఇవ్వడం ఈ బ్యాంకు ఉద్దేశ్యం.
- సూక్ష్మ ఋణ వాణిజ్య సంస్థల వ్యాపారులకు నియమ నిబంధనలను రూపొందించడం. సూక్ష్మ ఋణ సంస్థల నమోదు వాటికి గుర్తింపు రెటింగ్ ఇవ్వడం ముద్రాబ్యాంకుల బాధ్యత.




**ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన:**

- జీవిత భీమా కల్పించడం ఈ పథకాల ఉద్దేశం 2015 జూన్ 1 ప్రారంభించారు. మిగతా బీమా పథకంతో పోలిస్తే అతి తక్కువ ప్రీమియం చెల్లించేలా దీనికి మార్గదర్శకాలు రూపొందించారు. ఏడాదికి రూ.330 ప్రీమియం చెల్లించాల్సి




ఉంటుంది. 18–50 ఏళ్ళు వయస్సున్న వారందరూ ఈ పథకం చేరేందుకు అర్హులు. 55 ఏళ్ళ వరకూ ఈ భీమా ప్రయోజనాలుంటాయి. బీమా చేసిన వ్యక్తి 55 సంవత్సరాల లోపు మరణిస్తే వారి కుటుంబానికి రూ.2 లక్షల పరిహారంగా అందిస్తారు.

- **ప్రధానమంత్రి సురక్షభీమా యోజన:**
- ప్రమాదాల్లో గాయపడిన వారికి ఆదుకునేందుకు సురక్ష బీమా యోజన పథకం ఉద్దేశించబడింది.
- ఈ పథకం 18 నుంచి 70 ఏళ్ళ వయస్సున్న అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రవేశపెట్టారు.
- ప్రతి సంవత్సరం కేవలం రూ.12 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.
- ప్రమాదంలో మరణించినా, వైకల్యం, సంబంధించినా రూ.2 లక్షల పరిహారంగా అందిస్తారు.
- పాక్షికంగా వైకల్యం సంభవిస్తే రూ.లక్ష పరిహారం అందిస్తారు.
- ఈ పథకంలో చేరేందుకు ఆసక్తి ఉన్నవారు ఆధార్‌కార్డు అనుసంధానికి తమ ఖాతాలున్న బ్యాంకుల్లో సమ్మతి పత్రం అందించి, నామిని పేరు తెలియజేసి ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది.
- ప్రతి ఏడాది జూన్ 1 నాటికి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.
- ఈ పథకాన్ని ప్రభుత్వరంగ ఇన్యూరెన్స్ కంపెనీలతో పాటు




ఇతర కంపెనీలు బ్యాంకులతో కలిసి అమలుజేస్తుంది.

**ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన:**

ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2016 మార్చి 22 తేదీన ముంబైలో ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగింది. ఇది పంట భీమా పథకం.

**ఈ పథకం యొక్క ప్రాధాన్యత:**

గతంలో ఉన్న పంటల భీమా పథకాలతో పోల్చితే కొన్ని ప్రత్యేకతల దృష్ట్యా ఈ కొత్త పథకం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో పంట బీమా పథకాల్లో ప్రీమియం రేటుకు పరిమితి ఉండేది. ఈ పరిమితి వలన రైతులకు క్లెయిమ్ మొత్తంలో తక్కువ మాత్రమే ఉ ఒడేది. కొత్త పథకంలో ప్రీమియం రేటుపై పరిమితి తొలగించడం వల్ల రైతన్నలు క్లెయిమ్ చేసుకున్న సమయంలో పూర్తి హామీ మొత్తం పొంది వీలుంది. గత పథకాలతో పోల్చితే రైతులపై ప్రీమియం భారం కూడా చాలా తక్కువగా ఉంటుంది. ఏ ఒక్క రైతు నిరాశానిస్పృహలకు లోనయ్యే పరిస్థితి లేకుండా చూడాలన్న లక్ష్యంగా కొత్త స్కిమ్ రూపకల్పనతో స్థానిక రిస్క్‌లకు పంటల అనంతర నష్టాలకు కూడా కవరేజీ కల్పించడం జరుగుతుంది. ఈ స్కీమ్ అమలులో టెక్నాలజీని సంపూర్ణంగా వినియోగించుకుంటారు. ఎందుకనగా పంట నష్టాలు అంచనాలకు రిమోట్ సెన్సింగ్, స్మార్ట్ ఫోన్లు డ్రోన్లు వంటి ఆధునిక టెక్నాలజీ భావించే రైతులు ఖరీఫ్ పంటలకు 2 శాతం, రబీ పంటలకు 1.5 శాతం ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. వాణిజ్య ఉద్యానవన పంటలకు 5 శాతం ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుంది. ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు నుంచైనా పంటలకు సంపూర్ణ రక్షణ కల్పించడం లక్ష్యంగా ప్రారంభించిన ఈ పథకానికి నిర్ణయించిన మేరకు అతి స్వల్ప ప్రీమియం రైతులు చెల్లిస్తే మిగతా ప్రభుత్వం చెల్లించి ఆ ప్రయోజనం గల వారికి సంపూర్ణంగా అందేలా చూస్తుంది.




**సుకన్య సమృద్ధి యోజన:**

- బేటి బచావో – బేటీ పడావో పథకంలో భాగంగా ప్రారంభించిన ఈ పథకం ఆర్థిక ఆలంబన ఇవ్వటానికి ఉపకరిస్తుంది. ఈ పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ 2015 జనవరి 21వ తేదీన హర్యానాలోని పాటియలో జిల్లాలో ప్రారంభించడం జరిగింది.

**ఈ పథకం యొక్క ముఖ్యాంశాలు**

- తల్లిదండ్రులు తమ సంరక్షులు తమ ఆడపిల్లల పేరు మీద ఈ పథకం క్రింద ఖాతా ప్రారంభించవచ్చు.
- అయితే అమ్మాయిలు వయస్సు పదేళ్ళలోపు ఉండాలి.
- అమ్మాయికి పదేళ్ళ వయస్సు వచ్చిన తర్వాత తన ఖాతాను తానే స్వయంగా నిర్వహించుకోవచ్చు.
- అయితే డిపాజిట్లు మాత్రం తల్లిదండ్రులు లేదా సంరక్షకులు చేయాలి.
- ఖాతా ప్రారంభించిన తర్వాత అమ్మాయి పేరుతో పాస్‌బుక్




ఇస్తారు. దాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయించుకోవాలి.

- ఖాతా ప్రారంభించిన 14 ఏళ్ళ వరకు ఈ ఖాతాకు డిపాజిట్లు చేయవచ్చు. ఖాతా ప్రారంభించిన తేదీ నుండి 21 సంవత్సరాల తర్వాత దానిలోని డిపాజిట్లు మెచ్యుర్ అవుతాయి.
- ఒకవేళ ఖాతా మెచ్యుర్ అవ్వడానికి ముందు అమ్మాయికి వివాహం జరిగితే ఆ తర్వాత ఖాతాను నిర్వహించడానికి వీలుండదు.
- ఈ పథకం క్రింద ఖాతా ప్రారంభించడానికి కనీసం వెయ్యి రూపాయలు డిపాజిట్ చేయ్యాలి.
- ఈ ఖాతా లక్ష్యాయాభై వేల రూపాయలకు మించి ఎల్లప్పుడు డిపాజిట్ చేయకూడదు.
- ఈ ఖాతాలో సొమ్మును నగదుగా గాని చెక్కు లేదా డిమాండ్ డ్రిప్పుగా గాని జమచేయవచ్చు.
- అమ్మాయికి 18 సంవత్సరములు వచ్చినా తర్వాత ఆమె చదువు కోసం ఈ ఖాతా నుండి 50 శాతం సొమ్ము తీసుకోవచ్చు.
- ఈ పథకంలో ఖాతా ప్రారంభించాలంటే అమ్మాయి పుట్టిన తేదీ తెలియజేసే బర్త్ సర్టిఫికేట్, తల్లిదండ్రులు గుర్తింపు పత్రాలు, డిపాజిట్‌దారులు నివాస, ధృవీకరణ పత్రాలు బ్యాంకుకు సమర్పించాలి.

**– ఎం.ప్రదీప్‌కుమార్, రీసెర్చ్ అసోసియేట్, టిఎస్ఐఆర్‌డి**

# తెలంగాణ రాష్ట్రములో భూ దస్త్రాల స్వచ్ఛీకరణ



తెలంగాణ రాష్ట్రము ఏర్పడిన తరువాత రెవిన్యూ పరిపాలన అర్థవంతముగాను సమర్ధవంతముగాను నిర్వహించాలంటే భూమి రికార్డుల నిర్వాహణతో పాటు భూమికి సంబంధించిన సర్వే సెటిల్‌మెంట్ విధానము అత్యంత ఆవశ్యకమని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వము భూమి రికార్డులు స్వచ్ఛత మరియు ఆధునీకరణ ప్రాజెక్టును చేపట్టింది. దీని ద్వారా 90 శాతం గ్రామ రికార్డులను పూర్తిగా స్వచ్ఛీకరించాలని ముఖ్య ఉద్దేశ్యము. మిగిలిన 10 శాతం గ్రామాలలో భూ సమస్యల ను పరిష్కరించడము చేయడము ద్వారా 100 శాతం స్వచ్ఛతను సంపాదించవచ్చు.

గ్రామ రికార్డులను స్వచ్ఛీకరించునప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రెండు ముఖ్య అంశాలను దృష్టిలో ఉంచుకొని దిశానిర్దేశం చేసింది అవి 1. గ్రామములోని వాస్తవ భూపరిస్థితిని గ్రామ రికార్డులలో నమోదు చేయడము. 2. పారదర్శకత మరియు జవాబుదారి తనముతో గ్రామ రికార్డుల నిర్వాహణ. ఈ రెండు అంశాల ద్వారా గ్రామంలోని పట్టాదారులు/రైతులు వారికి సంబంధించిన భూ వివరాలను సులభంగా చూచుకొనుటకు వీలవుతుంది.

తెలంగాణ రాష్ట్రములో గ్రామ రికార్డుల స్వచ్ఛీకరణ ప్రాజెక్టను 15 సెప్టెంబర్ 2017 నుండి ప్రారంభించారు. ఈ కార్యక్రమము ద్వారా 568 మండలాలలో, 10,875 రెవిన్యూ గ్రామాలలో రికార్డులను స్వచ్ఛీకరిస్తారు. దీనికి 1.78 కోట్ల సర్వే నంబర్లు 2.45 కోట్ల ఎకరాల రికార్డులను స్వచ్ఛీకరిస్తారు. ఇది ఇప్పటికి కొన్ని ప్రాంతాలలో కొనసాగుతున్నది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము భూ రికార్డుల స్వచ్ఛీకరణకు సంబంధించిన మార్గదర్శకాలను సర్కులర్ నెం 1, Reff No CMRO/ 342/2017 Dt 09.09.2017 ద్వారా ఇచ్చినారు. అందులోని ముఖ్యమైన అంశాలు

1. జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో తహసిల్దారు/ఉప తహసిల్దారు/ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ లలో ఒకరి అధ్యక్షతన రెవిన్యూ అధికారులతో కూడిన కమిటీ ఉండును. వారితో పాటు పారాలీగల్స్ యొక్క సేవలను కూడా వినియోగించుకుంటారు. ఈ గ్రూప్ వారు ఒక రోజుకు 250 ఎకరాలకు సంబంధించిన రికార్డులను ధృవీకరించాలి. ఒక గ్రూప్ 10 రోజులలో ఒక గ్రామము పూర్తి చేసిన 100 రోజులలో ఒక జిల్లా పూర్తి చేయగలరని ఒక అంచనా.

2. శిక్షణ మరియు సామర్థ్యాల పెంపు ద్వారా గ్రూప్‌లోనున్న సభ్యులందరికి ఈ కార్యక్రమమును గురించి పూర్తి అవగాహన కల్పించుటకు జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో వివిద స్థాయిలలో అవగాహన సదస్సులను నిర్వహిస్తు న్నారు. ఏ జిల్లాలో ఏ గ్రూప్ వారు పని చేయవలె నో ఆ జిల్లాకు సంబంధించి పూర్తి అవగాహన సభ్యులకు అందించాలి. అంతే కాకుండా ఈ ప్రాజెక్ట్ యొక్క ముఖ్య లక్ష్యం దశల వారిగా చేయు విధి విధానాలు సమాచార సేకరణకు అవసరమైన నమూనా పత్రాలు గ్రామ రికార్డులను ఆధునీకరించినప్పుడు పాటించవలసిన చట్టబద్ధమైన అంశాలు మరియు ప్రతి రోజు సాధించిన పురోగతిని జిల్లా నుండి రాష్ట్రమునకు చేరవేయడము మొదలైనవి ఉంటాయి. ఈ కార్యక్రమము కొరకు

3. రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమము నియమిత కాలములో పూర్తి చేయవలెనన్న క్షేత్ర స్థాయిలో వచ్చే సందేహాలకు అప్పటికప్పుడే పరిష్కారములు చూచించుటకు ఈ కంట్రోల్ రూములు దోహదం చేస్తాయి. వీటి ద్వారానే రాష్ట్రమునకు సమాచార నివేధికలు పంపవలెను.

4. గ్రూపులుగా ఏర్పడినవారు గ్రామమునకు వెళ్ళడానికి ముందే రెవిన్యూ ప్రాథమిక రికార్డులైన సేత్‌వారు, కాస్రాపహాణి, సేసాలాపహాణి మరియు అందుబాటులో ఉన్న పురాతన పహాణీలను ముద్రించిన పహాణీ, లేదా వెబ్‌సైట్ నందు ఉంచిన డేటాను 1-బి రిజిస్టరు, గ్రామ పటము మొ॥నవి తీసుకొని గ్రామమునకు వెళ్లాలి.

5. పార్టు-1 :- గ్రామ రికార్డుల స్వచ్ఛీకరణలో భూమి ధృవీకరణ అత్యంత కష్టమైనది దీనికి సంబంధించి ముందుగా ఆఫీసు నందు సమగ్రముగా అవగాహనకు రావలెను. భూ విస్తీర్ణము సేత్‌వారు, కాస్రాపహాణి, సేసాలాపహాణ ఒకే రకముగా ఉండకపోవచ్చు. దీనికి అమ్మకము కొనుగోలు జరిగినప్పుడు అమ్మకపుదారుని పేరు అలాగే వుంచి, కొనుగోలు దారుని పేరు కూడా చేర్చడము, కంప్యూటర్ నందు ఎక్కించినప్పుడు జరిగిన తప్పులు, వారసత్వము మార్పు చేయకపోవడము వలన పాత రికార్డులలో విస్తీర్ణము సరిగా ఉన్నా, ఆధునిక పహాణీలో తప్పులు ఉండటం వంటివి జాగ్రత్తగా చూడాలి.

పార్టు -2 :- పట్టాదారుని వివరములలో సాదారణముగా ఈ లోపాలు జరుగుతూ ఉంటాయి. చని పోయినవారి పేరుతో భూమి ఉండటము, మ్యూటేషన్ జరిగినా పహాణీలో మార్పు చేయకపోవడము మ్యూటేషన్ జరగక పోవడం, క్లరికల్ తప్పిదములు, వెబ్‌సైట్ నందు నమోదు చేసిన డేటాలో ఉన్న పేరుగల పట్టాదారు కనిపించకపోవడం మొదలైనవి ఉంటాయి.

పార్టు-3 :- వ్యవసాయేతర భూములు నమోదు చేయునప్పుడు(NALA) ఉత్తర్వులు ఉంటే వెంటనే పహాణీలో నమోదు చేయవలెను. భూ సేకరణ జరిగి అవార్డు అయినవి/ అవార్డు అనంతరం జరగవలసిన ప్రక్రియలో ఉన్న భూములకు చట్టపరమైన వివాదములు లేకుంటే వెంటనే నమోదు చేయాలి.సివిల్ మరియు రెవిన్యూ కోర్టులలో వున్న భూ వివరములును ఒక ప్రత్యేకమైన రికార్డు నందు నమోదు చేయాలి.

6. గ్రామమునకు వెళ్ళడానికి ముందుగానే వ్యవసాయ, వ్యవసాయేతర భూములలో మార్పు చేయడము, 1-బి పట్టాదారు వారిగా వివరములను తయారు చేసుకొని ఆ కాపీలను గ్రామమునకు వెళ్ళినప్పుడు పట్టాదారుని / వ్యవసాయ దారునికి ఇచ్చిన యెడల అది వారికి నోటీసు వలె ఉపయోగపడును. ప్రతి గ్రూపు వారు వారు వెళ్ళబోయే మండలము, గ్రామములో వారియొక్క కార్యచరణ ప్రణాళికను తయారు చేసుకొని దానిని కలెక్టర్ గారికి ముందుగా తెలియజేయడము వలన జిల్లా స్థాయి పర్యావేక్షణ సులభమౌతుంది. గ్రామములకు గ్రూప్‌లవారు వచ్చే సమయమునకు ముందుగా ప్రజలందరికి వీరి గురించిన సమాచారము ఇవ్వడము. ఆ జిల్లా మండల, గ్రామ ప్రజా ప్రతినిధులందరితో కలిసి ఒక సమావేశమును నిర్వహించడము. వారి సహాయ సహకారాలతో గ్రామములో రికార్డులను స్వచ్ఛీకరించుట చేయవలెను. దీనికి డివిజనల్ స్థాయిలో తహసిల్దారు అధికారుల సలహా, సంప్రదింపులు జరగవలెను.

7. గ్రామములను వెళ్లెటప్పుడు గ్రూప్‌ల వారు సేత్‌వారు, సేల్‌సా పహాణీ, గ్రామపటము, ఆధునిక పహాణీ, 1-బి రిజిస్టరులతో పాటు వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలను నమోదు చేసుకొనులకు ఒక ప్రత్యేక రిజిస్టరు, పట్టాదారులు ఇచ్చిన నోటీసులు నమోదు చేసుకొనుటకు ఒక రిజిస్టరు, ఇందులో పట్టాదారుని సంతకము తప్పనిసరిగా తీసుకోవాలి. సర్వేకు సంబంధించిన సమస్యలు, కోర్టు కేసులు వ్రాసుకొనుటకు ఒక రిజిస్టరు, 1-బి మార్పు చేయుటకు పట్టాదారు వద్ద నుండి అనుమతి తీసుకొనుటకు ఒక రిజిస్టరు వెంట తీసుకొని వెళ్ళాలి.

8. గ్రూప్ వారు గ్రామమునకు వచ్చే నాటికి క్షేత్ర స్థాయిలో ముందుగానే పట్టావదారులకు/ వ్యవసాయదారులకు తెలియజేయవలసిన భాధ్యత ఆ మండల తహసిల్దారుది. ఆ గ్రామములో దండోర వేయించి తెలియజేయడము (గ్రామసభ)/ రైతు సభను మొట్టమొదటి సారిగా కూడలినందు నిర్వహించి భూ దస్త్రాల స్వచ్ఛీకరణ యొక్క ముఖ్య ఉద్దేశ్యమును తెలపాలి. 1-బి కాపీలను పట్టాదారునికి ఇచ్చి ముట్టినట్లుగా వారి వద్ద నుండి రసీదు తీసుకోవాలి. క్షేత్రస్థాయిలో పరిశీలించేటప్పుడు వ్యవసాయేతర భూములు, భారత ప్రభుత్వ ఆస్తులు, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులను వేరుగా, ప్రత్యేకంగా నమోదు చేయాలి. గ్రామంలోని రైతులు మరియు ఇతరుల అభ్యంతరాలను నమోదు చేయడం అత్యంత ముఖ్యము.



9. చట్టబద్దముగా చేయవలసిన పనులు : తెలంగాణ రాష్ట్ర భూమిపై హక్కులు మరియు పట్టాదారు పాసుపుస్తక చట్టం 1971 అనంత సవరణ చట్టముల ద్వారా తహసిల్దారుకు పాస్ పుస్తకము నందు మార్పులు చేయుటకు, పునరుద్దరించు అధికారము కలదు. క్షేత్ర స్థాయిలో పూర్తిగా పరిశీలించిన తరువాత ఏ విధమైన తగాదాలు లేని భూములకు మాత్రమే ఈ మార్పులను చేయాలి.

రెండవ సారి (గ్రామసభ) రైతుసభ నిర్వహించి ఆ సభలో వ్యవసాయేతర భూముల వివరములు, కేంద్ర ప్రభుత్వ ఆస్తులు, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తి వివరములు చదివి వినిపించడము. 1-బి నందు వచ్చిన మార్పులను చదివి వినిపించడము చేయాలి. 1-బి లో వచ్చిన మార్పులను పట్టాదారు పాసు పుస్తకములోను ఆ సంవత్సర పహాణీలోనూ, వెంటనే నమోదు చేయాలి. వీటన్నింటిని చట్టములలోని నిబంధనల ద్వారానే చేయాలి.

10. ప్రభుత్వ భూములను పేదలకు మంజూరు చేసినవి (అసైన్డ్)వచ్చినప్పుడు మంజూరు పొందిన వ్యక్తి పేరు పైనే భూమి ఉన్నటైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తరువాత 1-బి నందు నమోదు చేసి, ఆ కాపిని నమోదు పొందిన వ్యక్తికి అతని సంతకము తీసుకొని ఇవ్వవలెను. దిశానిర్దేశం చేసింది అ భూమి మంజూరు పొందిన వ్యక్తి కాకుండా ఇతరుల అనుభవములో ఉన్నటైతే వారి వివరములు వారి ఆర్థిక స్థితిగతులను కూడా ప్రత్యేకంగా నమోదు చేయాలి.

11. అటవీ భూముల వివరములను సమగ్రంగా సేకరించాలి. సర్వేనంబరు, విస్తీర్ణము, వాటి ప్రస్తుత పరిస్థితి మొదలైనవి వ్రాయాలి.

12. నీటి వనరులను కూడా సర్వే నంబరు వారిగా ఎంత ప్రాంతములో విస్తరించి ఉన్నవి, నీరు వచ్చే ఆధారము అనగా నది, ఏరు, చెరువు వర్షాధారము మొదలైనవి వ్రాయాలి.

ఈ మొత్తము ప్రక్రియ పూర్తయిన తరువాత క్షేత్ర స్థాయిలో జరిగిన మార్పులు, చేర్పులతో ఒక సమగ్ర నివేదికను తయారు చేసి జిల్లా కలెక్టర్ గారికి పంపించవలెను.

**పట్టాదారులు/వ్యవసాయదారులు, ప్రజలు అనుసరించ వలసినవి :**

క్షేత్ర స్థాయిలో పరిశీలనకు వచ్చిన అధికారులకు పూర్తిగా సహకరించడము అనగా తమ వద్ద గల పట్టాదారు పాసుపుస్తకములు, టైటిల్ డీడ్స్, సదాబాయి నామాలు (కాగితాలు) చూపించాలి. భూములను ప్రవేటు వ్యాపారుల వద్ద తాకట్టు పెట్టినచో భూమికి సంబంధించిన (పత్రాలు ఉండవు కాబట్టి) వాటి రసీదులు, ప్రభుత్వ రంగ బ్యాంకుల వద్ద రుణాలు పొందిన, సహకార సంస్థల వద్ద రుణాలు పొందిన వాటి రసీదులు తీసుకొని రావలేను వంశపారంపర్యంగా భూములు సంక్రమించిన వాటికి వారి వారసుల మధ్య పంపకము జరిగినచో వారందరు హాజరుకావడము. భూమి యాజమాన్య తగాదాలలో కోర్టుకు వెళ్ళినవారు వాటి వివరములను తీసుకురావడము ప్రుత్వం భూములు ఆక్రమించుకొన్న వారు, లీజుకు తీసుకున్న వారు ఇంకా ఇతరములు(భూయాజమాన్య హక్కులు కోరుకునే వారు) ఈ కార్యక్రమమునకు హాజరు కావడమే కాకుండా ఈ కార్యక్రమము సక్రమముగా, సమగ్రముగా పూర్తి అగుటకు సహకరించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భూ దస్త్రాల స్వచ్ఛీకరణ ప్రక్రియను విజయవంతము చేసి తెలంగాణ ప్రభుత్వము నూతనముగా తయారు చేయనున్న ధరణి వెబ్‌సైట్ నందు భూముల నమోదులు పూర్తిగా తగ్గించుటకు మనమందరము మన వంతుగా కృషి చేద్దాం.

**- శ్రీ పద్మావతి,** సీనియర్ అసిస్టెంట్, టిఎస్ఐఆర్‌డి

# స్వచ్ఛ తెలంగాణ దిశగా పరుగులు




ప్రస్తుతం పారిశుద్ధ్య సాధనలో మన గ్రామ పంచాయితీల ముందున్న సమస్యల ప్రాధాన్యతా క్రమంలో బహిరంగ మలవిసర్జనదే మొదటి స్థానం. ఎందుకంటే గ్రామీణ ప్రాంతాల్లో వదిలి వేసిన మానవ మలంలో వ్యాధిని కలిగించే క్రిములు అతి పెద్ద సంఖ్యలో ఉంటాయి. అవి మన గ్రామంలోకి, మన ఇంటిలోకి, మనం తినే ఆహారంలోకి, మనం త్రాగే నీటిలోకి వివిధ వాహకాల ద్వారా చేరుకొని వ్యాధులు కలిగిస్తాయి.

అంతేకాదు ఈ సమస్య ప్రజారోగ్యం, తద్వారా గ్రామీణ ప్రజల ఉపాధి, ఎదుగుదల పై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపించటమే కాకుండా, మహిళల మర్యాద, భద్రతలకు కూడా భంగం కలిగిస్తుంది. ఇంటిలో మరుగుదొడ్డి సౌకర్యం లేకపోవడం లేదా కట్టిన మరుగుదొడ్డి వివిధ కారణాల వలన వాడకపోవడమే ఈ సమస్యకు మూలం.

ఈ సమస్య తీవ్రతను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం పారిశుద్ధ్య ప్రణాళికలో బహిరంగ మలవిసర్జన నిర్మూలనకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. కేవలం మరుగుదొడ్ల నిర్మాణాలే కాకుండా, రాష్ట్రం బహిరంగ మల విసర్జనరహిత స్థితికి చేరుకోవటమే లక్ష్యంగా నిర్ణయించుకొని గ్రామ పంచాయితీలకు సంబంధిత శాఖలకు స్పష్టంగా, విపులమైన మార్గదర్శకాలను ఇచ్చింది.

తెలంగాణ రాష్ట్రం 2018 అక్టోబర్ నాటికి స్వచ్ఛ తెలంగాణను నిర్మించడానికి రాష్ట్రాన్ని బహిరంగ మలవిసర్జనా రహితంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. దీనిలో భాగంగా జిల్లా, మండల, గ్రామ పంచాయతీ స్థాయిలో రాష్ట్ర స్వచ్ఛ భారత్‌మిషన్ వారు ఐ.ఇ.సి కార్యక్రమాలను, మరుగుదొడ్డి నిర్మాణం సక్రమ వాడకం శాతాలను పెంచే కృషిని ముమ్మరం చేశారు. ఇప్పటికే గణనీయమైన ఫలితాలను సాధించటం జరిగింది.

రాష్ట్రంలో ఇప్పటికి పదకొండు జిల్లాలు ఓ.డి.ఎఫ్‌గా ప్రకటించబడ్డాయి. మిగతా జిల్లాలు కూడా ఓ.డి.ఎఫ్‌గా మారడానికి అధికారులు, అధికారేతరులు, స్వచ్ఛంద సంస్థలు స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి సంబంధించిన ప్రేరకులు, స్వచ్ఛతా దూతలు, స్వచ్ఛాగ్రహిలు ఇతర కార్యకర్తలు కృషి చేస్తున్నారు. 2014 లో మరుగుదొడ్ల నిర్మాణంలో 27 శాతంగా ఉన్న స్థితి నుండి నేడు 87.5 శాతానికి చేరింది. ఇదే పంథాలో ఇనుమడించిన ఉత్సాహంతో మొత్తం తెలంగాణ రాష్ట్రాన్ని సమిష్టిగా బహిరంగ మల విసర్జనారహితం చేయటానికి మనమందరం పాటుపడదాం.

ఉద్యమస్థాయిలో చేపట్టిన స్వచ్ఛ్ తెలంగాణ కార్యక్రమాల్లో రాష్ట్ర స్వచ్ఛ్ భారత్‌మిషన్‌కు సిపార్డ్ తనవంతు సహకారం అందిస్తుంది. కొద్ది నెలలుగా వివిధ వర్గాలకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తూ జిల్లాలు త్వరితగతిన బహిరంగ మలవిసర్జనా రహితంగా మారటానికి దోహదం చేస్తుంది. ఈ క్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్ అమలుకు సంబంధించిన వివిధ అంశాల పై వివిధ వర్గాల అధికార అధికారేతర కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమాలు ఇక ముందు కూడా నిర్వహించబడతాయి.

**– ఎ.నాగేశ్వరరావు**
**నీరు మరియు పారిశుద్ధ కేంద్రం, టిఎస్ఐఆర్‌డి**

# మిషన్ భగీరథతో ఇంటింటికీ త్రాగునీరు

ఇంటింటికీ సురక్షిత త్రాగునీరు, అందించాలనే బృహత్తర ఆశయంతో ప్రతిష్ఠాత్మకమయిన మిషన్‌భగీరథ ప్రాజెక్టును గౌ.ముఖ్యమంత్రి శ్రీ.కె.చంద్ర శేఖర్ రావు గారి ఆలోచన మేరకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్టు ప్రజలకు త్రాగునీటి కష్టాలు తొలగించి వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు దోహదం చేస్తుంది.

ఈ ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ ప్రాంతాలలోని కుటుంబాలకు 100 ఎల్‌పిసిడి చొప్పున, పట్టణ ప్రాంతాలలో 135 ఎల్‌పిసిడి చొప్పున నగర ప్రాంతాలలో 150 ఎల్‌పిసిడి చొప్పున నీరందించాలనీ, అదే విధంగా ఈ ప్రాజెక్ట్‌లోని నీటి లభ్యతలో 10 శాతం భాగాన్ని పరిశ్రమలకు అందించాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు.

**ప్రాజెక్ట్ పరిధి**

హైదరాబాద్ నగర అవుటర్ రింగ్ రోడ్‌కు వెలుపలగా వున్న అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాలను త్రాగునీటి నెట్‌వర్క్‌తో అనుసంధానించే విధంగా ప్రణాళికలు రచించబడ్డాయి. గ్రామీణ ప్రాంతాలలో 24,248 ఆవాసాలలో గల 52.18 లక్షల కుటుంబాలను, నగర/పట్టణ ప్రాంతాలలోని 65 మున్సిపాలిటీలకు సంబంధించిన

12.52 లక్షల కుటుంబాలను అనుసంధానించడం జరుగుతుంది.

ప్రస్తుతం మనుగడలో వున్న అన్ని రకాల త్రాగునీటి పథకాలను మిషన్ భగీరథ ప్రాజెక్ట్‌తో అనుసంధానించి, వాటి సామర్థ్యాలను పెంచుతారు.

ప్రతి ఇంటికీ అనుసంధానిస్తున్న మంచినీటి పైపుల నెట్ వర్క్‌తో పాటు హైస్పీడ్ ఆప్టికల్ ఫైబర్ తంత్రిని (కేబుల్) కూడా, గ్రామాలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కలుగ చేసేందుకు నీటి పైపులతో కలిపి అమరుస్తున్నారు.



ఈ ప్రాజెక్టులో, 65 మున్సీపాలీటిలకు గ్రామీణ నీటి సరఫరా శాఖ నీరందిస్తుండగా, అవుటర్ రింగ్ రోడ్ లోపల వైపున 7 మున్సిపాలీటీలు 183 గ్రామ వంచాయితీలకు మరియు జి.హెచ్.యం.సి.కి హైదరాబాద్ మహానగర నీటి సరఫరా జలమండలి నీరందిస్తుంది.

**నీటి వనరులు – నీటి లభ్యత**

2018 సం..నాటికి ప్రధానమయిన రిజర్వాయర్‌ల నుండి 42.67 టి.యం.సిల నీరు ఈ ప్రాజెక్ట్‌కు వాడుకోవాలని ప్రణాళికలు రచించడం జరిగింది. జలాశయాలనుండి నీరు వాడుకునేందుకు అనుమతులు కూడా రావడం జరిగింది.

| | |
|---|---|
| కృష్ణానదీ, ఇతర ఉపనదులు మరియు జలాశయాల నుండి నీటి లభ్యత | 19.00 TMC |
| గోదావరి నది ఉపనదులు మరియు జలాశయాల నుండి నీటి లభ్యత | 23.67 TMC |
| మొత్తం | 42.67 TMC |

పరిపాలనపరమైన అనుమతులు గ్రామాల్లో అంతర్గత పైప్‌లైన్ నెట్ వర్క్ ఏర్పాటుకు, ట్రాన్స్ మిషన్ వ్యవస్థ ఏర్పాటుకు, ఇన్‌టెక్ అరేంజ్ మెంట్స్ కొరకూ ఇప్పటివరకు 43,791.13 కోట్ల రూపాయల విలువైన పనులకు అనుమతులు ఇవ్వడం జరిగింది.

**మిషన్ భగీరథ విశేషాలు**

- మిషన్ భగీరథను మొత్త 26 సెగ్మెంట్లుగా విభజించారు.
- తెలంగాణ రాష్ట్ర భూ నైసర్గిక లక్షణాల ఆధారంగా, 98% ప్రాజెక్ట్ డిజైన్‌ను గ్రావిటీ (భూమ్యాకర్షణ) ఆధారంగా సరఫరా అయ్యే విధంగా రూపొందించారు.
- ప్రాజెక్ట్‌కు అవసరమయిన మొత్తం పైప్‌లైన్ 1.44 లక్షల కి.మి.. దీనిలో కొత్తగా వేస్తున్న పైప్‌లైన్ 1.006 లక్షల కి.మీ..
- పైప్‌లైన్ వేస్తున్న ప్రాంతాలలో, రైట్‌ఆఫ్ యూజర్ ఇన్ ల్యాండ్ (ఆర్‌ఓయు) చట్టాన్ని అనుసరించి రైతుల భూములను సాధీన పరచుకోకుండా, పనులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ నీటి సరఫరాశాఖకు అనుమతులు ఇచ్చింది.
- మొత్తం ప్రాజెక్ట్‌కు, 235 మెగా వాట్ల విద్యుత్తు అవసరం
- రాష్ట్ర ముఖ్యమంత్రి చైర్మెన్‌గా, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదరి మెనేజింగ్ డైరెక్టర్‌గా తెలంగాణ రాష్ట్ర నీటి సరఫరా కార్పొరేషన్ ఏర్పరచారు.

19 ఇన్‌టేక్ స్ట్రక్చర్స్, 153 నీటి శుద్ధీకరణ ప్లాంట్స్, 554 సంపులు / జీఎల్‌బిఆర్‌ఎవ్ 579, మరియు 49,276 కి.మి. ట్రాన్స్‌మిషన్ పైప్‌లైన్ నిర్మించబడినాయి.

మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ త్రాగు నీరు అందించడం ఒక ఎత్తైతే గ్రామ పంచాయితీ పరిధిలో అంతర్గత వ్యవస్థ యొక్క సుస్థిర నిర్వహణ మరొక ఎత్తు ఈ ప్రాజెక్టు ద్వారా సుస్థిర ప్రాతిపదికమైన నీటి సరఫరా జరగాలంటే అటువంటి నిర్వహణ గురించి శిక్షణా కార్యక్రమాలు జరపాల్సిన అవసరం ఉంది. తరువాత గ్రామ పంచాయతీలకు ఈ బాధ్యత ఇవ్వటం జరుగుతుంది. ఈ దృక్పధంలో సర్పంచ్‌లకు, గ్రామ నీరు పారిశుధ్య కమిటి సభ్యులకు, పంచాయతీ సెక్రటరీలకు తగిన అవగాహన ఉండటం అవసరం.

పంచాయతీ సెక్రటరీలలో అవగాహన పెంచాలనే ఉద్దేశ్యంతో సిపార్డ్‌లో గ్రామీణ త్రాగునీరు వ్యవస్థ మరియు మిషన్‌భగీరథ పైన పెద్ద స్థాయిలో 2 రోజుల శిక్షణా కార్యక్రమాలను రాష్ట్ర నీరు మరియు పారిశుధ్యశాఖ సహకారంతో టిసిపార్డులో నిర్వహించటం జరిగింది. ఇంతవరకు 16 బ్యాచ్‌లు నిర్వహించటం జరిగింది. 530 పంచాయితీ సెక్రటరీలు శిక్షణకు హాజరయ్యారు. అలాగే గ్రామ నీరు మరియు పారిశుధ్య సమితీ సభ్యులకు శిక్షణ ఇచ్చి నిమిత్తం రెండు బ్యాచ్‌ల TOT మార్చ్ నెలలో నిర్వహించడం జరిగింది. శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు మండల స్థాయిలో విడబ్యూఎస్‌సి సభ్యులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**– ఎ.విద్యుల్లత**
**నీరు మరియు పారిశుద్ధ కేంద్రం, టిఎస్‌ఐఆర్‌డి**

# "సాఫ్ట్‌వేర్ నుంచి పచ్చని వ్యవసాయంలోకి వచ్చి ఉత్తమ ఆచరణలు అమలు చేసిన యువరైతు"

కరీంనగర్ జిల్లా లక్ష్మిపూర్ గ్రామంలోని ప్రదీప్‌రెడ్డి - శ్రీమతి శ్రవాణిలు కొన్ని నెలల క్రితం సింగపూర్ దేశంలో ఎస్ఏపి కన్సల్‌టెంట్‌గా నెలకు 4 లక్షల అర్జన చేస్తూ నివశిస్తూ ఉండేవారు. 8 సంవత్సరాలు (బి.టెక్-ఐటిలో) ఉద్యోగం చేసిన సంతృప్తి పొందలేదు. తల్లిదండ్రుల అనుబంధం, తమ గ్రామంలో చిన్ననాటి నుండి తన తండ్రితో కలిసి (ఎమ్.రాజిరెడ్డిగారు) పొలంపనులు, కూరగాయల సాగు, పచ్చని తోటలు, పక్షుల రాగాలు, కలుషితం లేని నీరు, మనుష్యుల మధ్య గడిపిన ఈ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఊరికి తిరిగి వచ్చి- ప్రాజెక్ట్ పద్ధతిలో వ్యవసాయం చేస్తూ ఎంతో లాభాలు పొందుతున్నారు.

**భూమి వివరాలు:** లక్ష్మీపూర్‌లో 5 ఎకరాలు సొంతం, అట్లే గుమ్లాపూర్‌లో కౌలుకు 17 ఎకరాలు బావి, కరెంటు, కమతాలను ఎన్నుకోవటం జరిగినది.

**విత్తనములు - పంటలు - ఉత్పత్తి లక్ష్యం వివరాలు:** 1. టమాట 1 ఎకరం - జె.కె.-దేశీ రకం, 2. బీరకాయలు 5 ఎకరాలు - నామ్‌దారి, పద్మజ, 3. కాకరకాయ 2 ఎకరాలు - యుఎస్-33, 4. సోరకాయ 1 ఎకరం - వెల్‌కమ్ రకము, 5. మునగకాయ 3 ఎకరాలు - పి.కె.-ఎమ్-ఐ, 6. కూరదోశ అరెకరం, 7. బోడకాకర, అరెకరం, 8. చిక్కుడు 1 1/2 ఎకర, జాగృతి & రాణి రకం, 9. పచ్చిమిర్చి 1 ఎకర, 10. కొత్తిమీర, మెంతి, ఉల్లి, 11. దీనితో పాటు బంతిపూలు 2 ఎకరాలు - యు.ఎస్-202, లక్కిఆరెంజ్ రకం అట్లే పాలిహౌజ్ వారి కప్సికల్, ఇతర కూరగాయలు మార్కెట్ చేస్తూ నేటి గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గదర్శిగా మారినారు.

**ఉత్పత్తి లక్ష్యం:** సుమారు కూరగాయాలు కనీసం 8 టన్నుల నుండి 10 టన్నుల వరకు 3 నెలలో కాలములో ఉత్పత్తికి ఆధునిక వ్యవసాయ విధానాలు, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం భూమి గుళ్ళబారేలా దున్ని, బెడ్స్ (పెద్దభోజ)పై మల్చింగ్ ఆకృతిలా గూధరాము మాదిరి పందిరిలు వేసి, డ్రిఫ్ విధానంలో నీటి యాజమాన్యం చేపట్టి, గడ్డికలుపు, కూలీఖర్చులు మొదలగు చరవ్యాయాలు తగ్గింపు చర్యలు గైకొంటూ సేంద్రియ కూరగాయాలు అధిక ఉత్పత్తులు సాధించి అందిరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

**విత్తము:** 10 లక్షల మొత్తాలు సమకూర్చుకొని, మొదటి 3 నెలల నుండి మూల ధనము మొత్తంతో పాటు దినము వచ్చే లాభాలు కలిపి పెట్టుబడి పెట్టుతూ గ్రామీణ మహిళలకు 9 మందికి ఉపాధి, 3 గ్రామీణ యువతకు స్థిర జీవనోపాధి కల్పిస్తూ (సగటున రోజుకు రూ.150-200 లోపు) ఆధునిక వ్యవసాయ విధాన నైపుణ్యాలు పెంపొందిస్తూ వేతన పెంపుదలకు చేయూతనందిస్తున్నారు.



**విపణి:** మార్కెట్‌లో లాభాలు అమ్మకంపైన ఆధారపడియుంటాయి. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, గ్రేడింగ్ చేసి, కూరగాయలు కోసేవారికి శాస్త్రీయ విధానాలపై శిక్షణ ఇచ్చి, సకాలంలో మార్కెట్‌కు ఒక కారు, ఒక ఆటోలతో ట్రాన్స్‌పోర్టు చేస్తూ జిల్లాలో ఎస్.ఆర్.ఆర్.కాలేజీ, సెయింట్ జౌన్ స్కూల్, అంబేద్కర్ స్టేడియం, రైతుబజార్‌లలో ఉదయం 5.30 నుండి 11.00 వరకు సాయంత్రం 4 నుండి 9 వరకు అమ్మకాలు చేస్తూ వినియోగదారులతో చాలా అప్యాయతతో మాట్లాడి నమ్మకం నిలబెట్టుకోనేలా నాణ్యత కల కూరగాయలు ఇస్తారు.

నిత్యం అవసరమైన కూరగాయలు విలువ గొలుసు విశ్లేషణతో ఉత్పత్తి - ప్రక్రియ, మార్కెట్-వ్యాపార వ్యవస్థను అత్యధికంగా ధరలు పలికే నెలలో ఉత్పత్తి అందేలా, డిమాండ్-డ్రివెన్ విధానంను అమలు చేస్తూ క్రిమిసంహారక మందు చాలా తగ్గించి ఎన్.పి.యమ్ విధానంతో సేంద్రియ పద్ధతిలో మార్కెట్ ధోరణిని బట్టి అమ్మకాలు చేసి అధిక లాభాలు ఆర్జిస్తూ 'రైతు-రాజు'లా జీవించే వ్యవసాయ విధానంలో మార్పులకు కృషి చేస్తున్నారు. ఐ.టి. ఇంజనీరంగ్‌గా 'థింక్.... గ్లోభల్లి... అక్ట్ లోకల్లి" విశ్వవిజ్ఞానంను పల్లెలలోని స్థానిక రైతులు వాడుకొనేలా సమాచారం అందిస్తున్నారు.

సెల్‌ఫోన్.. సమాచార విప్లవంలో వచ్చిన మార్పులతో ఇళ్ళలో, హాస్టల్స్, రోడ్‌సైడ్ దుకాణాలు, సప్లమ్ చేయనున్నారు. టమోటో ఉత్పత్తికి సరిపడా డిమాండ్ - ధర లేనప్పుడు సరుకు నిల్వ శీతలయంత్రాలు, అట్లే పచ్చళ్ళు, సాస్‌లు మొ॥లగు ఉప ఉత్పత్తులు తయారీ చేయాలనే ఆలోచనలతోయున్నారు.

సనాతన సంప్రదాయ విత్తన విధానాలు (పూర్వము పెద్ద మొక్కజొన్న కంకులు ఏరి ఎండబోసి విత్తనాలు దాచేవారు, వరి బెరుకులు తీసి పంజకొట్టే విత్తనం దాచేవారు. సోర, బీర, టమోటా, వంకాయలను

పూర్తి పండినవి. వాటికి అవే ఎండినవి తెలంగాణాలో ప్రతి ఇంట్లో యుండేవి, ఈ విధానాలు మళ్లీ పునరుజ్జీవింపజేయాలి. గ్రామాల్లో ఆచరణకు తేవాలి అని పలు రైతులు తమ అనుభవాలు తెలిపారు.

ప్రతి ఇంటిలో రెండు పళ్ళ చెట్లు (వేస్టు వాటర్ వినియోగించి) అల్లే కిచెన్ గార్డెన్‌తో తాజా కూరగాయలు పొందేలా పౌష్టికాహారం అందరికి దొరికేలా మనమందరం బాధ్యత తీసుకొని జనజాగృతం చేయాలి. బంగారు తెలంగాణకు బాటాలు వేయాలి అన్నారు. భారతదేశం అత్యంత యువకులు గల దేశం సుమారు 79%. 2020 నాటికి యువత సగటు వయస్సు 29 సం॥రాలు ఉంటుంది. ఐఎమ్ఎఫ్ వారి నివేదిక ప్రకారం 60 కోట్ల మంది ఉన్నారు. ఈ దేశంలో ఉద్యోగ-ఉపాధి నైపుణ్య మానవశక్తి 34 లక్షలు మాత్రమే. కనీసం ఇది 50 కోట్లకు పెరగాలి. అల్లే సమగ్ర ప్రగతికి సహజ వనరులను గరిష్టస్థాయిలో వినియోగంపై మానవ వనరులకు జీవనోపాధులు పొందే నైపుణ్యాలు, వినూత్న విధానాలు, సృజనాత్మకతలను ఉపయోగించేలా... ఆర్థిక విద్య కల్పిస్తూ వ్యవసాయ పరిశ్రమలు (ఉదా.మామిడి- పచ్చళ్ళు, ఫల్ప్ పరిశ్రమలు, ప్రత్తి జిన్నింగ్, స్టెర్ లైజడ్ కాటన్, పప్పులు గ్రేడింగ్-ప్యాకింగ్ పరిశ్రమలు, పనిదినాలు పెరిగేలా, ఆదాయాలు పెంచేలా) నెలకొల్పాలి. అల్లే ద్వితీయ సేవరంగాలలో ఉద్యోగ అవకాశాలు పెంపొందించాలి. లేనట్లయితే యువత పెడదారులు పట్టేలా ఉంది. దుష్పరిణామాలను ఎదుర్కోవలసి రావటం చాలా బాధకరం అని వారి తండ్రిగారు ఎమ్.రాజరెడ్డి, తల్లి శ్రీమతి మోహనమ్మ గారు తెలిపారు.

నిరుద్యోగంతో పాటు ఆహార కొరత, ఆకలి, పేదరికం సమస్య తీవ్రమౌతుంది. కనీస పోషకాహారం లేక రక్తహీనత, ప్రొటీన్లు తగ్గి బడిపిల్లల శక్తి, తెలివితేటలు, ఎదుగుదల లోపిస్తున్నాయి. ప్రజాపంపిణీ, మధ్యాహ్న భోజన పథకం, ఐసిడిఎస్, ఎమ్‌జిఎన్ఆర్ఇజిఎస్ ల ద్వారా ఆధారపడుతున్నారు. ప్రతి కుటుంబంలోని వ్యక్తులకు జీవనోపాధులు, ఉద్యోగాలు, ఆదాయాలు పెరగాలి. స్వావలంబన సాధించేలా సాధికారత-సుస్థిరత కోసం అందరం సమిష్టిగా ప్రయత్నించాలి. ఆకలి, పేదరికంను తరిమికొట్టే ప్రణాళికలు రూపొందించాలి. నగదు/ వ్యాపార పంటలు తగ్గేలా.... మిశ్రమ ఆహారపంటలు, పండ్లతోటలు, హార్టికల్చర్ పెంచాలి. క్రొత్త ఆవిష్కారాలకు యువత ముందు రావాలి. అల్లే పాఠశాల విద్య నుండే "చెప్పింది విను" అని ఒత్తిడి/ శాసించే తల్లిదండ్రులు, 'నువ్వు... నీ వెదవ సందేహాలు కూర్చో!' అని నిరుత్సాహపరిచే గురువులు, చిన్నతనం నుండే ప్రత్యక్ష ప్రయోగాలు ల్యాబ్స్ సమకూర్చలేని ప్రభుత్వ పాఠశాలలు, ఈ స్థితి పరిస్థితులలో విద్యార్థులు 'వికాసం' విజ్ఞానం - స్వీయ నైపుణ్యాలు, పరిణతి చెందిన వైఖరులు, పెంపొందేందుకు శాస్త్రీయ ఆలోచనలు కోసం ఇన్నోవేషన్ హబ్‌లు, సైన్స్ మ్యూజియంలు, సైన్స్ క్లబ్బులకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుంది.



మన తెలంగాణలో టి-హబ్, సైన్స్ సిటి మంజూరి కావటం జరిగింది. యు.ఎస్.ఏ మాదిరి 10 లక్షల జనాభాకు 4700 మంది శాస్త్రీయ/ సామాజిక పరిశోధకులు ఉన్నారు. మనదేశంలో ఆ సంఖ్య 140 లోపు చాలా తక్కువగా ఉన్నారు. అవసరాలు/ సమస్యలు గుర్తించి సవాళ్ళ మూలకారణాలు తెలుసుకొని శాస్త్రీయ విద్య ద్వారా పరిష్కార మార్గాలు గుర్తించి ఆచరించి ప్రగతి సాధిస్తున్నారు.

గత కరీంనగర్ జిల్లాలో కూరగాయల సాగుకు 11 మండలాలు పల్లె ప్రగతి ద్వారా పందిరి పద్ధతి ద్వారా అమలు చేస్తున్నారు. దానితో పాటు పాడి (ఆవులు/గేదెలు/మేకలు/గొర్రెలు) - పంటలతో నిరుపేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చేయూతనందిస్తున్నారు. ఆదాయాలు పెరిగేలా సెర్ప్-డిఆర్‌డిఎల ద్వారా ఋణ, సాంకేతిక విజ్ఞానం అందజేస్తున్నారు.

గ్రామీణాభివృద్ధిలో... పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి, ఆర్థిక అభివృద్ధికై యువతలో యువకర్షకులను సంఘటితపరచి సమాఖ్య సంఘాలుగా ఏర్పాటు చేసి శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, ఆధునిక సమాచారం అందజేస్తూ మన వ్యవసాయ ఉత్పత్తులు విశ్వ విఫణిలో అమ్మకం జరిగి అధిక లాభాలు వచ్చేలా ప్రభుత్వం మరింత పోత్సహకాలు అందించాలి.

వ్యవసాయ పరిశ్రమలకు (విత్తనశుద్ధి పరిశ్రమలు, కాటన్ జిన్నింగ్ పరిశ్రమలు, వస్త్ర, చేనేత పరిశ్రమలు, పప్పుదినుసుల పరిశ్రమ - ట్రెడ్ ఇన్ - ట్రెడ్ అవుట్ పట్టిక ద్వారా అంచనాతో అనేక గ్రామీణ వ్యవసాయాధారిత పరిశ్రమలు, డైరీ, పౌల్ట్రీ, రైసుమిల్లులు, మంచినూనెల పరిశ్రమలు, కరీంనగర్ జిల్లాలో ముల్కనూర్ సహకార సొసైటీ ద్వారా స్వయం-సమృద్ధి సాధిస్తున్న తీరు అక్కడి నిరుద్యోగ యువతకు అక్కడే ఉద్యోగాలు కల్పన అన్ని గ్రామాలకు ఆదర్శం కావాలి. గ్రామీణ యువ పారిశ్రామికవేత్తలకు విరివిగా అవకాశాలు కల్పించి ఎమ్.ప్రదీప్‌రెడ్డి గారు చేస్తున్నట్లుగా అన్ని గ్రామాల యువత ఊరిలో మంచి పనులు చేయాలి. విజ్ఞానంను విదేశాల్లో అమ్మకుండా మన తెలంగాణలోనే అమ్మనాన్నల కమ్మనైన (అమృతం కన్నా మిన్న) ఆత్మీయ అనుబంధాలకు వాటి చుట్టూ అల్లుకున్న మమత, మానవతా, మానవీయ విలువలకు ప్రాధాన్యం ఇచ్చి నూతన ఉపాధి ఉద్యోగాలు గ్రామాల్లో సృష్టించి... వట్టిపోయిన తెలంగాణ పల్లెలను మళ్లీ ప్రగతి వైపుకు సమిష్టిగా అందరి భాగస్వామ్యంతో సాధించాలని ఆశిద్దాం.

**- కోట సురేందర్,** జిల్లా ప్రజాపరిషత్, కరీంనగర్



# వర్మీ కంపోస్టు తయారీ విధానం ఇలా..

**వ్య**వసాయరంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులు రైతులకు శాపంగా మారుతున్నాయి. ప్రస్తుత కాలంలో రైతులు రసాయనిక ఎరువులను విరివిగా వాడుతున్నారు. దీంతో భూసారం తరిగి పోతున్నది. దీంతోపాటు రసాయన ఎరువుల వాడకం వల్ల ఖర్చు ఎక్కువవుతున్నది. వీటికి బదులుగా తమ పంట పొలాల్లో సేంద్రియ ఎరువులను తయారుచేసుకుంటే రైతులు అధిక దిగుబడులు పొందవచ్చు.

ప్రత్యేకమైన వానపాములను సేంద్రియ వ్యర్థ పదార్థాల మీద ప్రయోగించి తయారుచేయబడిన కంపోస్టు ఎరువునే వర్మీ కంపోస్టు ఎరువు అంటారు. వానపాముల రక్షణ కోసం, పందిర్లు లేదా షెడ్‌లు వేసుకోవాలి. పాత గోనెసంచులను తడిపి వర్మీ కంపోస్టు బెడ్‌లపై కప్పుకోవాలి. పశువుల ఎరువులో నత్రజని 0.75 శాతం భాస్వరం 0.17 శాతం, పొటాష్ 0.55 శాతం ఉంటాయి. అయితే వర్మీ కంపోస్టులో సూక్ష్మ పోషకాలు రసాయన ఎరువుల కన్నా 50 శాతం అధికంగా ఉంటాయి. వ్యవసాయ ఉత్పత్తుల వ్యర్థాలు, ఎండిన ఆకులు, పేడ, పండ్ల తొక్కలు, కూరగాయల వ్యర్థాల లాంటివి వర్మీకంపోస్టు ఎరువు తయారీకి ఉపయోగపడుతాయి.

**బెడ్‌ల తయారీ:**

భూమికి సమాంతరంగా మూడు అడుగుల వెడల్పు, ఏడు అడుగుల ఎత్తుతో పాటు వీలైనంత పొడవుగా బెడ్‌లు ఏర్పాటు చేసుకోవాలి. బెడ్ అడుగు భాగం దృఢంగా ఉండేలా చూసుకోవాలి. ఈ విధంగా ఏర్పాటు చేసుకున్న బెడ్‌లపై 15 సెంటిమీటర్ల ఎత్తువరకు వ్యర్థ పదార్థాలను ఉంచి నీళ్లు చల్లుకోవాలి. తర్వాత 10 సె.మీ. మందంలో పశువుల పేడను వేసినతర్వాత 10 రోజుల పాటు నీళ్ళు చల్లుతూ ఉండాలి. 10 రోజుల తర్వాత చదరపు మీటర్‌కు 1000 వానపాములను బెడ్‌లను కదిలించి వేయాలి. బెడ్‌లపై వరిగడ్డిని కప్పివేయడం వల్ల బెడ్‌లపై కప్పలు, చీమలు, పక్షులు ఇతర కీటకాల నుంచి వానపాములను కాపాడుకోవచ్చు.

వానపాములు ఆఫ్రికన్ రకానికి చెందినవై ఉండాలి. యూడ్రిల్లస్ యూగి నే, అయిసీనిడా ఫోడిడా, పెరిమానిక్స్ ఎక్స్‌క్రేటస్, లుంబ్రికస్ రూబెల్లస్ వానపాము జాతులను వాడుకుంటే మేలు. ఈ వానపాములు బెడ్‌లో వేసిన వ్యర్థ పదార్థాల ను ఆహారంగా తీసుకొని 60-80 రోజుల్లో వర్మీ కంపోస్టులను తయారుచేస్తాయి. వర్మీ కంపోస్టును బయటకు తీయడానికి ఐదు రోజుల ముందు నీరు చల్లాలి. ఈ విధం గా చేయడం వల్ల వానపాములు తేమను వెతుక్కుంటూ అడుగు భాగానికి చేరుతాయి.

ఈ విధంగా తయారైన వానముల ఎరువును 3 ఎంఎం జల్లెడలో జల్లించి సంచుల్లో నింపుకోవాలి. తరువాత నీడ ప్రాంతాల్లో నిల్వచేసుకోవాలి. ఎరువును తొలిగించిన బెడ్‌లపై వ్యర్థపదార్థాలను శుభ్రపరిచి మళ్లీ వర్మీకంపోస్టు ను తయారుచేసుకోవచ్చు. ఇలా ఏడాదికి 6 సార్లు తయారు చేసుకోవచ్చు. ఒక హెక్టారుకు 3 టన్నుల వరకు వర్మీ కంపోస్టును వివిధ పంటల్లో రైతులు వాడుకోవచ్చు. దీనివల్ల రైతులు నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు. ఈ ఎరువును పండ్ల తోటల్లోని ప్రతీ చెట్టుకు వయస్సును బట్టి 10 కిలోల వరకు కూడా వాడుకోవచ్చు.



## ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకము ద్వారా

# లబ్దిపొందిన లబ్దిదారుల విజయగాధలు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చాలా మంది పేదవారికి వరంగా మారిందని చెప్పుటకు సందేహం లేదు. దానికి ఉదాహరణగా సిద్ధిపేట మండలం నందు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ద్వారా లబ్ధిపొందిన తమ బ్రతుకులు బాగు చేసుకున్న వారి విజయగాధలు వివరించడమైనది.

సిద్ధిపేట మండలంలోని చిన్నగుండవెల్లి గ్రామంలో వనం పేద్మ కనకయ్య (జాబ్ కార్డ్ నెం.072). వీరు 2006కు పూర్వం వీరి కులవృత్తి పందులను పెంచుకునేవారు. వీరు ఎస్టీ కులమునకు చెందినవారు. వీరికి ప్రభుత్వం ఐఏసి భూమిని ఇచ్చింది. వీరికే కాకుండా ఆ ప్రాంతంలో మొత్తం ముగ్గురికి కలిపి 5 ఎకరాల భూమిని ఎస్టీ కులస్తులకు ఇవ్వడం జరిగింది. అట్టి భూమి సాగుకు అనుకూలంగా లేక రాళ్ళు, రప్పలతో పొదలతో కలిపి ఉండేది. ఆ భూమిని వీరు తీసుకోవడం జరిగింది. కాని దానిలో ఎలాంటి సాగు చేయకనిరుపయోగంగా ఉండేది. ఆ భూమిలో 2007 సం॥లో ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా పొదల తొలగింపు, భూమి చదును కార్యక్రమం, రాళ్ళతొలగింపు, మట్టికట్టల నిర్మాణ తదితర పనులను చేయటం ద్వారా మొత్తం 5 ఎకరాల భూమి సాగులోకి రాగా తద్వార వర్షాధార పంటలైన మొక్కజొన్న, ప్రత్తి, పెసర తదితర ఆరుతడి పంటలను పండించటం ద్వారా వారికి కొంత భూమిపై నమ్మకం కల్గి మామిడితోటలను సైతం పెంచుకోవాలన్న కోరిక బలంగా ఉండేది. వారు అది కేవలం పెద్దవారికే నన్న అపోహ యుండేది. వీరు ఎన్ఆర్ఇజిఎస్లో కూలీలుగా ప్రతిరోజు రావడం పనిప్రదేశంలో మామిడితోటలపై తెలియజెప్పటం ద్వారా వీరు ఆకర్షితులై మొత్తం 5 ఎకరాలలో మామిడి తోటలను పెంచుకొనుటకు ముందుకురావటం జరిగింది. మామిడి తోటతో పాటు వ్యవసాయ బావి సైతం తవ్వుకోవడం జరిగింది. అందులో వనం పద్మ తనకు గల ఒక ఎకరంలో 70 మామిడి మొక్కలతో బాటు 100 టేకు మొక్కలు, తర్వాత 100 ఎర్రచందనం మొక్కలు నాటి 100% మొక్కలను సంరక్షించుకోవటం జరుగుతుంది. వీరితో మాతో పాటు ప్రతినిత్యం అక్కడ ఉంటూ అంతర పంటలుగా కూరగాయలను పండిస్తూ ప్రతివారం సిద్ధిపేటలో విక్రయిస్తూ ఉంటారు. ఎలాంటి పనికి రాని భూమిని సాగులోనికి తీసుకొచి రావడం మరియు పండ్ల తోటలను పెంచేటట్లు పూర్తిస్థాయిలో సంతృప్తి వ్యక్తం చేయటం జరిగింది. వీరికి గుంతల త్రవ్వకం, ఎరువులు, 3 సం॥ నిర్వహణ మరియు డ్రిప్ సౌకర్యం కల్పించడం జరిగింది. 2009-10 సం॥లో తీవ్ర నీటి ఎద్దడి యున్న సందర్భంలో నీటిని కొనుగోలు చేసి బిందెల ద్వారా నీటిని మొక్కలకు అందజేసి మొక్కలను అత్యంత శ్రద్ధతో పెంచుకోవడం జరిగింది. వీరికి అంతర పంటల ద్వారా నెలకు సుమారుగా ఖర్చులు పోను 15000 నుండి 20000 వరకు ఆదాయం రావడం జరుగుతుంది.

మామిడి ద్వార సంవత్సరమునకు సుమారుగా రూ.60,000/- నుండి 70,000/-ల వరకు ఆదాయం రావడం జరుగుతుంది.

వీటిని స్వయంగా వీరే అమ్ముకోవడం జరుగుతుంది. వీరు ఇప్పటికి ఎన్ఆర్ఇజిఎస్ లో ప్రతి సం॥ 100 రోజులు పనిచేయట జరుగుతుంది. వీరు ఎన్ఆర్ఇజిఎస్ వల్ల పూర్తిస్థాయిలో కుటుంబం ఋణపడియుంటామని చెప్పటం జరిగింది. వీరు వీరి యొక్క కులవృత్తి పందుల పెంపకం మానివేయటం జరిగింది. ఎన్ఆర్ఇజిఎస్లో కూలీ పనితో పాటు పూర్తిస్థాయిలో వ్యవసాయం కూరగాయల పెంపకం చేపట్టుచున్నారు. ఎక్కువగా టమాట, మిర్చి, వంకాయ మరియు తీగజాతి కూరగాయలు సైతం పండించి ఆర్థికంగా సంతృప్తిగా పూర్తిస్థాయిలో జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె కలదు. వీరిని చదివించుచున్నారు. కూతురు డిగ్రీ చదువుచున్నారు. వీరికి గల పాత ఇంటిని పూర్తిస్థాయిలో మరమ్మత్తు చేయించుకోవటం జరిగింది.

ఆదిలాబాద్ జిల్లాలోని చెన్నూర్ మండలం 207 కి.మీ. దూరంలో ఉన్న పూర్తిగా ఒక మారుమూల మండలం. ఈ చెన్నూర్ మండలంలో ఎక్కువమంది మన్నెం వారు నాయక్పోడ్, కోయజాతులు, రెడ్డితగాండ్ల తెగల జాతులు జీవనం సాగిస్తున్నాయి. ఈ ప్రాంతంలో అనాధిగా వస్తున్న సంప్రదాయ పద్ధతులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా చెన్నూర్ ఈ ప్రాంతంలో ప్రభుత్వ పథకాలు చాలా దాదాపు బాగానే అమలవుతున్నాయి. కానీ జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా అమలవుతున్న వివిధ పథకాలు పూర్తిస్థాయిలో ఓ బడుగు బలహీన వర్గాలకు (సి.ఎల్.డి.పి., వాటర్షెడ్, ఎమ్.జి.వి.ఎన్ మరియు హార్టికల్చర్) మొదలైన పథకాలు పూర్తి స్థాయిలో కాకున్న 60% కుటుంబాల వారి బతుకుల్లో వెలుగులు చూడగలం.

ఈ మధ్యకాలంలో భారతదేశ ప్రభుత్వం వలసలు నివారించి దారిద్యపు రేఖ నుంచి దూరంగా ఉంచడానికి పేదలలో ఆత్మస్థైర్యాన్ని నింపడానికి వారు ఉన్న ఊరిలోనే జీవించి తన వారితో జీవించడానికి పేదలకు వరప్రసాదిని మన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వారి బతుకు జీవనంలో వెలుగు దివిటీగా పనిచేస్తున్నది.

దీనికి ఉదాహరణగా చెన్నూర్ మండలానికి మూడు కి.మీ.ల దూరంలో ఉన్న కిష్టంపేట గ్రామంలో చాలా కుటుంబాలు 80 నుంచి 90 రోజులు ఉపాధిని పొంది ఉన్నారు. అందులో ఒక కుటుంబందైనేని లస్మయ్య, తండ్రి బొందయ్య, లస్మయ్యకు 44 సం. భార్య చిన్నక్క 42 సం॥. వీరు షెడ్యూల్ తెగ (న్యాకపోడ్) వర్గానికి చెందినవారు. వీరి



జాబ్కార్డ్ నం. 192475101012010003, వీరికి ఇద్దరు కుమారులు. మహేందర్ మొదటి అబ్బాయి 8వ తరగతి మరియు రెండవ అబ్బాయి రాజశేఖర్ 4వ తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వీరికి ఒక ఇల్లు రెండు రూములు అస్బెస్టాస్ రేకులతో కూడిన ఇల్లు ఉంది. వీరికి 1 ఎకరం భూమి కలదు మరియు వర్షాభావం వల్లనే పండుతుంది. వీరి వృత్తి పూర్తిగా కూలీపైనే ఆధారపడి ఉంది. వీరి జీవనం ప్రస్తుతం ఆశాజనకంతోనే ఉంది. ఎందుకంటే ప్రభుత్వ పథకాలు రాకముందు కూడా కూలీ పనిచేసేవారు. అప్పుడు మగవారికి రూ.45 మరియు ఆడవారికి రూ.30 వచ్చేవి. వీరి కుటుంబ పరిస్థితి అంతంత మాత్రమే ఉండేది. కాబట్టి సం॥నకు 10,000 నుండి 15,000 వరకు 5% వడ్డీతో అప్పు చేసి అవి తీర్చలేక నానా అవస్థలు పడేవారు.

ఆ సమయంలోనే 2005 సం॥లో భారత ప్రభుత్వం పార్లమెంటరీ వ్యవస్థ ద్వారా భారత దేశ పేదలకు ఒక అమృతమైన ఒక చుక్కలాగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకము (ఎమ్.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. 100 రోజుల పని) ఒక చట్టం ద్వారా ప్రతి కుటుంబానికి 100 రోజుల కూలీ ఇవ్వడానికి ప్రభుత్వం హామీ ఇస్తుంది.

ఈ నమ్మకంతోనే ప్రస్తుత మనదేశంలో కొన్ని కోట్లమంది పేదలు ఆత్మసైర్థ్యంతో కూడిన జీవితం గడుపుతున్నారు. దీనికి దైనేని లస్మయ్య, తండ్రి బొందయ్య భార్య చిన్నక్క కుటుంబం వారి జీవితం మచ్చుతుకన. ఈ పథకం ప్రారంభించక ముందు 5% చొప్పున అప్పుతెచ్చేవారు. ప్రస్తుతం రూ.1500-2000 వరకు పొదుపు కూడా చేయగలుగుచున్నారు. వీరు ఈ పథకం డబ్బుల ద్వారా తమ అవసరాలకు ఒక బీరువా, ఒక టివి కొనుగోలు చేశారు. అదే విధంగా తమ గ్రామంలోని కూలీలందరికీ కూడా ఆదర్శంగా నిలుస్తున్నారు.

**– టి.యం.కె.గాంధీ, జెఆర్పి, సి.ఎన్.ఆర్.ఎమ్, టిఎస్ఐఆర్డి**

# అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మనం రెండు విషయాలను నిరూపించాలి..ఒకటి మన రైతులు యావత్తు దేశాన్ని,ప్రపంచాన్ని పోషించగలిగే సామర్థ్యం ఉన్న వారని,రెండు వారి జేబులు నింపడానికి వ్యవసాయానికి తగిన సామర్థ్యం ఉందని నిరూపించాలని ఆకాంక్షించిన ప్రధాని నరేంద్రమోదీ వ్యవసాయరంగం 4 శాతం అభివృద్ధి సాధించేలా లక్ష్యం పెట్టుకున్నారు.తమ ప్రభుత్వ ప్రాధామ్యాలలో వ్యవసాయరంగం కూడా ఒకటని ప్రకటించారు.భారత ఆర్థిక రంగానికి వ్యవసాయమే వెన్నెముక.దేశంలోని 58 శాతం గ్రామీణ కుటుంబాలకు వ్యవసాయమే జీవనాధారం. దేశ స్థూలజాతీయోత్పత్తిలో వ్యవసాయం,అనుబంధ రంగాల వాటా 17 శాతంగా కలదు.అంతే కాకుండా దేశంలోని అత్యధిక ప్రజలకు ఉపాధిని కల్పిస్తున్నది కూడా వ్యవసాయరంగమే. గ్రామీణ ముఖ చిత్రం అధికంగా గల భారత్‌లో సాంప్రదాయకంగా వ్యవసాయరంగం సంక్రమిస్తున్నది.దేశంలో వ్యవసాయరంగం గతంతో పోల్చితే ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నది. వ్యవసాయరంగము అభివృద్ధే లక్ష్యంగా నిర్ణయించుకున్న ప్రధాని నరేంద్రమోడీ 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసి అన్నదాతకు ఆదాయ భద్రత కల్పించాలని నిర్ణయించుకున్నారు. దేశంలో 26 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు ఉత్పత్తవుతున్నాయి.దేశ ఎగుమతుల్లో వ్యవసాయ ఉత్పత్తులు 10శాతం వాటాను ఆక్రమించి ఉన్నాయి.పాడి పరిశ్రమలో ప్రపంచంలోనే మన దేశం మొదటి స్థానంలో ఉంది.చక్కెర ఉత్పత్తిలో రెండవ స్థానం ఆక్రమించింది. గోధుమ, వరి పంటల్లోనూ ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్నాము. అయినా వ్యవసాయరంగం రైతులకు పూర్తి విశ్వాసాన్ని కల్పించలేకపోతోంది. అతివృష్టి, అనావృష్టి లాంటి వాతావరణ మార్పుల దృష్ట్యా రైతుల పరిస్థితి జూదంలా మారిపోయింది. మునుపెన్నడూ లేని రీతిలో దేశంలో వ్యవసాయరంగంను వదిలి వెళ్ళుతున్న వారి సంఖ్య అధికమవుతోంది.ముఖ్యంగా యువకులు, విధ్యాధికులు వ్యవసాయరంగం పట్ల విశ్వాసాన్ని కనబరచడం లేదు. దేశంలో పారిశ్రామిక,సేవారంగాల అభివృద్ధి అధికమవుతుండడంతో ఆయా రంగాల వైపు దృష్టి సారించే వారి సంఖ్య అధికమవుతోంది. ఇలాంటి పరిస్థితిని గమనించిన ప్రభుత్వం 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న కృతనిశ్చయంతో పలు పథకాలను ప్రవేశపెట్టింది.

దేశ మొత్తం భూభాగం 32 కోట్ల హెక్టార్లు కాగా అందులో 15 కోట్ల హెక్టార్లలో వ్యవసాయముసాగు అవుతున్నది.దేశంలోని మొత్తం భూభాగంలో 48.15 శాతం వ్యవసాయరంగానికి ఉపయోగపడుచున్నది. ప్రపంచంలో బంగ్లాదేశ్ అత్యధిక శాతం భూమిని వ్యవసాయానికి వినియోగిస్తున్నది.బంగ్లాదేశ్ తమ భూభాగంలోని 68.6 శాతం భూమిని వ్యవసాయానికి ఉపయోగిస్తున్నది.ఆ తరువాత 55.3 శాతంతో ఉక్రెయిన్ దేశం ప్రపంచంలోనే రెండవ స్థానాన్ని ఆక్రమించగా, వ్యవసాయానికి అధిక భూభాగాన్నివినియోగిస్తున్న మూడోదేశంగా మన దేశం నిలిచింది.ప్రపంచంలో రెండవ అతిపెద్ద జనాభా కలిగిన దేశంగా ఉన్న మన దేశానికి వ్యవసాయరంగమే అత్యధికులకు ఉపాధిని కల్పిస్తూ,దేశ ప్రగతికి తనవంతు తోడ్పాటును అందిస్తున్నది. వ్యవసాయరంగం ను వదిలివెళ్తున్నవారి సంఖ్య అధికమగుచుండగా నేటికీ వ్యవసాయరంగమే అధిక జనాభాకు ఉపాధిని కల్పిస్తూ దేశపురోభివృద్ధికి ఊతమిస్తున్నది. నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి ఆధునిక భారత్ నిర్మాణము దిశగా అహర్నిశలు శ్రమిస్తూ క్రొత్త పుంతలు తొక్కిస్తున్నారు.సాంప్రదాయ వ్యవసాయ రంగానికి సైతం ఆధునిక హంగులుదిద్దడానికి పలు కార్యక్రమాలను రూపొందిస్తున్నారు.మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా లాంటి ఆధునిక భారత నిర్మాణమే కాకుండా డిజిటల్ పద్ధతులను వ్యవసాయ రంగంలోనూ ప్రవేశపెట్టాలని ఏకీకృత వ్యవసాయ విపణి (యూనిఫైడ్ అగ్రికల్చర్ మార్కెట్) ని సైతం ప్రవేశపెట్టి దేశంలో ఎక్కడైనా రైతు తగిన ధరకు తమ ఉత్పత్తులను విక్రయించే విధంగా ఏకీకృత వ్యవసాయ విపణిని రూపొందించారు.రైతులు తమ ఉత్పత్తులను తక్కువ ధరకు దళారులకు విక్రయించకుండా తగిన కనీస మద్దతు ధర పొందేలా విపణిని ప్రవేశపెట్టడం జరిగినది.దేశంలో జన్‌దన్‌యోజనద్వారా గ్రామీణ ప్రజలు బ్యాంకింగ్ వ్యవస్థలోకి ప్రవేశించి, రైతులు తమ ఉత్పత్తులను విక్రయించగా




వచ్చే నగదును నేరుగా రైతు ఖాతాలోకి వెళ్ళే విధంగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఇలా దేశంలో జామ్ (జన్‌ధన్ యోజన,ఆధార్,మొబైల్) ల సహాయంతో రైతులు వ్యవసాయరంగం పట్ల మరింత చేరువయ్యేలా రైతులకు సౌకర్యవంతముగా ఉండేలా పలు దిద్దుబాటు చర్యలతో ప్రభుత్వం రైతుల్లో సరికొత్త ఆశలను రేకిత్తిస్తున్నది.దేశంలోని రైతుల స్థితిగతులను మార్చివేసి ఆధునిక వ్యవసాయరంగాన్ని అందించే విధంగా రైతులను సమాయత్తం చేస్తున్నది.

ప్రభుత్వం వ్యవసాయం, వ్యవసాయ అనుబంధరంగాల అభివృద్ధి పట్ల ఆసక్తిని కనబరిచి రైతు సంక్షేమ రాజ్యంగా, రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా రైతన్న అభివృద్ధే ధ్యేయముగా ముందుకు సాగుతున్నది. జాతీయఆహారభద్రత మిషన్ సహా పది పథకాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి కృషోన్నత్ యోజనను ఏర్పాటు చేశారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి పరంపరాగత్ కృషి వికాస్ యోజనకు శ్రీకారం చుట్టడం జరిగింది. ప్రతి బొట్టుకు మరింత పంట అన్న నినాదంతో ప్రధానమంత్రి గ్రామసించాయి యోజన ను ప్రవేశపెట్టి ప్రతి పొలానికి సాగునీరు అందించాలన్న లక్ష్యంతో, దీనితో పాటు సూక్ష్మసేద్యం, వాటర్ షెడ్ మేనేజ్‌మెంట్ తో పాటు వ్యవసాయరంగానికి కావలసిన సాగునీరు అందించే విధంగా నదుల అనుసంధానం వంటి నూతన ఒరవడితో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టి వేగవంతముగా పనులను చేపడుతున్నది.వ్యవసాయరంగంతో పాటు అనుబంధరంగాలైన పాడిపరిశ్రమ, కోళ్ళపరిశ్రమ మరియు ఇతర అనుబంధ రంగాల అభివృద్ధికి సమప్రాధాన్యతను కల్పిస్తూ రైతు ఆదాయ భద్రతను రెట్టింపు చేయాలని పూనుకున్నది.వ్యవసాయరంగంలో ఆధునిక విధానాలు అధికంగా ప్రవేశించక,మూస దోరణితో కొనసాగుతుండడం వలన సాంకేతికంగా వ్యవసాయరంగం వృద్ధిలోకి రావడం లేదు. వ్యవసాయరంగంలోనూ, రైతులకు శాస్త్రీయ ఫలాలను అందించి సాంకేతికంగా వేగవంతముగా అభివృద్ధిపథములో పయనించాలని పరిశోధన ఫలితాలు ప్రయోగశాల నుంచి పొలానికి (ల్యాబ్ టూ ల్యాండ్) అందేలా తగు చర్యలు చేపడుతున్నది. గ్రామీణ జీవనమే అధికంగా దేశంలో గ్రామీణ ప్రాంతాల్లోనే వ్యవసాయరంగం అధికంగా కలదు. అలాంటి వ్యవసాయ జనులకు శాస్త్రీయ ఫలితాలు అందించకపోతే ఖచ్చితత్వం లభించక అభివృద్ధిలో వెనుకంజవేసే ప్రమాదము పొంచి ఉన్నది.కావున ప్రభుత్వము నేరుగా శాస్త్రీయ ఫలితాలు రైతులకు చేరవేసి వారిని విజ్ఞానవంతులుగా మార్చితేనే వ్యవసాయరంగం ఆధునికతను సంతరించుకుంటున్నదని భావించిన ప్రభుత్వము ల్యాబ్ టూ ల్యాండ్ ను ప్రవేశపెట్టింది.రైతులందరికీ భూసార కార్డులు పంపిణీ చేసే కార్యక్రమము ప్రారంభించబడినది. దేశంలో ఎరువుల వాడకం విచ్చలవిడిగా కొనసాగుతున్నది. అశాస్త్రీయమైన విధానాలతో భూమిలోని లవణాలతో సంబంధంలేకుండా ఎరువుల వాడుతుండడం వలన భూసారం కోల్పోవడమే కాకుండా,రైతులకు అనవసర ఖర్చును కలిగించి అధిక దిగుబడి రాక,సాగు ఖర్చు ఎక్కువయి రెంటికి చెడ్డ రేవడిలా రైతులు తయారవుతున్న దుస్థితికి అడ్డుకట్టవేయాలని భూసారకార్డుల పంపిణీని ప్రారంభించింది.ఎరువుల కొరతను నివారించడమే కాకుండా రైతులకు నేరుగా ఎరువుల రాయితీని అందించే చర్యలను ప్రభుత్వం ప్రారంభించింది.దేశంలో ఎరువుల కొరత లేకుండా చూడడానికి నాలుగు ఎరువుల కర్మాగారాలను పున:ప్రారంభించాలని, ఇరాన్ దేశ భాగస్వామ్యంతో ఒమన్ దేశంలో ఎరువుల కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ఇలా రైతన్నకు వెన్ను దన్నుగా ప్రభుత్వం నిలబడి, అన్నదాతలల్లో ఆదాయ భద్రత తద్వారా జీవన ప్రమాణాలు పెంపొందించాలని ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతున్నది.

దేశ వ్యవసాయరంగ అభివృద్ధికి అవరోధంగా పరిణమించిన వసతుల లేమిని రూపుమాపాలని వివిధ బడ్జెట్‌లలో పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయరంగానికి, రైతుల సంక్షేమానికి కేటాయించిన మొత్తాలు ప్రభుత్వం రైతుల ఆదాయంను రెట్టింపు చేసే పలు వినూత్న కార్యక్రమాలకు పెద్దపీట వేసింది.ఆరుగాలం కష్టించినా వాతావరణ మార్పుల జూదంలోచిక్కుతున్న రైతుకు పంట ఉత్పత్తులు ఇంటికి చేరేదాకా అనుమానంతో అభద్రత గూడుకట్టుకుంటున్నది. అలాంటి అభద్రతను రూపుమాపి వ్యవసాయానికి రైతులకు భద్రత



కల్పించాలని మోదీ సర్కారు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజనను ప్రవేశపెట్టింది. తాజా బడ్జెట్‌లో 5,500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం 2019 నాటికి 50 శాతం పంట విస్తీర్ణానికి భీమా కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నది. దేశ వ్యవసాయరంగ చరిత్రలో ఇదొక కీలక పరిణామంగా భావించవచ్చు. రైతుల సంక్షేమాన్ని,భద్రతను కాంక్షించిన ప్రభుత్వం అతి తక్కువ ప్రీమియంతో ప్రవేశపెట్టిన పంటల భీమా వ్యవసాయ నిపుణుల ప్రశంసలందుకుంటోంది. కానీ విభిన్న వాతావరణ పరిస్థితులు,వివిధ భౌగోళిక పరిస్థితులు కలిగిన మనదేశంలో పంటలభీమా సమర్ధవంతంగా అమలు చేయడము పైననే ఫలితాలు ఆధారపడి ఉంటాయి. పంటల భీమా పథకమును కేంద్రము,రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా ఖర్చును భరిస్తూ అమలు చేయవలసి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రము,రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకుసాగుతేనే పంటల భీమా పథకము రైతులకు ధీమాను కల్పిస్తుంది. పంటల భీమా విజయవంతం చేసినట్లయితే రెట్టింపయినఉత్సాహంతో రైతులు ఆదాయ భద్రతతో ఆత్మవిశ్వాసం పెరిగి దేశ వ్యవసాయ రంగం క్రొత్త పుంతలు తొక్కుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అంతే కాకుండా వ్యవసాయరంగ అభివృద్ధికి ఇతోధికంగా ఉపయోగపడేటటువంటి గోదాములు,శీతల గిడ్డంగులు,సాగునీటి సదుపాయాలు,యాంత్రికీకరణ, దిగుబడి పెంచే సాంకేతికత మరియు రైతులకు ప్రోత్సాహకాలను కల్పించే విధముగా ప్రభుత్వము చర్యలుతీసుకొంటున్నది. భూసార కార్డుల జారీతో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడము, భూసారాన్ని కాపాడడము, వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులను తగ్గించడము లాంటి బహుళ ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వము భూసార కార్డుల పంపిణీకి పూనుకున్నది. పరంపరాగత్ కృషి వికాస యోజన ద్వారా రానున్న మూడేళ్ళలో 5 లక్షల ఎకరాల్లో సేంద్రీయ సాగును ప్రోత్సహించాలని నిర్ణయించుకున్నది. వ్యవసాయరంగ అభ్యున్నతే ధ్యేయముగా ఆవిర్భవించిన కృషి విజ్ఞాన కేంద్రాల పనితీరు మెరగుపరిచి రైతుల్లో ఆధునికతను పెంపొందించాలని ప్రభుత్వంముందుకు సాగుతున్నది.



దేశంలోని వ్యవసాయము,దాని అనుబంధ రంగాలను సంయుక్తంగా అభివృద్ధి పథంలో పయనింపజేస్తేనే పరస్పర సహాయకారిగా, రైతుల్లోనూ ఆదాయమార్గాలు పెరిగి సమతూకంతో ముందుకు సాగుతుంది. వ్యవసాయరంగము అభివృద్ధికి సాగునీటి సదుపాయము,అధిక దిగుబడినిచ్చే మేలిమి విత్తనాలు,భూమిలో సారాన్ని తెలిపే పరిజ్ఞానముతో కూడిన భూసారకార్డులు,పంటకాలమునకు అనువుగా ఎరువు,పురుగుమందుల వాడకం,రైతులకు సకాలములో రుణాల పంపిణీ, ఆధునిక యంత్రపరికరాల వాడకము,పంటకు కనీస మద్దతు ధర,ఆధునిక పనిముట్లు,ఎరువులు సబ్సిడీకి సకాలములో అందించడం లాంటి చర్యలు సంపూర్తిగా చేపడితేనే వ్యవసాయరంగం మనుగడ కొనసాగుతూ ఎదుగుదలకు చేరుకుంటుంది. అందుకు కావలసిన అన్ని చర్యలను ప్రభుత్వం 2017-18 బడ్జెట్‌లో తగిన కేటాయింపులు పొందుపరుస్తూ లక్ష్యసాధనకు బాటలు వేసింది. వ్యవసాయ రుణాలపై వడ్డీ భారం నుంచి రైతులకు ఉపశమనం కలిగించాలని తగినబడ్జెట్‌ను కేటాయించి రైతులకు సత్వరమే రుణాలు,అత్యధికులకు రుణసదుపాయం అందించడమే అంతిమ లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. సమాజంలో విప్లవాత్మక మార్పులకు ఉద్యమించి,బడుగు వర్గాల జీవితాల్లో వెలుగులు నింపాలని అహర్నిశలు శ్రమించిన భారతజాతి ముద్దుబిడ్డ అంబేద్కర్ పుట్టినరోజైన ఏప్రిల్ 14 న సాంకేతిక విజ్ఞానంతో వ్యవసాయ మార్కెట్లను అనుసంధానించే జాతీయ వ్యవసాయ విపణి (నామ్) కి అంకురార్పణ జరగడం శుభ పరిణామం. జాతీయ వ్యవసాయ మార్కెట్ ద్వారా దేశంలోని 585 మార్కెట్లను 2018నాటికి అనుసంధానం చేస్తారు. నామ్ ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థ మెరుగుపడడమే కాకుండా కనీస మద్దతు ధర రైతులకు నేరుగా చేరుతుంది. నామ్ ఏర్పాటుతో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ క్రయ,విక్రయాలు పెరిగి, భారీ మార్పులకు లోనయి రైతు తమ పంటను పోటీ తత్వం తో మెరుగయిన ధరలకు దేశంలో ఏ చోటికి అయినా విక్రయించే వెసులుబాటు కలుగుతుంది. వ్యవసాయ రంగ చరిత్ర లో ఇదొక అపూర్వ ఘట్టం. దేశంలో వ్యవసాయ ఉత్పత్తులకు సరియైన మార్కెట్ ధర లభించక ఆరుగాలం శ్రమించిన ఉత్పత్తులు అతితక్కువ ధరలకు



విక్రయించుకోవడం జరుగుతూ ఉండేది. అలాంటి మోసకారి విధానాలకు గండికొట్టి రైతుల్లో నూతన ఆశలు చిగురిస్తున్నాయి. దళారులు,కమీషన్ ఏజెంట్లు,బడా వ్యాపారుల కోరల్లో చిక్కుకుని బక్కరైతులు విలవిలలాడే దుస్థితి నుండి జాతీయ వ్యవసాయ విపణి వ్యవస్థ గట్టెక్కిస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. దేశంలో సుమారుగా 7300 పెద్ద మార్కెట్లు,28 వేల వరకు గ్రామీణ చిన్న మార్కెట్లు,సంతలు నడుస్తున్నాయి. గ్రామీణ మార్కెట్లు కొన్ని శక్తులు, సంస్థల చేతుల్లో బందీగా ఉండడం వలన గరిష్ట ధర అనేది గగన కుసుమంగా మారింది.రైతు పండించే పంటను అమ్ముకోవడానికి సగటున అయిదు కిలోమీటర్ల దూరంలో మార్కెట్ సదుపాయం ఉండాలి.దేశంలో సగటున 80 కిలోమీటర్ల దూరం వరకు పంటలు తరలించాల్సి వస్తోంది. మేఘాలయ వంటి రాష్ట్రాల్లో వందల కిలోమీటర్లు పంటలను తరలిస్తే తప్ప మార్కెటింగ్ సదుపాయం లభించదు. ఇలా మార్కెట్ దురాభారంగా,వ్యయ ప్రయాసలతో కూడుకొని



ఉన్న తరుణంలో జాతీయ వ్యవసాయ మార్కెట్ రైతులకు మోదీ ప్రభుత్వం అందించిన వరంగా చెప్పవచ్చు.నామ్ అమలు కోసం కేంద్రం 200 కోట్లను కేటాయించింది.రైతు పండించిన పంట సరియైన ధరలకు అమ్ముకొని గరిష్ట ధర లభిస్తేనే రైతే రాజు అనే నానుడి నిజం అవుతుంది. నామ్‌లు రైతులకు సరియైన మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించే విధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చొరవ చూపాలి.

వ్యవసాయ అనుబంధ రంగమైన పాడి పరిశ్రమకు దేశంలో ఎనలేని గిరాకీ ఉన్నది.పాడి పరిశ్రమను ప్రోత్సహించడానికిగాను నాలుగు పథకాలను ప్రకటించి 850 కోట్లు కేటాయించడం జరిగింది.పశువుల ఆరోగ్యానికి సంబంధించి పశుధన్ సంజీవనిలో భాగంగా పాడి పశువులకు నకుల్ స్వస్థ పత్ర పేరుతో ఆరోగ్య కార్డులు జారీ చేస్తారు.పశు సంపద వృద్ధి లక్ష్యంగా అధునాతన సంతానోత్పత్తి విధానాలు అమలు చేయడం. ఈ-పశుధన్ హాత్ పేరుతో ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యం, జాతీయ జినోమ్ కేంద్రాల ఏర్పాటు ద్వారా దేశీయ పశు జాతుల అభివృద్ధి చేయడం లాంటి నాలుగు పథకాల అమలు తో పాడిపరిశ్రమ రంగము అభివృద్ధి పథంలో పయనిస్తున్నది. దీనికి తోడు దేశంలోని ఎరువుల రాయితీలో ప్రత్యక్ష నగదుబదిలీ విధానాన్ని దేశంలోని ఎంపిక చేసిన కొన్ని జిల్లాల్లో అమలు చేస్తున్నారు.ఎరువుల తయారీ సంస్థలకు చెందిన 2000 విక్రయశాలల్లో రానున్న మూడేళ్ళలో భూసార,విత్తన పరీక్షలకు ఏర్పాట్లు చేయడం జరుగుతుంది.తద్వారా ఎరువుల రాయితీలోని దుబారాను అరికట్టి ఎరువుల వాడకం తగ్గించడం,ప్రత్యామ్నాయ మార్గాల వైపుకు మళ్ళించడం లాంటి చర్యలతో చేపట్టబోవు సంస్కరణలు రైతులకు ఆదాయభద్రతను రెట్టింపు చేస్తాయనడంలో ఎలాంటి సందేహము లేదు.ఇప్పటికే మోదీ ప్రభుత్వంచేపట్టిన పలు రైతు సంక్షేమ పథకాలు వ్యవసాయరంగ అభివృద్ధికి, రైతుల్లో వ్యవసాయం పట్ల విశ్వాసాన్ని పెంపొందించే దిశగా ముందుకు సాగుతున్నాయి.దేశంలో 125 కి పైగా వేర్వేరు వాతావరణ జోన్లుఉన్నాయి. దానితో పాటు భూసారాన్ని పరిగణన లోకి తీసుకొని దేశ వ్యాప్తంగా వ్యవసాయ కమతాల మ్యాపింగ్ శాస్త్రీయంగా జరగాలి. సీజన్లు, ప్రాంతాల వారీగా దేశంలో ఎక్కడ ఏ పైరు సాగు ఎప్పుడు అనుకూలమో మదింపు వేసి,స్వీయావసరాలు,ఎగుమతి అవకాశాల్ని గణించి అందుకు అనుగుణంగా పంటల ప్రణాళికను తయారుచేసి అమలు పరిచే విధంగా సమగ్ర వ్యవసాయ కార్యాచరణను రూపొందించాలి. అప్పుడే స్వామినాథన్ చెప్పినట్లు తుపాకులున్న దేశాలది కాదు, తిండి గింజలు ఉన్న దేశాలదే భవిష్యత్తు అన్న వ్యాఖ్య నిజమవుతుంది.ప్రభుత్వం ఉపాధి హామీ పథకము వ్యవసాయంతో కొంత మేర అనుసంధానం చేసి నీటివనరుల అభివృద్ధి,పచ్చి రొట్ట తయారీకి 10 లక్షల కుంటల నిర్మాణము చేయడం లాంటి పనులతో కూలీ లభించడమే కాకుండా వ్యవసాయరంగ అభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడుతుంది.ఇలా పలు నూతన విధానాల అమలుతో పటిష్టమైన వ్యవసాయరంగ అభివృద్ధికి బాటలు వేయడమే కాకుండా వ్యవసాయం,తయారీ,సేవా రంగాలు సమస్థాయిలో వృద్ధి చెందితేనే ఆర్థిక ప్రగతి,సామాజిక పురోగతి సాకారమవుతాయంటూ ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలు నిజమవుతాయి.రైతులు కేవలం పంటల సాగుకే పరిమితం కాకుండా పశుపోషణ,కోళ్ళ పెంపకం,కలప నిచ్చే వృక్షాలు పెంపకము చేపడితే వారి ఆదాయ భద్రతకు ఢోకా ఉండదని నరేంద్ర మోదీ ఉద్బోధించిన విధంగా వ్యవసాయము,వ్యవసాయ అనుబంధ రంగాలు సమముగా ముందుకు సాగితేనే బహుళ ప్రయోజనకారి గా రైతులకు వ్యవసాయరంగం భరోసానిస్తుంది. ప్రధాని ఆశించిన విధంగా 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపయి, రెట్టించిన ఉత్సాహంతో రైతులోకం, దేశ వ్యవసాయరంగం పురోగమించాలి. జాతికి వెన్నెముక అయిన రైతు బలహీనపడి కుంగిపోకుండా పటిష్టమైన విధానాలతో అన్నదాతకు వెన్నుదన్నుగా నిలిచి అన్నదాతా.....సుఖీభవ అన్న దీవెనను సాకారము చేయడమే మోదీ ప్రభుత్వము ప్రధాన కర్తవ్యము.

**ఎ.శ్యామ్ కుమార్,**
**హన్మకొండ,జి.వరంగల్(అర్బన్).**

Published by: Pausumi Basu, IAS Chief Executive Officer, on behalf of TSIRD,Govt. of Telangana, Hyderabad.



టిఎస్ఐఆర్‌డిలో హరితహారంపై అటవీ శాఖ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న
పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు మరియు ఇతర అధికారులు



టిఎస్ఐఆర్‌డి తోపాటు రాజేంద్రనగర్ మరియు హసన్‌పర్తి విస్తరణ శిక్షణా కేంద్రాల అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న
టిఎస్ఐఆర్‌డి మఖ్యకార్యనిర్వహణాధికారి శ్రీమతి పౌసమి బసు ఐఏఎస్



మహిళ మరియ శిశు సంక్షేమ కేంద్రం వారు రూపొందించిన జెండర్ హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న టిఎస్ఐఆర్‌డి ముఖ్యకార్యనిర్వహణాధికారి
శ్రీమతి పౌసమి బసు ఐఏఎస్ మరియు టిఎస్ఐఆర్‌డి అధికారలు

*Published on 15-08-2018* *Sthanika Paalana* *RNI No.APTEL/27888/2009.*




తాజా సమాచారం కోసం **www.tsird.gov.in**

మరియు YouTube facebook /tsird